# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

శుక్రవారము, జూలై 9, 2004

12 వ శా. స. I (II) స. వాల్యూం -- IV నంబరు -- 2

శక సంవత్సరము - 1926, ఆషాఢం - 18

**FRIDAY, THE 9th JULY, 2004**

**12 L.A. I (II) S. VOL-- IV No. - 2**

**18 - Ashada , 1926 - S.E.**

#

శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ కె. ఆర్. సురేష్‌రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ సి. నర్సిరెడ్డి<br>శ్రీ బి. వేదవ్యాస్<br>డా. జి. కుతూహలమ్మ<br>శ్రీ డి. శ్రీధర్ బాబు<br>శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| సంయుక్త కార్యదర్శి | : | శ్రీమతి వి. జయకుమారి |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి. వెంకటరామారావు<br>శ్రీ ఎస్.ఆర్.సి. నర్సరాజు<br>శ్రీ బి. పద్మారెడ్డి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఐ. రాధాకృష్ణమూర్తి<br>శ్రీ ఎస్. వెంకటేష్<br>శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ యు. జగదీశ్వర్<br>శ్రీ ఎన్. అంజయ్య<br>శ్రీ డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ డి. నర్సింహులు |

--------

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
# అధికార నివేదిక

( పన్నెండవ శాసనసభ)

( మొదటి సమావేశం కాలంలోని రెండవ సమావేశపు పద్నాల్గవ రోజు )

**శుక్రవారము, జూలై 9, 2004**

సభ ఉ. గం. **8.30** లకు ప్రారంభమైనది

( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

**9-7-2004**

విషయ సూచిక


1. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు
2. స్వల్ప వ్యవధి ప్రశ్నలు
3. జీరో అవర్

4. చట్టబద్ధ తీర్మానము

2003, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసులకు నియామకముల క్రమబద్ధీకరణ మరియు సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధముచేయు (సవరణ) ఆర్డినెన్సు

(నిరాకరించబడినది)

5. ప్రభుత్వ బిల్లు

2004, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసులకు నియామకముల క్రమబద్ధీకరణ మరియు సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధముచేయు (సవరణ) బిల్లు (ఎల్.ఎ.బిల్లు నెం.4/2004 )

(ఆమోదించబడినది)

6. 304వ నియమము క్రింద ప్రస్తావించబడిన అంశము

బొగ్గుగనుల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమము

----------

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

## ఏజన్సీ ప్రాంతాలలో గిరిజనుల మరణాలు

ప్రశ్న నెం. 111(79-బి )

సర్వశ్రీ జి. దేముడు (చింతపల్లి), ఎల్.రాజారావు (పాడేరు) – గౌ. ముఖ్యమంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారాః

(అ) ఏజెన్సీ ప్రాంతాలలో నివశిస్తున్న గిరిజనులు వైరల్, మలేరియా జ్వరాల మూలంగా మరణిస్తున్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందా?

(ఆ) అయితే, వాటిని నివారించడానికి తీసుకోదలచిన చర్యలేమిటి?

(ఇ) అట్టి కేసులలో ఎక్స్‌గ్రేషియాను చెల్లించే ప్రతిపాదనలు ఏవైనా ఉన్నాయా ?

**ముఖ్యమంత్రి తరపున ఆర్థిక శాఖ మంత్రి (శ్రీ కె. రోశయ్య ):**

(అ) వైరల్ జ్వరాలు, మలేరియా వల్ల మరణించిన కొన్ని కేసులు నమోదు అయ్యాయి.
(ఆ) కేసులను కనుగొని, చికిత్స చేయడానికి శీఘ్ర సర్వేలు, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడం, టెస్టుల కోసం రక్తపు మచ్చులను సేకరించడం, సీరియస్ కేసులను చికిత్స కొరకు రెఫరల్ ఆసుపత్రులకు రిఫర్ చేయడం, అత్యధికంగా ఈ వ్యాధులు ఉన్న ప్రాంతాలలో స్ప్రేయింగ్‌ను చేపట్టడం, సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు అత్యవసరమైన మందులను సమకూర్చడం, ప్రజలను జాగృతం చేయడానికి ఐఇసి కార్యకలాపాలను ఏర్పాటు చేయడం, సమన్వయికరణ దృష్టితో స్థానిక సంస్థలను ప్రమేయం కల్పించడం వంటి వివిధ చర్యలను తీసుకోవడం జరిగింది.
(ఇ) లేదండీ .

శ్రీ జి. దేముడు : అధ్యక్షా, ప్రశ్న వేస్తే ఆలస్యమవుతుందని మొన్ననే నేను, రాజారావుగారు, అయ్యన్నపాత్రుడుగారు జీరో అవర్‌లో రేయిజ్ చేయడం జరిగింది. అక్కడి పరిస్థితులు చాలా సీరియస్‌గా ఉన్నాయి, చాలా మంది చనిపోతున్నారు. మొన్నటి డాక్యుమెంట్‌లో ఇచ్చారు ఎంత మంది చనిపోయారో . అయితే ఆ మరణాలు మలేరియా వల్ల కాదని చెప్పారు. మరి దేని వల్ల చనిపోయారు ఒకటి . రెండవది, ఈ ఒక్క సంవత్సరం కాదు, ప్రతి సంవత్సరం వందల మంది చనిపోతున్నారు. ఏ కారణం వల్ల చనిపోతున్నారని అటు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా,ఇటు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా సర్వే చేసింది. ఈ సర్వేలో ఏమి ఉంది? ముందు జాగ్రత్త చర్యలు ఎందుకు తీసుకోలేదు? మలేరియాకు సంబంధించి గతంలో ఒక జిల్లా ఆఫీసర్, ఆయన కింద ముగ్గురు అసిస్టెంట్ ఆఫీసర్లు ఉండేవారు. ఇప్పుడు అక్కడ కింది ఆఫీసర్లు లేరు. అట్లాగే మలేరియా నిర్మూలన కింద పనిచేయవలసిన సిబ్బందిని ఫ్యామిలీ ప్లానింగ్ వంటి కార్యక్రమాలకు వినియోగించుకోవడం వల్ల అసలు కాన్సెప్ట్‌ను వదిలివేస్తున్నారు. దాని వల్ల కూడా మలేరియా వ్యాధి ఎక్కువై, దాని వల్ల ఎక్కువగా చనిపోతున్నారు. ఎవరైతే గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో చనిపోతున్నారో వారు మలేరియా వల్ల చనిపోవడం లేదని అంటున్నారు. నేను మీ ద్వారా ఒకటి అడుగుతున్నాను. ఉదాహరణకు నా నియోజకవర్గాన్నే చూస్తే ప్రక్కనే ఉన్న నర్సీపట్నం, చోడవరం ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి అక్కడికక్కడే రిపోర్టులు తీసుకోమనండి. కేవలం మలేరియా వల్లనే వారంతా చనిపోయినట్లుగా ఈ రిపోర్టులు ఉంటున్నాయి. స్ప్రేయింగ్ కొట్టిస్తున్నామని చెపుతున్నారు. ఎక్కడ కొట్టిస్తున్నారు? కొన్ని ఏరియాల్లో మాత్రమే కొట్టిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోనే ఎక్కువగా చనిపోతున్నారు. వారికి సకాలంలో వైద్యం అందడం లేదు. అటువంటి ప్రాంతాల్లో స్ప్రేయింగ్ కొట్టడం లేదు. అంతేకాకుండా ఆ ప్రాంతాల్లో మంచి నీటి సమస్య కూడా ఉంది. వారికే అన్ని సమస్యలున్నాయి. ఎక్కువగా ఆదిమ జాతి గిరిజనులు చనిపోతున్నారు. అక్కడ స్ప్రేయింగ్ చేయడం లేదు. జిల్లా మలేరియా ఆఫీసర్ అత్యవసర పరిస్థితుల్లో రెండు వేల రూ.లు వరకు డ్రా చేసి, ఖర్చు చేయడానికి అధికారం ఉంది, అంత కంటే ఎక్కువ ఖర్చు పెట్టడానికి వీల్లేదు. దాని వల్ల వెంటనే మందుల కొనుగోలుకు కాని, ఇతర అవసరాలకు కాని ఖర్చు పెట్టడానికి వీల్లేకుండా ఉంది. కాబట్టి గిరిజన ప్రాంతాల్లో ఇటువంటి మరణాలు తిరిగి జరగకుండా ఉండేందుకు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నారు? ప్రధానంగా అక్కడ ఉన్న మంచి నీటి సమస్యను ఏ విధంగా పరిష్కారం చేస్తారు? మారుమూల గ్రామాల్లో ఇప్పటి వరకు స్ప్రేయింగ్ చేయలేదు. ఇప్పుడు చేయిస్తారా అని మీ ద్వారా అడుగుతున్నాను.

శ్రీ కె.రోశయ్య :అధ్యక్షా, దేముడుగారు, రాజారావుగారు, మిత్రులు అయ్యన్నపాత్రుడుగారు మొన్ననే జీరో అవర్‌లో రేయిజ్ చేయడం జరిగింది. రేయిజ్ చేసిన తరువాత వెంటనే జోనల్ అధికారిని పంపించాము. ఇప్పటి వరకు పది ట్రిప్స్ వెళ్లి వచ్చారు. మారుమూల ప్రాంతాల్లో తిరిగి వచ్చారు. తిరిగి, కావలసిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వారు మరణాల గురించి చెప్పారు. అధ్యక్షా, normal rate of deaths సంవత్సరానికి ఒక వేయి మందిలో పది మంది వరకు చనిపోతుంటారు అనేది

సహజంగా ఉన్న లెక్క.   వారు రెఫర్ చేసిన ఏజెన్సీ ప్రాంతాలన్నీ కలిపి on an average అంటే మలేరియా వల్ల  కానివ్వండి, ఇతర రుగ్మతల వల్ల కానివ్వండి మరణాల సంఖ్య 1442.  పాపులేషన్ 5,76,459.  అధ్యక్షా, మరణాలను పర్సేంటేజ్‌తో జత చేయడం కాదు.  అంటే  ఒక యాంగిల్ నుండి ఏమైనా ఇది  alarmaing గా ఉందా? ఏమిటి దీనికి తీసుకున్న చర్యలు చాలడం లేదా  అనే  పరిశీలించడానికి  ఈ కృషి అంతా జరిగింది.  వారు మారుమూల ప్రాంతాల్లోకి వైద్యులు రాలేదన్నారు.  నేను ఇమ్మిడియేట్‌గా అధికారులకు  చెపుతాను. వారు   ఏ ప్రాంతానికి రాలేదో మీకేమి అభ్యంతరం లేకపోతే దయచేసి నాకు కొద్దిగా ఆ ఇన్‌ఫర్మేషన్ ఇవ్వండి, I will ask them.  వారు  వెళ్లి  వచ్చినా, మళ్లీ వెళ్లి రమ్మంటాను . దీనిని కంట్రోలు చేయడానికి అనేకమైన ప్రయత్నాలు చేయడమే కాక, వైజాగ్‌లోని సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్స్ వారు మెడికల్ క్యాంప్స్ నడుపుతున్నారు.  మెడికల్ డిపార్టుమెంట్ తన శక్తినంతా కూడగట్టుకుని ప్రయత్నం చేస్తున్నది.  ప్లస్, బయట నుండి కూడ సహకారం తీసుకుంటున్నారు. చోడవరం, నర్సీపట్నం హాస్పిటల్స్‌లో  డెత్స్  ఏ కారణాల వల్ల జరిగింది ఏమిటి అని నమోదు చేశారు.  వీటిని క్రాస్ చెక్ చేయమన్నారు.  తప్పకుండా చేయిస్తాను.  లోకల్‌గా ఉన్న డేటాతో  కారణాలను కూడా క్రాస్ చెక్ చేయిద్దాము తప్పేమి లేదు.

శ్రీ ఎల్. రాజారావు : అధ్యక్షా, మా గ్రామీణ ప్రాంతంలో  జ్వరాలతో చనిపోతున్న విషయాన్ని తమరి ద్వారా సభ దృష్టికి తీసుకుని వచ్చిన తరువాత ప్రభుత్వం దయతో  స్పందించి ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య బృందాలను పంపిన మాట వాస్తవము.   ఈ బృందాల ద్వారా వైద్యం జరుగుతున్నది కాని హైదరాబాద్ నుండి ఒక అసిస్టెంట్ డైరక్టర్‌ను అక్కడకు డెప్యూటేషన్ మీద పంపించారు.  అధికారులు ఇచ్చిన రిపోర్టులో చూసినట్లయితే మలేరియా  జ్వరాల వల్ల మరణించలేదన్న విషయం తెలియచేశారు. అయితే ఈ రోజు ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న  వైద్యం ఏమిటంటే, ఏ జ్వరం వచ్చినా మలేరియా మందులతోనే వైద్యం చేయిస్తున్నారు.  ఒకవైపున మలేరియా లేదంటూ, మరో ప్రక్క మలేరియా మందులతోనే ఎందుకు వైద్యం చేయిస్తున్నారు? ఈ రోజున ఏజెన్సీ ప్రాంతంలో చాలా మంది చనిపోతున్నారు.  పెద్దబయలు మండలం గంభీవాయి పంచాయితీలో వంతాల సుబ్బారావు, s/o బాలన్న , 18 సంవత్సరాలు, ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి నాలుగు రోజుల క్రితం చలి జ్వరంతో  చనిపోయాడు.  అంటే అది ఏమి జ్వరం?  దేని వల్ల చనిపోతున్నారు?  గిరిజన ప్రాంతాల్లో త్రాగునీటి సదుపాయం లేదు.  ఐటిడిఏ మీటింగ్‌లోనూ, జిల్లా పరిషత్ మీటింగ్‌లోనూ కలెక్టరును అడుగుతుంటే, నిధులు లేవని చెపుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో తప్పకుండా వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించవలసిన అవసరం ఉంది.  దానికి గాను ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు.

తరువాత, అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఓ పోస్టు ఖాళీగా ఉంది.  గిరిజన ప్రాంతంలో 11 మండలాలున్నాయి.  ఏ అధికారి కూడా మొత్తం ఆ మండలాలన్నీ తిరిగి వైద్య సదుపాయాలు అందుతున్నాయా లేదా  పర్యవేక్షించే పరిస్థితి లేదు.  ఈ పోస్టు సంవత్సర కాలం నుండి ఖాళీగా ఉంది.  ఈ విధంగా వైద్య సదుపాయాల లోపం వల్లనే గిరిజన ప్రాంతాల్లో మరణాలు సంభవిస్తున్నాయి అనేది ఒక కారణం కాగా,  మంచి నీటి సదుపాయం లేకపోవడం రెండవ కారణం .  ఆ తరువాత చాల గ్రామాల్లో తినడానికి తిండి కూడా దొరకడం లేదు.    ఈ సీజన్‌లో ఇంచుమించు మూడు, నాలుగు మాసాల కాలంలో చాలా గ్రామాల్లో ఉన్నటువంటి గిరిజనులు స్థానికంగా లభించే పనసకాయల నుండి తొనలు తీసి ఉడకబెట్టి తింటూ కాలక్షేపం చేసే పరిస్థితి  ఉంది. ఆ విధంగా అక్కడ ఆహార సమస్య కూడా ఉంది.  దీనిని పరిష్కరించకుండా మంచి వైద్యం ఇవ్వడానికి అవకాశం లేదు.   అంచేత ప్రభుత్వం దయతో ఆలోచించి దీనికి సంబంధించి ప్రత్యేక నిధులు కేటాయించాలి.  అదే విధంగా  ఏ జ్వరం వల్ల ఇక్కడ ప్రజలు చనిపోతున్నారనే విషయాన్ని అధికారులు ఇంకా నిర్ధారించలేదు.  కాబట్టి ఏజెన్సీ ప్రాంతంలోకి వైద్య నిపుణులను పంపించి, రోగ నిర్ధారణ చేయించాలి.  అందుకు ప్రభుత్వం వైద్య బృందాలను పంపించే ఆలోచన చేస్తుందా లేదా?
ఉ. 8.40

డా.కె.రవిబాబు (శృంగవరపుకోట): అధ్యక్షా, ఈవేళ ఏజెన్సీ ప్రాంతమైన విశాఖపట్టణం జిల్లాలో జ్వరాలతో రోజూ చాలా మంది చనిపోతున్నారు. ఈ విషయాన్ని గతంలో సభ దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి ఒక మంచి అధికారిని అక్కడకు పంపించారు. అయినప్పటికీ కూడా సరైనటువంటి వైద్యం సకాలంలో అందక, ఇప్పటికీ కూడా మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. నిన్న జి.మాడుగుల మండలంలో ఒంటిగంటకు శంకర్‌రావు, నిర్మల అనే ఇద్దరు వ్యక్తులను హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లితే, మూడు గంటలకు డాక్టర్ అటెండ్ కావడం జరిగింది. అయితే డాక్టర్ అటెండ్ అయ్యే లోపలే వారి ప్రాణాలు పోవడం జరిగింది. సకాలంలో వైద్యం అందక అక్కడ ఉన్న గిరిజనుల ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను క్షుణ్ణంగా చూస్తే తప్ప అక్కడ ఏమి జరుగుతుందో తెలియదు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఏదైనా జ్వరాలు వచ్చినపుడు ఆ ప్రాంతానికి వైద్య బృందాలు సకాలంలో వెళ్లకపోవడం వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నం అవుతున్నది. డాక్టర్స్ కానివ్వండి, హెల్త్ అసిస్టెంట్స్ కానివ్వండి పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి. సకాలంలో సరైనటువంటి వైద్యం అందకపోవడం వల్ల ఇవన్నీ జరుగుతున్నాయి. దీనికి ప్రధానమైన కారణాలు అన్వేషించి, ఆ మార్గాల ద్వారా సరైనటువంటి వైద్య సదుపాయాలు అందించగల్గితేనే ఇది సాధ్యమవుతుంది. ఈ సీజన్ వచ్చేటప్పటికి ప్రతి సంవత్సరం మనం చూస్తున్నాము చాల మంది చనిపోతున్నారు. దీనిని కనుక అరికట్టకపోతే, అక్కడి ప్రజానీకం మన పట్ల విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉంది. రోజూ పొద్దున లేవగానే మా గ్రామాల్లో ఇంత మంది చనిపోతున్నారు, మీరేమి చేస్తున్నారంటూ మేము ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకుంటున్నాము. ఇవ్వాళ ఉదయం లేవగానే అరకు వ్యాలీలోని హాస్పిటల్‌లో కనీసం 50 మంది మలేరియా జ్వరంతో చేరినట్లుగా తెలిసింది. అక్కడ వైద్యం సకాలంలో అందని పరిస్థితులున్నాయి. కనీసం మండల హెడ్‌క్వార్టర్స్‌లో ఉండే హాస్పిటల్స్‌కు వారిని తీసుకుని వచ్చేందుకు అంబులెన్స్ సౌకర్యం కూడా లేదు. సకాలంలో వైద్యం అందించాలంటే డాక్టర్స్‌ను, తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలి. హెల్త్ అసిస్టెంట్ క్యాటగిరిలో కూడా చాలా ఖాళీలున్నాయి.

మిస్టర్ స్పీకర్ : ప్రశ్న అడగండి. ప్రశ్నలు అడిగితే మిగతా సభ్యులు కూడా మాట్లాడటానికి అవకాశం వస్తుంది.

డా.కె. రవిబాబు : ముంచింగ్‌పుట్టు మండలంలో గత నాలుగు రోజుల్లో ఏడుగురు చనిపోయారు. దీనికి సంబంధించిన వివరాలను మీరు పరిశీలిస్తే మీకు స్పష్టంగా అర్థమవుతుంది. ఇది ఒరిస్సా, ఆంధ్ర రాష్ట్రాల బార్డర్‌లో ఉంది. ఈ మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లాలంటే కనీసం 15, 20 కిలోమీటర్లు నడిస్తే తప్ప, ఆ గ్రామాలకు చేరుకోలేము. కాబట్టి మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సకాలంలో వైద్యం అందించాలంటే కమిట్‌మెంట్ ఉన్న డాక్టర్స్ ముఖ్యంగా హెల్త్ అసిస్టెంట్సును అక్కడకు పంపించవలసిన అవసరం ఎంతైనా ఉంది.....

మిస్టర్ స్పీకర్ : దయచేసి ప్రశ్న అడగండి. చాలా మంది సభ్యులు అడగాలి.

డా.కె.రవిబాబు : నా రిక్వెస్టు ఏమిటంటే హెల్త్ అసిస్టెంట్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. వాళ్లు మారుమూల ప్రాంతాలకు తప్పకుండా వెళ్లేటట్లు చూడండి.

శ్రీ ఆర్.పి. భాంజ్‌దేవ్ (సాలూర్): మలేరియా జ్వరాల వల్ల అయితేనేమి, అతిసార వ్యాధుల వల్ల అయితేనేమి ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు అత్యధికంగా చనిపోతున్నారు. ఒక్కొక్క ఎ.ఎన్.ఎం.కు అయిదారు పంచాయితీలు ఉండటం వల్ల సకాలంలో గిరిజనులకు వైద్యం అందకపోవడం వల్లనూ మరియు గిరిజనులకు వ్యాధుల పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్లనూ చనిపోతున్నారు. గత ప్రభుత్వం దీనిని గుర్తించి, సుమారు 8500 మంది హెల్త్ వర్కర్లను తీసుకోవడం జరిగింది. అయినప్పటికీ ఇంకా సిబ్బంది కొరత ఉండటం, అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పిహెచ్‌సిల్లో డాక్టర్లు స్థానికంగా ఉండకపోవడం వల్ల కూడా సకాలంలో వైద్యం అందక చనిపోతున్నారు. వ్యాధి వచ్చిన గిరిజనులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల వెంటనే

హాస్పిటల్‌కు వెళ్లకపోవడం, వెళ్లినా సరైన టైమ్‌లో డాక్టర్స్ ఉండకపోవడం వల్ల కూడా ఎక్కువగా చనిపోతున్నారు. అంతేకాకుండా సరైన పోషక ఆహారం లేకపోవడం వల్ల గిరిజనుల్లో ఎక్కువగా రక్త హీనత ఉంటుంది. అటువంటి వారికి సరైన పోషక పదార్థాలు కూడా లభించేటట్లు చూడాలి.

నిన్న రోశయ్యగారు మాట్లాడుతూ అడవి మనుష్యులుగా ప్రవర్తించవద్దని అన్నారు. దయచేసి గిరిజనులు అంటే అడవి మనుష్యులుగా గుర్తించకుండా, వారు కూడా సమాజంలోని ఇతర పౌరులుగా గుర్తించి, వారికి సకాలంలో వైద్య సదుపాయం అందించేటట్లు వైద్య సిబ్బందిని నియమించి, వైద్య సౌకర్యాలు అందేటట్లుగా చూడవలసిందిగా కోరుతున్నాను.

(కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుండి అంతరాయం )

శ్రీ ఎస్. విజయరామరాజు : అధ్యక్షా, వారు ఈ సబ్జెక్టుకు సంబంధించి మాట్లాడితే బాగుంటుంది. గతంలో ఎన్.టి.రామారావుగారే అడవి రాముడు అనే సినిమా తీశారు. అడవి రాముడు అన్నందుకు I am proud of it.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి అంతరాయం )

మిస్టర్ స్పీకర్ : వినండి, మినిస్టర్‌గారు ఏమి చెపుతారో !

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, ఈ ప్రశ్న యొక్క ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ప్రశ్నలు వేశారు, నేను జవాబు చెప్పాను. ఇంకేమైనా సందేహాలుంటే వారు అడగవచ్చు. నా దగ్గర ఉన్న సమాచారాన్ని అందించడానికి, తగు జాగ్రత్తలు తీసుకొనడానికి ప్రభుత్వం ఎప్పుడూ కూడా వెనకాడదనే మాట మనవి చేస్తున్నాను. యాక్చ్యువల్‌గా ఇదివరకు తీసుకున్నటువంటి స్టెప్స్ ఏమిటి అనేది ఒక ప్రశ్న. దీనిని కంట్రోల్ చేయడానికి చర్యలు తీసుకుని ఉంటే సత్ఫలితాలు వచ్చేవి, మరణాలు కంట్రోలు అయి ఉండేవి కదా అని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్టణం నుండి అనేక మంది డాక్టర్లను ఐటిడిఏ ఫండ్స్ సహాయంతో తీసుకొని వెళ్లి అక్కడ క్యాంప్స్ నిర్వహించడమే కాకుండా, కొంత మంది రోగులను వైజాగ్ తీసుకొని వచ్చి ట్రీట్‌మెంట్ చేసి, తిరిగి పంపించిన కేసులు కూడా ఉన్నాయి. అధ్యక్షా, అంతేకాకుండా residual spray for Malaria control during 2004 కింద 9 జిల్లాలకు చెందిన సమాచారం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో number of villages sprayed 246, population targetted 1,43,733, covered 1,28,126. అలాగే ఇళ్లు 30,713 కవర్ చేయాలనుకున్నారు, అందులో 26,998 ఇళ్లు కవర్ చేశాము. ఇలా 9 జిల్లాలకు సంబంధించిన సమగ్రమైన సమాచారం కూడా ఉంది. ఇది మాత్రమే కాకుండా 14,042 మరణాలకు సంబంధించి ఏ జబ్బుతో ఎంత మంది మరణించారు అనేది చాలా వివరంగా స్టేట్‌మెంట్ కూడా ఉంది. అయితే నేను డిస్‌ప్యూట్ చేయడం లేదు. అయితే మిత్రులు మలేరియా వల్లే చనిపోయారని భావిస్తున్నారు. వైరల్ ఫీవర్ వల్ల పోయిన వారు కూడా ఉన్నారు. అంతే కాకుండా ఈ fever cases detected, treated and Malaraia positive cases treated in tribal areas of Andhra Pradesh కూడా ఉంది.

ఉ. 8.50

స్టాఫ్ కి సంబంధించినంత వరకూ సరిగ్గా స్టాఫ్ లేరని చెప్పారు. ట్రైబల్ ప్రాంతాలలో ఉండవలసిన అన్ని రకాల వైద్య శాఖలలోను కలిపి 2,387 మంది ఉండాలి. 156 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. పాడేరులో హెల్త్ అసిస్టెంట్ పోస్టు ఒక్కటి మాత్రమే ఖాళీగా ఉంది. 156 ఖాళీలను త్వరలో భర్తీ చేస్తాము. 35 మంది వైద్య బృందాలను ఏర్పాటు చేసి, ప్రతి గ్రామాన్ని ఇప్పటి వరకూ స్క్రీన్ చేశాము. నాలుగు లక్షల మందికి ఇప్పటి వరకూ పరీక్షలు చేయడం జరిగింది. 19 అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చెయ్యడం

జరిగింది. 235 మంది పేరా మెడికల్ సిబ్బందిని అక్కడున్న వారు కాకుండా, అదనంగా ఇతర ప్రాంతాల నుంచి మొబిలైజ్ చేసి పాడేరుకు తరలించడం కూడా జరిగింది. మందుల గురించి అడిగారు. సాధ్యమయినంత వరకూ మందులు సరఫరా చేస్తున్నాము. ఇంకా కొరత ఉంటే కనుక్కుని ప్రయారిటీ మీద అక్కడకు మందులు పంపే ప్రయత్నం కూడా చేస్తాము.

శ్రీ జి. దేముడుః ఒక్క క్లారిఫికేషన్. విషజ్వరాలు, మలేరియాలతో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇస్తారా అంటే లేదు అన్నారు. చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా వరంగల్, కరీంనగర్ జిల్లాలలో దళిత విద్యార్థులు చనిపోతే రు. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన మాట వాస్తవం అవునా, కాదా? ఇప్పుడు చనిపోయిన వారు కూడా దళితులే. వీరికి కూడా ఇస్తారా, లేదా? చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రిగారే అన్నారు. చాలా మంది గిరిజనులు ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్స్ ట్రెయినింగ్ అయిన ఖాళీగా ఉన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులలో వారిని భర్తీ చేస్తారా, లేదా? చనిపోయిన వారిలో విద్యార్థులు, ఎఎన్ఎం లు కూడా ఉన్నారు. వీరే ఉంటే సమస్య ఎంత తీవ్రతగా ఉందా ఆలోచించాలి. ప్రభుత్వానికి తెలుసు. ఖాళీ పోస్టులను ట్రెయినింగ్ అయిన వారితో భర్తీ చేస్తారా, లేదా? చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇస్తారా, లేదా?

శ్రీ కె. రోశయ్యః అధ్యక్షా, రాష్ట్రంలో మొత్తం మీద అనేక హాస్పటల్స్‌లో ఖాళీలు ఉన్నాయి. మామూలుగా ఇచ్చే ప్రాధాన్యతే కాకుండా, గిరిజన ప్రాంతాలలో ప్రయారిటీ మీద భర్తీ చెయ్యడానికి ప్రయత్నిస్తాము. కరీంనగర్, వరంగల్ జిల్లాలలో చనిపోయిన వారికి గత ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చిందన్నారు. రెడీగా దాని గురించి నా వద్ద సమాచారం లేదు. వెరిఫై చెయ్యవలసిన అవసరం ఉంది. కనుక్కుంటాను. మరణాలు అనేక కారణాలతో సంభవిస్తున్నాయి అని చెప్పాను. క్లారిఫికేషన్ చదివి వినిపిస్తే కొంత విసుగు రావచ్చును. ఎన్ని రకాల జాడ్యాలు వైద్య శాస్త్రంలో ఉన్నాయో, దేని క్రింద ఎంత మంది చనిపోయారు, ఏ ఏ జిల్లాలలో ఎంత మంది చనిపోయారు, ఏ సంవత్సరంలో ఎంత మంది చనిపోయారు అనేది పెద్ద స్టేట్‌మెంట్ ఉంది. ఈ అంకెలతో విసిగించదలచుకోలేదు. ఈ వ్యాధి వ్యాప్తి కాకుండా ఉండడానికి, ప్రాణాలు పోకుండా ఉండడానికి ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. ప్రక్కన గల విశాఖపట్నం నుంచి కానీ హైదరాబాదు నుంచి కానీ ఉన్నత అధికారులను పంపాము. మలేరియా ఆఫీసర్ – జోనల్ ఆఫీసర్‌ను రాజమండ్రి నుండి ఆల్‌మోస్ట్ ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి పంపి, క్యాంప్ చేయించి పర్యవేక్షణ చెయ్యడం జరుగుతోంది. సకల జాగ్రత్తలు తీసుకుంటున్నాము. మారుమూల ప్రాంతాలకు పోలేదని అన్నారు. ఆ వివరాలు ఇస్తే తప్పకుండా ఆ గ్రామాలకు వెళ్లమని చెబుతాను. ఈ సమస్య ప్రభుత్వ దృష్టిలో ఉంది. నిర్లక్ష్యం చెయ్యడం లేదు. తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాము. సభ్యులు దయచేసి ఇది అర్థం చేసుకోవాలి.

(ఇంటరప్షన్స్)

మిస్టర్ స్పీకర్ః ఇంకా ఏదయినా ఉంటే డిమాండ్స్‌లో మాట్లాడండి.

## పెద్దతరహా, చిన్నతరహా నీటి పారుదల కాలువలకు మరమ్మత్తులు

ప్రశ్న నెం. 112 (542)

శ్రీ కె.పి. కొండారెడ్డి(మార్కాపూర్), శ్రీ గాదె వెంకట రెడ్డి (బాపట్ల)– గౌరవనీయులైన భారీ సాగునీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారాః

అ) కృష్ణా డెల్టాలో నీటిని విడుదల చేయడానికి ముందే భారీ, చిన్న తరహా కాలువలకు, ఫీడర్ కాలువలకు మరమ్మత్తులు చేపట్టేందుకు ఏదైనా ప్రతిపాదన వుందా?
ఆ) అయితే వాటి వివరాలు ఏమిటి? మంజూరయిన మొత్తమెంత?

**భారీ సాగు నీటి శాఖ మంత్రి ( శ్రీ పొన్నాల లక్ష్మయ్య)ః**

అ) అవునండీ
ఆ) కృష్ణా జిల్లాలో రు. 43,605 లక్షల మొత్తంతో కీలక అంతరాలలో 71 పనులు, రు. 56.529 లక్షల మొత్తంతో 48 ఓ.ఎం పనులను చేపట్టడమయింది. అవి పురోగతిలో వున్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాలలోరు. 161.52 లక్షల మొత్తంతో 180 ఓ.ఎం పనులను చేపట్టడమయింది. వాటిలో రు. 43.83 లక్షల వ్యయం కాగల 62 పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 118 పనులకు టెండర్లను కోరడమయింది. కాలువ మూసివేసిన సమయంలో ఈ పనులను చేపట్టడమవుతుంది.

శ్రీ కె.పి. కొండారెడ్డిః అధ్యక్షా, మీ ద్వారా మంత్రిగారిని కొన్ని విషయాలు కోరుతున్నాను. కృష్ణా డెల్టా , గుంటూరు, ప్రకాశం జిల్లాలలో సాగు నీరు కంటే మంచినీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పటిలోగా నీరు వదులుతారు? ఈ ప్రాజెక్టు దాదాపు 150 సంవత్సరాల క్రితం కాటన్ కట్టించారు. కాలువల ఆధునీకరణకు ఎంత ఖర్చు చేశారు? ఇది వరకు ప్రారంభమయినా వాటిని నామినేషన్ మీద ఇచ్చారా, టెండర్ల మీద ఇచ్చారా? ఎప్పుడు మొదలు పెడతారు? పెట్టారా, లేదా? ప్రస్తుతం కాలువలలో నీరు లేదు 118 పనులు ఉన్నాయన్నారు. నీరు లేక కనుక పనులు త్వరగా పూర్తి చేసి, చివరి భూములకు కూడా ప్రకాశం జిల్లాలో నీరు ఇవ్వడానికి గాను మోడ్రనైజేషన్ త్వరగా పూర్తి చేస్తారా, లేదా?

శ్రీ గాదె వెంకట రెడ్డిః 1853–55 సంవత్సరాలలో కాటన్ గారు ఆనకట్టను కట్టారు. అప్పుడు కృష్ణా డెల్టా ఆవిర్భవించింది. 150 సంవత్సరాల తరువాత కూడా సమగ్రమైన రిపైర్స్‌కాలువలకు జరగలేదు. కృష్ణా డెల్టా మోడ్రనైజేషన్ పేరుతో ప్రపోజల్స్‌ను గవర్నమెంట్‌కు పంపాము. 1996లో కేంద్రం నుంచి పర్మిషన్ రు. 2 వేల కోట్లకు వచ్చింది. కానీ ఒక్క పైసా కూడా ఇందుకు ఖర్చు చెయ్యలేదు. ఈ విషయం ప్రభుత్వం ఆలోచిస్తుందా? ఇది వరకూ ఈ కాలువల పనులు నీటి సంఘాలకు ఇచ్చే వారు. ఆ నీటి సంఘాలు ఏ విధంగా పనులు చేశాయో అందరూ తెలుసు. దానికి పోను. కానీ ప్రొవిజన్ ఉంది. ఆయకట్టు దారులకు కూడా ఈ పనులు అప్పగించవచ్చును. నామినేషన్ మీద ఇవ్వడానికి పరిశీలిస్తారా? మా ప్రాంతంలో టెండర్స్ పిలిచారు. టెండర్ ఫార్మ్స్‌కి 28వ తేదీ వరకూ పెట్టారు. 16న టెండర్స్ అన్నారు. మంచి నీరు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం కూడా సింపతీగా ఉంది. డెల్టాకు నీరు వదిలిన తరువాత ఈ పనులు జరగవు. బిల్లులు చేసుకుంటారు. కాంట్రాక్టర్లు డబ్బులు తింటారు. కాలువలకు నీరు విడుదల కాకముందే పనులు చెయ్యాలి. ఎప్పుడు చేస్తారు? వెంటనే నామినేషన్ మీద ఇస్తే మంచిది. లేకపోతే పనులు జరగవు. నీరు వచ్చే సరికి, పనులు జరగవు, టెండర్లు అట్లాగే ఉంటాయి. బిల్లులు పెట్టుకుంటారు. దీనిని సరిచేసే ప్రయత్నం చేస్తారా? ఆయకట్టుదారులకు నామినేషన్ మీద పనులు ఇచ్చి, 10, 15 రోజులలో పూర్తి చేయించే ప్రయత్నం చేస్తారా?

శ్రీ పొన్నాల లక్ష్మయ్యః కొండారెడ్డిగారు మాట్లడుతూ త్రాగు నీరు సమస్య విషయం ప్రస్తావించారు. ఇది ప్రభుత్వ దృష్టిలో ఉంది. ఈ మధ్యనే ఈ ప్రాంతాల ప్రజాప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసి, కర్నాటకను కూడా సంప్రదించాము. ఈ విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆశిస్తున్నాను. టెండర్ల విషయం ప్రస్తావించారు. మొదటి టెండర్‌లో 62 పనులు

పురోగతిలో ఉన్నాయి. రెండవ టెండర్‌లో 77 పనులు రు. 47,99,000 లకు, 7 జులైకు తీసుకున్నాము. మూడవ టెండర్ 41 పనులకు రు. 69.7 లక్షలకు రేపస 16వ తేదీన టెండర్స్ పిలుస్తారు. ఈ పనులు త్వరలో పూర్తి చెయ్యడానికి ఆదేశాలు ఇస్తున్నాము. వెంకట రెడ్డిగారు చెప్పారు. మాడనైజేషన్ ఆఫ్ కెనాల్స్ విషయం అడిగారు. ఇప్పటి వరకూ రు. 88 కోట్ల 71 లక్షల పనులు ఎ.పి.ఇ.ఆర్.పి క్రింద తీసుకోవడం జరిగింది. ఈ సంవత్సరం ప్రకాశం బ్యారేజీ పనులు కూడా సుమారు రు. 34 కోట్ల 7 లక్షలతో అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్ ప్రొటెక్షన్ వర్క్స్, బ్యారేజి వర్క్స్ చేపట్టడం జరుగుతుంది. 16 వ తేదీన టెండర్లు పిలిస్తే ఆలస్యమవుతుందని అన్నారు. ఉన్న పద్ధతిలో ఈ కార్యక్రమం చెయ్యడానికి ప్రభుత్వం నిర్ణయించిది. అయినప్పటికీ గౌరవ సభ్యులు అడిగినట్లు ఆయకట్టుదారులకు ఇచ్చే విషయం పరిశీలిస్తామనే మాట చెబుతున్నాను.

ఉ.9.00

శ్రీ పి. కేశవ్ (ఉరవకొండ): అధ్యక్షా, ఇది కృష్ణా డెల్టా మీద ఉన్నప్పటికీ కొంచెం బ్రాడ్ బేస్డ్ చేయమని అడుగుతున్నాను. ఎందుకంటే, ప్రతి సిస్టంలో వాటర్ రిలీజ్ చేస్తున్నారు.

హెచ్ఎల్‌సిలో చాలా లోటుపాట్లు జరుగుతున్నాయి. నీటి విడుదలకు కేవలం 15 రోజుల ముందు, అంటే ఈ నెల 15వ తేదీన నీరు విడుదల చేయబోతూ వుంటే 29-30 తేదీలలో ఎగ్రిమెంట్సు ఫైనలైజు చేసి, వర్క్స్ ఇచ్చారు. అది కూడా చాలా పెద్ద ఎత్తున పనులు ప్రారంభిస్తున్నామని, అవసరం లేని చోట్ల, రైతులకు ఉపయోగం లేని చోట్ల కాంట్రాక్టర్లకు లబ్ధి జరిగేలా జరుగుతోంది. చాలావరకు డీసిల్టింగ్ పేరుతో లక్షల లక్షల రూపాయలు కేటాయించడం జరుగుతోంది. ఇది రైతులకు ఉపయోగం లేదు. ఇవి కేవలం కాంట్రాక్టర్ల జేబులలోకి పోయే పరిస్థితి ఉంది. దీనిమీద ఏ విధమైన చర్య తీసుకుంటారు? అందులో ఎక్కువ పనులు తక్కువ టైములో చేపట్టడం వల్ల సరైన పర్యవేక్షణ లేకుండా పోతోంది. ఒకేసారి ఒక జె.ఇ.కి 30-35 పనులు పెడుతున్నారు. 15 రోజులలో ఒక జె.ఇ. చేయాలంటే సరైన పర్యవేక్షణ జరగదు. జరిగినా నాసి రకంగా పనులు జరుగుతాయి. 15 రోజులలో నీరు వచ్చేక ఏ విధంగా ఉంటుందో ప్రభుత్వ దృష్టికి తెస్తున్నాను. ఏ విధంగా చర్యలు తీసుకుంటారు? ముఖ్యంగా హెచ్.ఎల్.సి.లో చాలా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. జిల్లాలలో పత్రికలన్నీ ప్రధాన శీర్షికలు రాశాయి. కావాలంటే మంత్రి గారికి కాపీలు పంపిస్తాను. దీని మీద ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. ఏ విధంగా చర్యలు తీసుకుంటారు?

శ్రీ ఎం. బుద్ధ ప్రసాద్ (అవనిగడ్డ): అధ్యక్షా, కృష్ణా ఆయకట్టు ప్రాంతానికి ఒక క్యూసెక్కుతో 70 ఎకరాలకు నీరు అందించే విధంగా కాలువల వ్యవస్థ రూపొందించబడింది. కృష్ణా డెల్టాకు తక్కువ నీరు వస్తున్న ఈ పరిస్థితిలో 70 నుంచి 120 ఎకరాలు సాగు చేయడానికి వీలుగా కృష్ణా డెల్టాను ఆధునికీకరించే ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయా? 1995లో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ అధ్యయనం చేసి కృష్ణా డెల్టా ఆధునికీకరణ పై ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశారా? దానిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి? అట్లాగే, కృష్ణా డెల్టా ఆధునికీకరణకి ఆనాడు రూ.650 కోట్లతో తయారు చేసిన ప్రాజెక్టుకి కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందినప్పటికీ ఆచరణకి నోచుకోని మాట వాస్తవమా? కృష్ణా డెల్టా ఆధునికీకరణ పథకాన్ని అమలు చేసే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉందా? ఈవేళ కృష్ణా డెల్టాలో త్రాగునీటికి, సాగునీటికి సంక్షోభం ఉంది. కనీసం త్రాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. అయితే కర్ణాటక నుంచి ఆల్మట్టి నీరు విడుదల చేస్తారన్న వార్తలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయి. కాబట్టి వెంటనే ఆలస్యం చేయకుండా నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషను మంత్రి గారిని కోరుతున్నాను. ముఖ్యమంత్రి గారు కూడా సానుభూతితో ఉన్నారు. సమావేశాలు ఏర్పాటు చేశారు. నీరు విడుదల చేయాలన్న ఆలోచన ఉంది కనుక ఇటువంటి పరిస్థితులలో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ ఇ. రాజేందర్ (కమలాపూర్): అధ్యక్షా, రాజోలిబండ డైవర్షను స్కీము కింద 87,500 ఎకరాలకు నీరు అందించేది ఈ స్కీము. అయితే కట్టకు తూములు కట్టి, లో లెవెల్ ద్వారా నీరు తీసుకోవడం వల్ల మహబూబు నగరు జిల్లా రైతాంగానికి అన్యాయం జరుగుతోంది. ఆ తూములను ఎప్పటిలోగా మూసివేస్తారు?

శ్రీ పొన్నాల లక్ష్మయ్య : అధ్యక్షా, కేశవ్‌గారు హెచ్ఎల్‌సి గురించి అడిగేరు. అట్లాగే ఇక్కడ రిపేరు వర్క్సు డీసిల్టింగ్ వర్క్సు పూర్తిగా అవసరం లేని చోట కాంట్రాక్టర్లు కోసం చేస్తున్నారని మా దృష్టికి తెచ్చారు. వార్తాపత్రికలు కథలు రిపోర్టు చేశాయన్నారు. దీని మీద తప్పనిసరిగా ప్రభుత్వం ఎంక్వయిరీ చేయిస్తుందని చెబుతూ, గౌరవ సభ్యులు చెప్పినట్లు అవసరం లేని చోట్ల డీసిల్టింగ్ పనులు జరగకుండా చేయడానికి ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు తీసుకుంటుంది. అటువంటివి జరగకుండా ప్రభుత్వం చూస్తుంది. పర్యవేక్షణలో లోపాలు లేకుండా ఒక్కొక్క జె.ఇ.కి, ఏ.ఇ.కి ఎన్ని పనులు ఉండాలో ఆలోచించి, ఓవర్‌లోడు లేకుండా సకాలంలో పనులు జరిగే విధంగా బాధ్యతలను అప్పజెప్పడానికి కార్యక్రమాలు తీసుకుంటాము.

బుద్ధ ప్రసాద్ గారు మోడర్నయిజేషన్ గురించి అడిగేరు. మొదటే చెప్పాను. ఎపిఆర్ఇపి కింద దాదాపు రూ.88 కోట్ల 71 లక్షలతో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ప్రకాశం బ్యారేజీలో రూ.34 కోట్లతో అప్‌స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్ వర్క్సు బ్యారేజీ రిపేరు, గేట్సు రిపేరు చేపట్టడం జరిగింది. వాటర్ రిలీజు గురించి ప్రశ్నించారు. ఇది ప్రభుత్వం యొక్క అత్యంత ప్రాధాన్యత క్రింద ఉన్నది. తప్పనిసరిగా త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

అట్లాగే మిత్రులు, గౌరవ సభ్యులు రాజేందర్ గారు రాజోలిబండ గురించి అడిగేరు. దానికి ఈ ప్రశ్నకు సంబంధం లేదు. వేరేగా వస్తే తప్పనిసరిగా సమాధానం చెబుతాను.

శ్రీ గాదె వెంకట రెడ్డి : స్పీకర్ సార్. ఒక మాట మనవి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం డెల్టాకు మంచి నీటి పేరుతోనో, వేరే ఏ పేరుతోనో నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. చాలా సంతోషం. ఒకటి మనవి చేస్తున్నాను. దీనిని నీటి సంఘాలకు ఇవ్వడమా? టెండర్లు పిలవడమా? ఆయకట్టుదారులకు ఇవ్వడమా? టెండర్లు పిలిచి కన్ఫర్మేషను అయి, అగ్రిమెంటు అయ్యేనాటికి నీళ్లు వచ్చేస్తాయి. రిపేర్లు జరగవు. కాబట్టి వెంటనే ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. ఇమీడియెట్‌గా నిర్ణయం చేసి, ఏదో ఒక పద్ధతిలో – షార్టు టెండరు ద్వారానో లేక ఆయకట్టు దారులకిచ్చే లేక నీటి సంఘాల వారికి ఇచ్చే త్వరగా రిపేర్లు చేయించాలి. లేకపోతే నీరు రిలీజు అయ్యేనాటికి రిపేరు పనులు పూర్తి కావు. ఇది పరిశీలించాలని కోరుతున్నాను.

శ్రీ పొన్నాల లక్ష్మయ్య : ఈ పనుల విషయంలో గౌరవ సభ్యులు గాదె వెంకట రెడ్డి గారు అడిగేరు. ప్రస్తుతం ఉన్న నియమ నిబంధనలకు లోబడి షార్టు టెండరు నోటీసు ద్వారా గాని, టెండరు ద్వారాగాని తీసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ అత్యవసరాన్ని బట్టి ఈ రోజే ఆయకట్టు దారులకు గాని, టెండరు ప్రాసెస్ ద్వారా గాని చేపట్టడానికి అధికారులతో సంప్రదించి, తగిన నిర్ణయం తీసుకుంటాము.

## దళితులపై అత్యాచారాలు

ప్రశ్న నెం. 113 ( 243)

సర్వశ్రీ రామయ్య పాటూరు(గిద్దలూర్), రాజయ్య సున్నం(భద్రాచలం), లక్ష్మణమూర్తి కొలాక(నాగూర్), నర్సింహ మస్కు(ఇబ్రహీంపట్నం), నరసింహయ్య నోముల(నక్రెకల్), వీరభద్రం తమ్మినేని(ఖమ్మం), అబ్దుల్ గఫూర్, ఎం.(కర్నూల్), వెంకట

నర్సయ్య కట్టా(మధిర), రంగారెడ్డి జూలకంటి (మిర్యాలగుడ)– గౌరవనీయులైన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

ఎ. దళితులు, బలహీన వర్గాల వారిపై అత్యాచారాలు అధికమవుతున్న విషయం వాస్తవమేనా?
బి. అయితే, కుల విచక్షణను నిర్మూలించడానికి ఎస్‌సి, ఎస్‌టి కమిషనుకు న్యాయపరమైన అధికారాలు ఇచ్చే ప్రతిపాదన ఏదైనా ఉందా?

**సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ డి.ఎస్. రెడ్యా నాయక్) :**

ఎ. అవునండీ . నమోదైన కేసుల సంఖ్య పెరిగింది.
బి. అవునండీ. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల వారిపై జరిగే అత్యాచార కేసులను విచారించేందుకు 2003లోని 9వ చట్టం కింద షెడ్యూల్డు కులాలు / షెడ్యూల్డు తెగల కమిషనుకు న్యాయపరమైన అధికారాలను ఇవ్వడమయినది.

శ్రీ పి. రామయ్య : అధ్యక్షా, కేసులు నమోదైన సంఖ్య పెరిగిందన్నారు. పెరిగింది అంటే ఎప్పటి నుంచి పెరిగాయి? ఎన్ని కేసులు పెరిగాయి? ఇవన్నీ స్పష్టంగా లేవు. ఏదో లైటర్‌వీన్‌లో తీసుకుని మంత్రి గారు సమాధానం చెప్పారు. ఇది సరైనది కాదు. పిసిఆర్ యాక్టు 1955 ఉంది, తమకు తెలుసు. ఎస్‌సి, ఎస్‌టి పీఓఏ యాక్టు 1989 ఉంది. తర్వాత జస్టిస్ పున్నయ్య సిఫారసులు వచ్చిన సంగతి తెలుసు. పున్నయ్య కమిషను కొన్ని సిఫారసులు చేశారు. కొన్ని సిఫారసులను అమలు చేయడానికి గత ప్రభుత్వం 18 జీవోలు ఇష్యూ చేసింది. ఎస్‌సి, ఎస్‌టి కమిషను కూడా అవసరం. ఇవన్నీ జరిగేక కూడా సమాజంలో ఇన్ని కేసులు పెరుగుతున్నాయంటే ఎంత సిగ్గు చేటైన విషయం! గమనించాల్సిన అవసరం ఉంది. నేను అడిగేది, ఎన్ని కేసులు ఉన్నాయి? అంతకు ముందు ఎన్ని ఉన్నాయి? ఎప్పటిలోపు అయ్యాయో మీ సమాధానం చెబుతారా?
ఉ 9 . 10

కాబట్టి గత తొమ్మిది సంవత్సరాలు గానీ, రెండు సంవత్సరాలు గానీ, మూడు సంవత్సరాలు గానీ ఈ కేసులు ఎన్ని నమోదు అయినాయి ? ఎప్పుడు ఎన్ని జరిగాయి ? ఎంతమందికి శిక్షలు పడ్డాయి ? విచారణలో ఉన్న కేసులు ఎన్ని ? ప్రభుత్వం వైపు నుండి ఎంతమంది బాధితులకు సహాయం అందించారో స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉంది . కొన్ని కేసుల నుండి తప్పించుకునే దానికి కండబలం, అధికార బలం, ధనబలం చూసుకుని హత్యలు చేసి తప్పించుకునే పరిస్థితి జరుగుతోంది . ఉదాహరణకు కృష్ణాజిల్లా పెద ఓగిరాల లో దళితమహిళ ఒక ప్రైవేటు నర్సింగ్‌హోంలో పని చేస్తుంటే, రాత్రిపూట ఇంటికి వెళ్లేప్పుడు పట్టుకుని కిడ్నాప్‌చేసు, రేప్‌చేసి చంపివేశారు . ఈ కేసులో అందరూ కూడా పలుకుబడి కలిగినవాళ్లు కావడం చేత ఆటో డ్రైవర్‌మీద కేసు నమోదుచేసి మిగతావాళ్లు మొత్తం తప్పించుకున్నారు . ప్రభుత్వం, పోలీసు కళ్లప్పగించి చూస్తున్నారు . ఈ దళిత మహిళ పట్ల జరిగిన ఘోరానికి సంబంధించి , మిగతా వారి గురించి ప్రభుత్వ ఏమి పట్టుకోగలుగుతున్నారో చెప్పాలి . అ నలుగురిపై కేసు నమోదుచేసి, వారిపై న్యాయ విచారణ జరపాలని కోరుతున్నాను . దీనిపై మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతున్నాను . ఇదే కాదు మహబూబ్ నగర్ జిల్లా పానగల్ మండలం, చింతపల్లి గ్రామంలో బాణామతి పేరుతో కృష్ణయ్య ను దారుణంగా గొంతుకోసి చంపారు . ఇది ప్రభుత్వానికి పట్టదా ? ఈ విషయం మీద ఏమి చర్య తీసుకున్నారు . ? ఇంకొకచోట బసవయ్య అనే దళితుడిని చేతబడి చేశారనే పేరుతో చెట్టుకు కట్టి కొట్టి నా నా హింసలు పెట్టారు . . శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సబ్ జైల్లో అతనిని ఉంచితే మళ్లీ పోలీసుస్టేషనుకు తీసుకువచ్చి చిత్రహింసలు చేసి చంపివేశారు . ఇట్లా జరుగుతుందని ఆలోచన చేసి వీటిని నివారించడానికి పున్నయ్య సిఫారసులు అమలుజరిపే సదర్భంగా ఒక జివో ఇస్యూచేశారు . ప్రతి మండలంలో ఒక గ్రామానికి పోలీసులు, మండలాధికారులు వెళ్లి

విజిట్‌చేసి ఆ గ్రామప్రజల మధ్య సౌభ్రాతృత్వం కలిగేవిధంగా పర్యవేక్షించాలి, అమలు చేయాలని జి వో వచ్చింది . అది ఎన్ని జిల్లాల్లో, ఎన్ని మండలాల్లో అమలుజరుగుతుంది ? అనేది చెప్పాలి . లేకపోతే జివో వెంటనే అమలుపరచాలి . సివిల్ రైట్స్ సెలబ్రేషన్స్ జరపాలని జివో ఇష్యూ అయింది . దీనికి సంబంధించి మండలంలో ప్రతినెల 30 తేదీన ఒక గ్రామంలో సివిల్ రైట్స్ క్యాంపైన్ జరపాలని ఉంది . అధికారులు దీనిని పట్టించుకుని సభలు జరుపుతున్నారా, గ్రామాలకు వెళుతున్నారా అనేది ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉంది . ఎప్పుడు ఏ కేసు నమోదు అయింది, ఎప్పటి నుండి కేసులు వున్నాయి , నమోదు అయిన వాటిలో శిక్షలు ఎంతమందికి పడ్డాయి , మిగతా వాటిని ఎప్పుడు పరిష్కారించుతారు ? పోలీసులు ఈ కేసులకు సంబంధించి ఏ విధంగా వ్యవహరించారో చెప్పాలి . బాధితులకు ప్రభుత్వం ఏమి సహాయం చేసింది, ఎంతమందికి చేసింది, మిగతావాళ్లకు ఎంతమందికి చేయాలనేది మంత్రిగారు చెప్పాలి .

శ్రీ డి ఎస్ రెడ్యానాయక్ ః అధ్యక్షా, గౌరవసభ్యులు రామయ్యగారు చెప్పినవిధంగా ఈ పౌరహక్కుల చట్టం 1955 సంవత్సరంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారంగా రూపొందించడం జరిగింది . ఈ చట్టం క్రింద ఇప్పటివరకు ప్రతి జిల్లాలో , పోలీసుస్టేషన్లలో చట్టం ద్వారా కేసులు నమోదు అవుతున్నాయి . వీటిని పరిష్కరించడానికి చాలావరకు మొబైల్ కోర్టులు వున్నాయి . అప్పటినుండి వరుసగా చూస్తే పిసిఆర్ యాక్ట్ క్రింద ఉన్న కేసులు ప్రతి సంవత్సరం క్రమక్రమంగా తగ్గుతునాయి . కానీ పివో యాక్ట్ క్రింద ప్రతి సంవత్సరం కేసులు పెరుగుతున్నాయి . అది మనకు ఉన్న పరిస్థితి . పిసిఆర్ యాక్ట్ క్రింద ఇప్పటివరకు 294 కేసులు 1 . 1 . 2003 నాటికి పెండింగ్‌లో వున్నాయి . కాగా 2003 లో 218 కేసులు బుక్ అయినాయి . ఈ మొత్తం 518 లో శిక్షలు పడినవి 19 మాత్రమే . నేర నిర్ధారణ కానివి 239, పరిష్కారం చేయాల్సినవి 258 . 2003 లో 254 నమోదు అయినాయి . ఇకపోతే పివో యాక్ట్ క్రింద ఇప్పటివరకు 1 . 1 . 2003 నాటికి పెండింగ్‌లో వున్న కేసులు 2467, 2003 లో రిజిస్టర్ అయింది 2625 మొత్తం 5092 కేసులు . ఇందులో శిక్షలు పడింది 91 మాత్రమే . నేర నిర్ధారణ కానివి 941, ఇతర విధంగా పరిష్కరించినవి 544, పెండింగ్ 3516 వున్నాయి . ప్రభుత్వం సత్వరం ఈ కేసులను పరిష్కరంచడానికి కావలసిన కార్యక్రమాలు తీసుకోవాలనే ఆలోచనతో ఉంది . ముఖ్యంగా ఈ కేసులు ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పిసిఆర్, ఐ జి వో సెల్ క్రింద అత్యాచార కేసులు విచరణ చేయడానికి ప్రత్యేకించి 111 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేశారు . జివో 32, సోషల్ వెల్ఫేర్, హెచ్ సి, తేదీ 20 . 2 . రా ఈ పోస్టులు మంజూరు చేశారు . సభ్యులు చాలా పెద్ద ప్రశ్న అడిగారు . ఈ కేసులు పరిష్కరించడానికి కోర్టులకు, మిగతా వాటికి ఈ బడ్జెట్‌లో డబ్బు కేటాయించింది రు 10 కోట్ల, 60 లక్షలు . దీనిద్వారా కేసులు పరిష్కారం చేయడం, కేసులు జరగకుండా చూడడానికి గానీ పబ్లిక్ ఎవేర్‌నెస్ కలిగించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాము . రాష్ట్రంలో పివో యాక్ట్ క్రింద కేసులు పరిష్కరించడానికి వివిధ జిల్లాల్లో 8 కోర్టులు వున్నాయి . ఇంకా 4 కోర్టులు స్థాపించాలనే ఉద్దేశ్యంతో శాంక్షన్ కూడా చేయడం జరిగింది . దీనికి బడ్జెట్‌లో ప్రతిపాదించాము . జివో ఎంఎస్ నెం . 23, 20 . 2 . 95, పిసిఆర్ యాక్ట్ క్రింద వీరిని ఏర్పాటుచేసినందున వారిని వేరే పనులకు డైవర్ట్ చేయకుండా 11 మంది సిబ్బందిని సిబిసి ఐడి కంట్రోల్ ఉంచాలనే ఆలోచన ఉంది . ఆ విధంగా చేయడం వలన వెంటనే ఇన్వెస్టిగేషన్ చేయడానికి, స్పాట్ మీదకు పోవడానికి అవకాశం ఉంది తద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవడమే కాకుండా, దీనిపై ప్రజలలో కూడా కొంత భయం ఉంటుందని ఆలోచన చేస్తున్నాము . దీనివలన సంచార న్యాయస్థానాల పనిభారం కూడా తగ్గుతుంది . సంచార న్యాయస్థానాలు వేరే కేసుల విషయంలో కూడా బిజీగా ఉండడం వలన ప్రతి జిల్లాకు స్పెషల్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది . ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం అత్యాచారాలు నివారించడానికి అవకాశాలు ఉన్నా, అమలుపై చిత్తశుద్ధి చాలా అవసరం . ఈ అత్యాచారాల కేసులకు సంబంధించి నష్టపరిహారం ఇచ్చారా అని గౌరవసభ్యులు అడిగారు . ఆ సమాచారం జిల్లాలవారీగా నా దగ్గర వుంది . ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు కేసులకు రు 62,500, అనంతపూర్‌లో 122 మందికి రిలీఫ్‌గా రు 15,37,300 లు , కడప జిల్లాలో 28 మందికి రు 4,62,500 , తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో 8 కేసులకు రు 1,43,758 ఇవ్వడం జరిగింది .

ఉ.9.20

గుంటూరు జిల్లాలో 21 కేసులకు రు.4,68,750 ఇవ్వడం జరిగింది. హైదరాబాదు జిల్లాలో 4 కేసులకు రు.1.35 లక్షలు ఇవ్వడం జరిగింది. కరీంనగర్ జిల్లాలో 7 కేసులకు రు.2,41,250 ఇవ్వడం జరిగింది. ఖమ్మం జిల్లాలో 15 కేసులకు 4.25 లక్షలు ఇవ్వడం జరిగింది. కృష్ణా జిల్లాలో 7 కేసులకు రు.5,31,250 ఇవ్వడం జరిగింది. ఈ విధంగా 23 జిల్లాలలో 1313 కేసులకు గాను, రు.1,43,91,836, అత్యాచారాలకు గురి కాబడ్డ వారికి ఇవ్వడం జరిగింది. ఇందులో మర్డర్ కేసులు వున్నాయి, రేప్ కేసులు వున్నాయి, అంగ వైకల్యం కేసులు వున్నాయి. వీరికందరికీ పైన పేర్కొన్న విధంగా సహాయం అందించడం జరిగిందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ కట్టా వెంకట నర్సయ్య : అధ్యక్షా, దళితులపై అనేక దాడులు, అనేక దౌర్జన్యాలు, అత్యాచారాలు చాలా కాలం నుంచీ ఇప్పటి వరకూ కూడా కొనసాగుతున్న పరిస్థితి వుంది. ఏ ప్రభుత్వం వచ్చినా దళితులకు రక్షణ కల్పిస్తాము, మా దళితులను ఉద్ధరిస్తామని గత పాలక వర్గాలు అనేక రకాలుగా చెప్పాయి. ఇప్పటికీ దళితులపై దాడులు కొనసాగుతున్న పరిస్థితిని మనం చూస్తున్నాము. రంగారెడ్డి జిల్లా వికారాబాద్ మండలం, మదనపల్లె గ్రామంలో నర్సింహులు అనే పాలేరు వున్నాడు. అతనిని చెప్పిన పని చేయలేదని ముకుందరెడ్డి అనే అతను, అతని తమ్ముడు, ఇద్దరూ కలసి కాలు నరికివేసిన పరిస్థితి వుంది. ఇప్పుడే మన మంత్రిగారు చెప్పారు, దళితులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని. ఇప్పటికి 5 నెలలు గడచినా, ఒక దళితునికి కాలు నరికి వేస్తే ఎటువంటి సహాయం అందించలేదని సభా ముఖంగా మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను.

అలాగే, మెదక్ జిల్లా నారాయణఖేడ్ వద్ద ఇంటర్మీడియట్ చదివే విద్యార్థి కొబ్బరి కాయ కొట్టడానికి వెళితే అతనిని గ్రామ బహిష్కరణ చేసారు. ఇప్పటికీ గ్రామ బహిష్కరణ జరుగుతోంది. అట్లాగే విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో నర్స్‌గా పనిచేస్తున్న శైలజ అనే అమ్మాయిపై అయిదుగురు వ్యక్తులు అత్యాచారం చేయగా వారిపై ఎటువంటి చర్యా తీసుకోలేదు. కంటి తుడుపు చర్యగా అందులో ఒకరిపై కేసు నమోదు చేసారు. అట్లా కాకుండా మొత్తం ఐదుగురిపై కేసులను నమోదు చేయాలి.

అదే రకంగా ఇప్పుడు జస్టిస్ పున్నయ్య కమీషన్‌ను వేసారు. అయితే జస్టిస్ పున్నయ్య కమీషన్‌కు ఎటువంటి అధికారాలూ ఇవ్వలేదు. జస్టిస్ పున్నయ్య కమీషన్‌కు జుడిషియల్ పవర్స్ ఇవ్వాలి. జస్టిస్ పున్నయ్య కమీషన్ చేసిన సిఫార్సులను ఖచ్చితంగా అమలు జరపాలి. అట్లాగే, వారంలో ఒక రోజు ఆ కమీషన్ గ్రామాలను సందర్శించాలి. అదే రకంగా ప్రతి నెలా ఒక రోజు ఖచ్చితంగా పౌర హక్కుల దినంగా పాటించాలని కోరుతున్నాను.

మంత్రిగారైతే ఆర్థిక సహాయం అందిస్తామని చెబుతున్నారు. అయితే వాస్తవంగా గతంలో అన్యాయాలకు గురైన చాలా మందికి ఆర్థిక సహాయం అందలేదు. ఏదైతే అత్యాచారాలకు, దాడులకు గురయ్యారో, అటువంటి దళితులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి. వారికి 3 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఇవ్వాలని మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఏది ఏమైనా దళితులపై జరిగే దాడులకు వెంటనే స్పందించి, నిందితులకు శిక్ష పడేలా చేస్తే, రేపు భవిష్యత్తులో దళితులపై దాడులు జరగకుండా వుంటాయని ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. ఇప్పటికైనా జనాభాలో దాదాపు 45 శాతం వున్న దళితులను ఖచ్చితంగా కాపాడి, వారికి రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాను.

శ్రీ బి.సి.గోవిందప్ప (కళ్యాణదుర్గ్): అధ్యక్షా, మంత్రిగారు, తన జవాబులో అత్యాచారాలు జరుగుతున్న మాట వాస్తవమేనని ఒప్పుకున్నారు, దానికి చాలా సంతోషం. సమాజంలో ఎంతో దుర్భర జీవితం గడుపుతున్న దళితులు ఈనాడు చాలా అన్యాయాలకు గురవుతున్నారు. చట్టాలు వున్నాయి. కాని వాటిని అమలు జరిపే అధికారులే కొరవడ్డారు.

ఈ రోజు దళితుల పరిస్థితి చాలా దయనీయంగా వుంది. మొన్న చర్చించబడిన సంఘీ ఇండస్ట్రీస్ విషయాన్ని ఉదాహరణగా తీసుకుంటే, అక్కడ అన్యాయానికి గురి కాబడ్డ వారిలో చాలా మంది దళితులు వున్నారు. ఈ ప్రభుత్వం కనీసం దళితులకు జరిగిన అన్యాయాలపై తగు న్యాయ విచారణ జరిపించమంటే, దానిని కూడా పట్టించుకోలేదంటే, అంతకంటే సిగ్గుచేటైన విషయం మరొకటి లేదు.

అనంతపురం జిల్లాలోని అమరాపురం మండలంలో ఒక దళిత రిపోర్టర్ ' ఉద్యోగులపై కాంగ్రెస్ కార్యకర్తల పెత్తనం ' అనే ఒక ఆర్టికల్ వ్రాసాడు. కేవలం ఒక ఆర్టికల్ వ్రాసినందుకు గాను, దానిని దృష్టిలో వుంచుకుని, ఆ దళిత రిపోర్టర్‌ను ఒక రూమ్‌లో నిర్బంధించి, కులం పేరుతో దూషించి కొట్టారు. అతను నిందితులపై పోలీసు స్టేషన్‌లో కంప్లయింట్ ఇస్తే ఇంత వరకూ ఎటువంటి చర్యా తీసుకోలేదు. విషయం ఏమిటంటే, అక్కడ వున్న సి.ఐ. నాగరాజు నాయుడు గారు, నిందితునిపై చర్య తీసుకోలేమని, మంత్రి రఘువీరా రెడ్డిగారు ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని చెప్పారని చెప్పడం జరిగింది.

న్యాయాన్ని కాపాడవలసిన వారే అన్యాయం చేస్తూ, అన్యాయానికి గురైన వారికి న్యాయం జరగకుండా అణచిపెడుతున్నారంటే, అది ఎంత వరకూ న్యాయమో ఆలోచించమని కోరుతున్నాను. మనం బ్రహ్మాండంగా చెబుతున్నాం, దళితులకు న్యాయం చేస్తామని. ఎక్కడ న్యాయం వుంది ? చట్టాలు వున్నాయి, కాదని అనడంలేదు. వాటిని ఖచ్చితంగా అమలు పరిస్తే బాగుంటుందని గౌరవ మంత్రిగారికి మనవి చేస్తున్నాను. దళితులకు చాలా అన్యాయాలు జరుగుతున్నాయి, అక్రమాలు జరుగుతున్నాయి, దౌర్జన్యాలు జరుగుతున్నాయి. అయినా చట్టాలు కేవలం ఉన్న వారికి చుట్టాలుగా మారుతున్నాయి. ఈ చట్టాలను మీరు సక్రమంగా అమలు పరచడానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలి.

మిస్టర్ స్పీకర్ : ఇది క్వశ్చన్ అవర్, మీరు సప్లిమెంటరీ అడగండి.

శ్రీ బి.సి.గోవిందప్ప : ఇంత కంటె అన్యాయమూ, ఘోరమూ ఎక్కడుంది అధ్యక్షా ? ఒక దళిత రిపోర్టర్ కంప్లయింట్ ఇస్తే కూడా ఇంతవరకూ యాక్షన్ లేదు, అతనిని కులం పేరుతో దూషించారని, కొట్టారని చెప్పినా యాక్షన్ లేదంటే ఇంత కంటే అన్యాయం, సిగ్గుచేటు అయిన విషయం మరొకటి వుండదు.

మిస్టర్ స్పీకర్ : ఇది ప్రశ్నోత్తరాల సమయం, మీ పేరు లేకపోయినా మీకు అవకాశం ఇచ్చాను. మీరు ఉపన్యాసాలు ఇస్తే ఎట్లా ? మినిస్టర్ గారు జవాబు ఏమి చెబుతారో చూడండి.

శ్రీ బి.సి.గోవిందప్ప : సర్, మమ్మల్ని బయట అణగద్రొక్కుతున్నారు, లోపలా అణగద్రొక్కడం న్యాయం కాదు.

మిస్టర్ స్పీకర్ : ఇది క్వశ్చన్ అవర్, మీరు క్వశ్చన్ వేయండి.

ఉ.9.30

శ్రీ బి.సి. గోవిందప్ప: ఒక్క విషయం ఉంది. మంత్రిగారికి తెలుసు. వారు కూడా దళిత వర్గం నుండి వచ్చినవారే.కేవలం కంటి తుడుపు మాటలు వద్దు. న్యాయం చేయమనండి. న్యాయం చేస్తే సమసమాజం మెచ్చుకుంటుంది. కేవలం పేపర్లకు, ప్రకటలనకు దీనిని పరిమితం చేయవద్దు. రఘువీరారెడ్డిగార్కి దీని పైన ఒక సూచన చేయాలని అనుకుంటున్నాను. నా సూచన

ఏమిటంటే, ఇక్కడ జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టమంటున్నాను.అధికారులపై ఒక కఠినమయినచట్టాన్ని తీసుకువస్తే, అప్పుడు న్యాయం జరుగుతుంది. లేకపోతే అన్యాయం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్ః ప్రశ్న ఎలా అడగాలో అలా అడగాలి, మళ్లీ డిమాండ్స్ ఉన్నాయి, అప్పుడు అడగండి.

శ్రీ పిల్లి బోస్(రామచంద్రాపురం)ః దళితుల పరిరక్షణకు ఎన్నో చట్టాలు చేసినప్పటికీ, చట్టాలు చేసే వారే దురాక్రమణ చేసిన సంఘటనను నేను ప్రస్తావిస్తాను. ఆ సంఘటన అందరికి బాగా తెలుసు. తూర్పు గోదావరి జిల్లా, ద్రాక్షారామం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంః1/97, ఆనాడు శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి దళితులకు శిరోముండనం చేసిన సంఘటనకు సభలో సుదీర్ఘమైన చర్చ జరిగింది. 97 నుండి ఇప్పటివరకూ కేసు జరిగి 8 సంవత్సరాలు అయినా , తీర్పు వెలువడకపోవడం దురదృష్టకరం. జరిగిన సంఘటన మీద ఆనాడు లోక్‌సభ స్పీకర్ స్వర్గీయ బాలయోగిగారు ఆ గ్రామాన్ని సందర్శించారు. జగ్‌జీవన్‌రాంగారి కుమార్తె మీరాబాయి కూడా ఆ గ్రామాన్ని సందర్శించారు. ఇంత మంది పెద్దలు సందర్శించినా ఆ కేసు ఈనాటి వరకూ హైకోర్ట్‌లోనే పెండింగ్‌లో ఉంది. చాలా విచిత్రం. ఆనాటి ప్రభుత్వం శాసనసభ్యులను రక్షించాలనే ఉద్దేశ్యంతో కేసు విత్‌డ్రా చేసింది, తరువాత విశాఖపట్టణం జిల్లా స్పెషల్ కోర్ట్‌వారు ఆ ఉత్తర్వును డిజాల్వ్ చేసింది. దాని మీద ముద్దాయి హైకోర్ట్‌కి వెళ్లారు. హైకోర్ట్ స్టే ఇవ్వడం జరిగింది. 8 సంవత్సరాలయినా ఇప్పటివరకూ స్టే వెకేట్ చేయడానికి ప్రభుత్వం ఏ విధమయిన చర్య తీసుకోలేదు. చాలా దురదృష్టకరమైన సంఘటన. నలుగురు దళిత యువకుల మీద శిరోముండనం జరిగిన సంఘటన, అది కూడా శాసనసభ్యుడు చేసిన సంఘటన . ఇంత ప్రతిష్ఠాత్మకమైన కేసు సుదీర్ఘంగా చర్చజరిగింది. అయితే ఇప్పటివరకూ స్టే వెకేట్ కాలేదు. అది చాలా విచారకరమైన విషయం. కాబట్టి హైకోర్ట్‌లో ఉన్న ఈ కేసుకి సంబంధించి వెంటనే స్టేని వెకేట్ చేయించాలి. ఇప్పటివరకూ ట్రయిల్ కూడా విశాఖపట్టణం కోర్ట్‌లో ప్రారంభం కాలేదు. కాబట్టి దీనిపై దృష్టిని కేంద్రీకరించి అవసరమయితే స్పెషల్ అడ్వకేట్‌ని నియమించి దీనిని వెకేట్ చేయించవలసిందిగా తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. ఈకేసు క్రై మ్ నెంః1/97.

శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ః గౌరవ సభ్యులు నరసింహులుగారు చెప్పినట్లు మహబూబ్‌నగర్ లో నరసింహాఅనే వ్యక్తిని ముకుందరెడ్డిఅనే అతను కాళ్లూ, చేతులు నరిగారన్నారు. ఆ సమాచారం లేదు. తప్పకుండా పరిశీలన చేస్తాను. మెదక్ జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలంలో, ఆలూరు గ్రామంలో కేసు అన్నారు. ఆ కేసు ప్రభుత్వం దృష్టికి వచ్చింది 22 మందిని అరెస్ట్ చేసి కోర్ట్‌కి హాజరు పరచారు. ఆ పిల్లవాడిని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించడం జరిగింది. ఐదుగురు దళితులకు ఇళ్లు మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి కేసును నమోదు చేయడం జరిగింది.

విజయవాడ హాస్పిటల్‌లో శైలజకేసుకు సంబంధించి ఒక వ్యక్తి మీదనే కేసు నమెదు చేశారు. దాని మీద పరిశీలన చేస్తాము. గోవిందప్పగారు చెప్పిన విషయమై వారిని తమ ద్వారా నేను ఒక్కటే అడగదలచాను. మేము అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాలేదు. గత ప్రభుత్వం తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారంలో ఉన్నారు. వారేమి చేశారు, వారి ప్రభుత్వ హయాంలో అన్ని కేసులు పెరిగాయి. నేను చెప్పింది 2003నాటి విషయం. ఈ విషయాన్ని దయచేసి గౌరవసభ్యులు అర్థం చేసుకోవాలి. గౌరవ సభ్యులు బోస్‌గారు చెప్పింది హైకోర్ట్‌లో నడుస్తోంది. ఆ విషయంలో స్టే ఉంది. స్టే వెకేట్ కోసం పరిశీలన చేస్తాము. ఇంకా కొంత మంది సభ్యులు జ్యుడీషియల్ పవర్స్ గురించి చెప్పారు. జ్యుడీషయల్ పవర్స్ కూడా జస్టీస్ పున్నయ కమీషన్‌కి ఇవ్వడం జరిగిందని మనవి చేస్తున్నాను. చట్టంలని సెక్షన్ 12 ప్రకారంగా సివిల్ కోర్ట్‌లకుగల అధికారాలను ఈ కమీషన్‌కి ఉంటుంది. రాష్ట్రంలో ఏ వ్యక్తులకు, వ్యక్తికయినా సమ్మన్ చేసి కమీషన్ ముందు హాజరు పరచడం, ప్రమాణం చేయించి వారిని పరిశీలన చేసే అధికారం ఉంది. ప్రభుత్వానికి సంబంధించి లేదా కోర్ట్‌లో ఉన్న రికార్డ్‌లను, డాక్యుమెంట్లను ఈ కమీషన్ తెప్పించుకొని పరిశీలించవచ్చు. కమీషన్ ద్వారా జరిగే ప్రొసీడింగ్స్ జ్యుడీషియల్ ప్రొసీడింగ్స్‌గా పరిగణిస్తారు. ఐపిసి సెక్షన్ 192, 220 మరియు

సిఆర్.పి.సి. 195 జ్యుడిషియల్ ప్రొసీడింగ్స్ ఇవ్వడానికి కమీషన్‌కి అధికారం ఉంది. పౌర హక్కుల పరిరక్షణ శాఖ చట్ట 55 మరియు ఎస్.సి,ఎస్.టి చట్ట 89లోని నిబంధనలను, రూల్స్‌ని ఉల్లంఘన చేసినట్లు తెలిస్తే ఈ కమీషన్ ఎంక్వయిరీ చేస్తుంది. అదే విధంగా అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంపట్ల అలక్ష్యం వహిస్తే, ఆలసత్వం వహిస్తే ఎంక్వయిరీ చేసి తగు అథారిటీని రికమెండ్ చేయవచ్చు. ఇటువంటి అధికారం ఎస్.సి., ఎస్.టి కమీషన్‌కి ఉంది.

శ్రీ ఎస్. రామలింగారెడ్డి(దొమ్మాట): అల్లాపురం దళిత విద్యార్థి మీద బహిష్కరణ గౌరవ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అల్లాపురంలో ఇంటర్మీడియట్ పాసయి హనుమాన్ మందిరంలో కొబ్బరికాయ కొడితే ఆ విద్యార్థిని గ్రామ బహిష్కరణ చేసిన సంఘటన. ఆ విషయాన్ని సమాజం దృష్టికి వచ్చినప్పుడు అక్కడున్న వార్త పత్రిక విలేఖరి అయిన వెంకటేశంపై ఈనాడు అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులు దాడులు చేసి అతన్ని హతమారుస్తామని కత్తులు పట్టుకొని తిరుగుతున్నారు. ఈ రోజు ఆయన నారాయణ్‌ఖేడ్‌లో పని చేయని పరిస్థితిలో హైదరాబాదులో తలదాచుకున్నారు. ఆయనను అవసరమయితే తమ దగ్గరకి పిలిపిస్తాను. తమ ద్వారా గౌరవ ప్రతిపక్ష నాయకులకు మనవిచేసేదేమంటే, తమ కార్యకర్తలకు చెప్పి అక్కడ మా జర్నలిస్ట్ ప్రాణాలను కాపాడాలని కోరుతున్నాను.

Mr. SPEAKER: Government will take care of that.

శ్రీ ఎస్. రామలింగారెడ్డి: అధ్యక్షా, దుబ్బాక మండలం లో గోషన్‌పల్లి గ్రామంలో 1998లో 24 మంది దళితులను అందులో ఒక పసిపాప నాలుగు రోజుల పసిపిల్లను చంకలో పెట్టుకొని ఉంటే గ్రామ బహిష్కరణ చేశారు. కేవలం వారు నక్సలైట్లతో సంబంధం ఉందని నాలుగు రోజుల పసికూనతో ఉన్న మహిళను మొత్తం 24 మందిని ఊరి నుండి పంపించారు. 24 ఇళ్లకు తాళాలు వేశారు. అప్పటి కలెక్టర్ డి.సి. రోశయ్య విచారణ చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ సబ్మిట్ చేశారు. కక్ష కట్టి ఇప్పటివరకూ వారికి ఒక్కఇల్లుకానీ పూరి గుడిసెకానీ గత ప్రభుతవం కేటాయించలేదు. వారిని గ్రామ బహిష్కరణ చేసిన సంధర్భంలో వారి ఆస్తులైన పంట పొలాలు మొదలైనవి నాశనం అయ్యాయి. పశువులు ఎక్కడికక్కడ చెల్లాచెదురయ్యాయి. ఆ కుటుంబాలన్నీ చితికిపోయాయి. గత తెలుగుదేశ ప్రభుత్వ నిర్వాకంవల్ల నాశనమయిన ఆ కుటుంబాలకు ఇప్పటి ప్రభుత్వమయినా సహాయసహకారాలను అందించాలని కోరుతున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య: ఈ కేసులు ఎక్కువయ్యాయనే విషయం చెప్పినందుకు మంత్రిగారిని అభినందిస్తున్నాను. ఒక్క విషయం మనవిచేసేదేమంటే, పి.సి.ఆర్. కేసులకు సంబంధించి విచారణ అధకారం డి.ఎస్.పికి ఇచ్చారు. గతంలో పలుమార్లు చర్చించాము . ఒక డివిజన్‌కి డి.ఎస్.పి అంటే పోలీస్ దొర. ఈ దళితుల కేసు వీరికి దొరికేదెప్పుడు, ఎప్పుడు విచారణ జరుగుతుంది. బేసికల్‌గా అర్థం చేసుకోవాలి. విచారణ అధికారిగా సి.ఐని పెట్టమనండి, తప్పుడు కేసులు పెడుతున్నారనే సాకు ఉంది. వాటిని కర్బ్ చేయవలసినదే. సి.ఐని విచారణ అధికారిగా కాక అక్కడున్న డి.ఎస్.పిని పెడితే ఎక్కడవుతుంది? సి.ఐకి ఇస్తే కేసు విచారణ జరిగి డిస్‌పోజ్ అవుతుంది. తమ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే, వారు ఒకసారి దయచేసి పున్నయ్య కమీషన్ రూమ్‌ని దర్శించాలని కోరుతున్నాను.

ఉ.9.40

అక్కడ జడ్జీగారు ఒక్కరే ఉన్నారు. కాగితాలు లేవు. ఫైళ్లు మోసే వారు లేరు. ఈ విధంగా మనం చక్కదిద్దుతున్నాము. మిమ్మల్ని నేను అనడం లేదు. మీరు అధికారంలోకి వచ్చి కొద్ది రోజులే అయింది. పూర్తి ఎస్టాబ్లిషమెంట్ కోసం మీరు ఏర్పాటు చేస్తారా? లేదా?

ఇప్పటి వరకు న్యాయపరమైన అధికారాలిచ్చామని అంటున్నారు. దళితులకు సంబంధించి ఇచ్చిన భూములను పెద్ద వారు ఆక్రమిస్తే, వాటికి సంబంధించి ఎన్ని ధరఖాస్తులు వచ్చాయి. ఎన్ని డిజ్‌పోజ్ అయ్యాయి. మంత్రి గారు మాటకారి. అన్ని విషయాలు చెప్పాలి. దీనికి సంబంధించినంత వరకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. జస్టిస్ పున్నయ్య కమీషన్‌కి జీవం పోయండి. న్యాయాధికారాలు ఇచ్చాము. కానీ అవి పేపర్ వరకే పరిమితమయ్యాయి. అమలు కాలేదు. తప్పుడు కేసులు పెట్టబడుతున్నాయని, అసలు కేసులను సప్రెస్ చేయడం సబబుకాదు. తప్పుడు కేసులను ఎంటర్‌టేన్ చేయాల్సిన అవసరం లేదు. ఈదుర్మార్గ పరిస్థితుల నుండి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ :- అధ్యక్షా, గౌరవ సభ్యులు నర్సింహయ్యగారు పి.సి.ఆర్. యాక్ట్ క్రింద కేసు బుక్ చేసి ఇన్‌వెస్టిగేట్ చేయాలంటే డి.ఎస్.పి. గార్కి అధికారం ఇచ్చారని,అలా కాకుండా సి.ఐ. ఎస్.ఐ.కి ఇన్‌వెస్టిగేషన్ అధికారాలు ఇస్తే బాగుంటుందని చెప్పారు. ఇది మన రాష్ట్రం ఇచ్చింది కాదు. కేంద్ర ప్రభుత్వం రికమండ్ చేసింది. మన చేతుల్లో లేదు. జస్టిస్ పున్నయ్య కమీషన్ ఎస్.ఐ., సి.ఐ. స్థాయి అధికారే ఇన్‌వెస్టిగేటింగ్ అధికారిగా ఉండాలని చెప్పారు. దీన్ని కేంద్ర ప్రభుత్వ సిఫార్సు నిమిత్తం పంపించాలని ప్రభుత్వ పరిశీలనలో ఉందని మనవి చేస్తున్నాను. జస్టిస్ పున్నయ్య కమీషన్‌కు కావాల్సిన హంగు, సిబ్బంది అన్ని ఏర్పాటు చేయడానికి ఈ బడ్జెటులో ఒక కోటి రూపాయలను కేటాయించాము. ఆ ఫైలు ముఖ్యమంత్రి గారి దృష్టికి వెళ్లింది. త్వరితగతిన ఆ కార్యక్రమం జరుగుతుందని తెలియజేస్తున్నాను. ఎస్.సి. భూముల విషయం చెప్పారు. ఏదైనా స్పెసిఫిక్‌గా సమాచారం ఉంటే చెప్పండి. ప్రస్తుతం నా దగ్గర సమాచారం లేదు.

శ్రీ నోముల నర్సింహయ్య :- అధ్యక్షా, వీరు నోరులేని వర్గాలు. దీపం క్రింద చీకటి వ్యవస్థలా కనిపిస్తోంది. నా సొంత గ్రామంలో ఇద్దరు దళితులకు సర్టిఫికెట్స్ ఇప్పించాము. ఎక్సెస్ చూపిన వారి భూమిని ఇప్పించాము. గతంలో కొద్ది మంది పెద్ద వారు మాటికి అడ్డుగా ఉన్నారు. జస్టిస్ పున్నయ్య గార్కి స్పెసిఫిక్‌గా చెప్పాము. అక్కడ గ్రామంలో ఉన్న ఎలిజాల చెన్నయ్య, మరొకరికి ఇచ్చాము. వారిని కబ్జానుండి తీయడానికి సిద్ధంగా లేరు. నిన్న కలెక్టర్ గార్కి చెప్పాము. నేడు ప్రాసెస్ జరుగుతూ ఉండవచ్చు. గత ప్రభుత్వానికి ఆలోచన ఉందో, లేదో నాకు తెలియదు. మీ ప్రభుత్వమైనా పట్టించుకోవాలి. జస్టిస్ పున్నయ్య గారి ఆఫీస్‌కి వెళ్లి చూశాను. వాటిని డిస్‌పోజ్ చేయడానికి ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ :- గౌరవనీయ నోముల నర్సింహయ్య గారు చెపితే, జిల్లా కలెక్టర్ కానీ, ఎవరైనా తప్పకుండా చేస్తారు. అయినప్పటికి, వారు నా దృష్టికి తీసుకు వచ్చారు కాబట్టి నేను ఆ విజ్ఞప్తిని పరిశీలిస్తాను.

మిస్టర్ స్పీకర్ :- చాల మంది స్పెసిఫిక్‌గా చాలా కేసులు మీ దృష్టికి తీసుకు వచ్చారు. దానిపై ఎగ్జామిన్ చేయండి.

శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ :-స్పెసిఫిక్‌గా కేసులు నా దృష్టికి తీసుకు వస్తే, మీ ఆదేశానుసారం తప్పక ఎగ్జామిన్ చేయిస్తానని తెలియజేస్తున్నాను.

శ్రీఎన్. రఘువీరారెడ్డి :- అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గోవిందప్ప గారు ఒక ఆరోపణ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను ఎట్లా అరికట్టాలో సూచనలు చేయమన్న ఇస్యూపై మాట్లాడడానికి ఆయనకు అవకాశం ఇచ్చారు. మైకు దొరికింది కదా అని, అసందర్భంగా, వాస్తవాలు తెలుసుకోకుండా ఆయన మాట్లడడం సరైనది కాదు. అక్కడ ప్రతిపక్ష నాయకులు ఉన్నారు. ఏ సంఘటన జరిగినా, వారి పార్టీ నుండి పెద్దలను ఆయా ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఈ విషయంలో కూడా నిజనిర్ధారణకు పంపించండి. అక్కడ పొరపాట్లు జరిగి ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకోడానికి సిద్ధంగా ఉంది. దయచేసి పంపించండి. కేవలం రాజకీయంగా ఒక బట్టకాల్చి ముఖంపై పడేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎవర్నీ ప్రభుత్వం షీల్డ్ చేసే అవకాశం లేదు.

శ్రీ బి.సి. గోవిందప్ప :- అధ్యక్షా, నేను అసందర్భంగా మాట్లాడలేదు. నేను కొత్తగా వచ్చిన శాసన సభ్యుణ్ణి కాదు. నాకు 1986 నుండి శాసనసభతో సంబంధం ఉంది. 22వ తేదిన ముఖ్యమంత్రి గారు పల్లెబాట కార్యక్రమం సందర్భంగా ఆ గ్రామానికి వచ్చారు. అప్పుడు జరిగిందేమంటె, ఒక దళిత రిపోర్టరు అక్కడి కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దౌర్జన్యాలను పేపర్‌లో ఇచ్చారు. దానిని దృష్టిలో పెట్టుకొని అక్కడి సర్పంచ్, కొంత మంది వచ్చి అతణ్ణి రూమ్‌లో నిర్భందించి కులం పేరుతో దూషించి నానా దుర్భాషలాడిన తరువాత అతను అక్కడ నుండి తప్పించుకుపొయి, పోలీసు స్టెషన్‌లో కంప్లయింట్ ఇచ్చారు. దీనిపైన పోలీసులు ఎటువంటి చర్య తీసుకోలేదు. అక్కడ ఉన్న సి.ఐ. నాగరాజనాయుడు గార్కి గుర్తుచేశాడు. ఆయన నేను ఏమీ చేయలేనని, నీ ఇష్టం అని చెప్పారు. ఇది వాస్తవంగా జరిగింది. రఘువీరారెడ్డి గారు ఇది వాస్తవం కాదంటే నా శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తాను. ఇది వాస్తవం. నిష్కారణంగా మంత్రి గారు దూషించడం పద్ధతి కాదు. దీనికి ఆయన కట్టుబడితే, నేను రాజీనామా చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి :- అధ్యక్షా, గోవిందప్ప గారు నాకు మంచి మిత్రుడు. ఎంతో కష్టపడి గెలిచి ఇక్కడకు వచ్చారు. అతను రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. కానీ,ఇదా ఛాలెంజీ కాదు. అతను ఏదో వచ్చి చెప్పారు. తిమ్మప్ప అనే వ్యక్తి రోదు నాతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. అతనిపైన ప్రజర్స్ ఉన్నాయి. పరిస్థితుల వివరాలు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. అందుకని అక్కడకి పంపించి విచారించండి. నిజానిజాలు ఖచ్చితంగా నిరూపణ ఔతాయి. ఇది వాస్తవం కాదా. ఆయన రాజీనామా చేయాల్సిన అవసరం లెదు. క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు. విషయాలు ఏవైనా మాట్లాడే ముందు ఒకటి, రెండు పర్యాయాలు క్రాస్ చెక్ చేసుకొని మాట్లాడడంలో తప్పు లెని తెలియజేస్తున్నాను.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ :- దయచేసి కూర్చోండి. గోవిందప్ప గారు, మీరు నాకు కొంత సమాచారాన్ని పంపించారు. నేను ఆల్‌రెడీ ప్రభుత్వానికి పంపించాను. Government will get the matter examined.

శ్రీ పి.రామయ్య :- అధ్యక్షా, రాష్ట్రంలో ఎస్.సి. ఎస్.టి. కమీషన్‌కి కొన్ని న్యాయాధికారాలు ఇచ్చారని గౌరవ మంత్రి గారు చెప్పారు. అవి కేవలం సమన్ చేయడానికే ఉపయోగం. విచారించిన తరువాత, కమీషన్ దోషి అని నిర్ధారణకి వస్తే, వారికి శిక్షించే అధికారం ఉందా.

ఉ.9.50

అటువంటి అధికారం ఏదైనా కమిషన్‌కు ఇచ్చే ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? ప్రభుత్వం మీద చాలా కీలకమైన బాధ్యత ఉంది. కారణం ఏమిటంటే కేంద్ర మాజీ హోం శాఖా మంత్రి ఎల్.కె. అద్వానీగారు ఒక ప్రకటన చేస్తూ దేశం మొత్తంలో దళితులపై జరిగే అత్యాచారాల సంఖ్య చూసినట్లయితే, ఆంధ్ర ప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇకపై అలాంటివి జరుగకుండా చాలా కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వానికి సూచన జేస్తున్నాను.

## ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఖాళీ ఉద్యోగాల భర్తీ

ప్రశ్న నెం. 114(148)

సర్వశ్రీ ఆనం రామనారాయణ రెడ్డి(రాపూర్), ఆనం వివేకానంద రెడ్డి(నెల్లూరు), ఆదాల ప్రభాకర రెడ్డి (సర్వేపల్లి), పోలం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి (కోవూరు),
ఎం . వెంకట రమణ – గౌరవనీయులైన ఉన్నత విద్యాశాఖ మంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారా:

ఎ) రాష్ట్రంలోని ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ , జూనియర్ కళాశాలల్లో ఏవేని బోధన, బోధనేతర పదవులు ఖాళీగా ఉన్నాయా?
బి) అయితే , ఆ ఖాళీలు ఎన్ని, వీటిని ఎప్పటిలోగా భర్తీ చేయడమవుతుంది?
సి) పై ఖాళీ పదవులను భర్తీ చేయడానికి వయోపరిమితిని నిర్ధారించిన విషయం కూడా వాస్తవమేనా?

**ఉన్నత విద్యాశాఖా మంత్రి ( శ్రీ పిన్నమనేని వెంకటేశ్వర రావు ):**

ఎ) అవునండీ .
బి) సుమారు 4942 బోధన, 2554 బోధనేతర పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఖాళీ పదవులను త్వరలో భర్తీ చేయడమవుతుంది.
సి) జనరల్ కేటగిరీలకు 33 సంవత్సరాల వయోపరిమితిని, ఎస్‌సిలకు/ఎస్‌టిలకు/బిసిలకు మరో 5 సంవత్సరాలు సడలించడమయింది.

శ్రీ ఎ. వివేకానంద రెడ్డి : అధ్యక్షా, దాదాపు టీచింగ్‌గానీ, నాన్ టీచింగ్ కానీ 9 వేల పోస్టులు ఎయిడెడ్ లేక గవర్నమెంట్ , ప్రయివేట్ కళాశాలలలో ఖాళీగా ఉన్నాయి. వాటి వల్ల చాలా వరకు గవర్నమెంట్ కళాశాలల్లో గానీ, ఎయిడెడ్ కళాశాలల్లో గానీ లెక్చరర్స్ లేకపోవడం మూలంగా విద్యార్థుల స్ట్రెంగ్త్ పడిపోతున్నది. అలాగే పర్టిక్యులర్‌గా సైన్స్, మాథ్స్ సబ్జెక్ట్స్‌కు లెక్చరర్స్ లేకపోవడం మూలంగా ఉన్న వారు సరిగా చెప్పకపోవడం మూలంగా దాదాపు 10, 15 సంవత్సరాల నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పార్ట్‌టైమ్ లెక్చరర్స్ కూడా కోర్టులలో కేసులు వేయడం జరిగింది. కంట్రాక్ట్ లెక్చరర్స్‌ను పెట్టి కొన్ని కాలేజీలలో బోధనను చేస్తున్నారు. వీరంతా కోర్టులకు పోవడం మూలంగా వారికి అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఎయిడెడ్, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అందరూ నిరాశతో ఉన్నారు. ఇలాంటి లెక్చరర్స్ చాలా మంది ఉన్నారు. మరి వీరిని పెరమనెంట్ చేస్తారా? ఆ విధంగా చేయడానికి అవకాశం ఉందా?

జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలలో ఉన్నటువంటి టీచింగ్ స్టాఫ్ తమ ఉద్యోగ ధర్మాన్ని సరిగా నిర్వహించకుండా ప్రయివేట్ కాలేజీలలో పనిచేస్తున్నారు. అందుకు కారణం వారికి పోస్టులు పెరమనెంట్ కాకపోవడమే. వారు ఇతర కాలేజీలలో, కోచింగ్ సెంటర్స్‌లో ట్యూషన్స్ చెప్పడం మరియు క్లాసెస్ కండక్ట్ చేయడం జరుగుతున్నది. సరైన విధంగా గవర్నమెంట్ కాలేజీలలో లెక్చరెర్స్ లేకపోవడం మూలంగా అక్కడ చదువుతున్న పేద విద్యార్థులు సైతం తమ వద్ద గల వస్తువులను కుదువ

పెట్టుకుని కోచింగ్ సెంటర్స్‌లో చదువుకోవలసి వస్తున్న పరిస్థితులున్నాయి. మరి అలాంటి పరిస్థితులున్న సందర్భంలో ఆ విధంగా ఉన్న చోట్ల హాజరు పట్టీలను సరిగా అమలు జరిగేలా చూడాలని, అవకతవకలు జరుగుతున్న చోట్ల స్టాఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తమ ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

అదే విధంగా ఎమ్‌సెట్ కోచింగ్ కొరకు చాలా మంది ప్రయివేట్ కాలేజీలను ఆశ్రయించవలసి వస్తున్నది. గవర్నమెంటు కాలేజీలలో చదువుతున్నప్పటికీ చాలా మంది విద్యార్థులు ఎమ్‌సెట్ ఓరియంటెడ్‌గా చదువుకోవాలనుకున్న వారికి తగు కోచింగ్ అక్కడ దొరకక పోవడం మూలంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతేగాకుండా విద్యార్థులంతా ఎమ్‌సెట్‌లో మంచి మార్కులను పొందలేకపోతున్నారు. దానికి జవాబు దారీ ప్రభుత్వం వహించాలి. కాబట్టి వారికి ఇకపై ఎమ్‌సెట్ కోచింగ్ ఇప్పించే విధంగా కోర్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఆ విధంగా ఏర్పాటు చేయడం జరుగుతుందా అని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. అలాగే ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మాథ్స్ మరియు సైన్స్ సబ్జెక్ట్స్ లెక్చరర్స్ పోస్టులను పూరించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. మరి ఆ విషయమై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదా అని ప్రశ్నిస్తున్నాను. అలాగే కళాశాలలో ఎమ్‌సెట్ సెమినార్స్‌ను కండక్ట్ చేయవలసిన అవసరం ఉంది. ఆ విషయమై ప్రభుత్వం ఆలోచిస్తున్నదా అని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

అలాగే ఫీజులు, కోచింగ్ క్లాసెస్ కండక్ట్ చేయడం , క్లాస్ రూమ్స్, లైబ్ర రీ, ల్యాబ్స్ ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో ఏర్పాటు చేయడంలో ఉన్న ఇబ్బందులను సవరించుకునే నిమిత్తం మొదటి మూడు సంవత్సరాలు ఎగ్జెంప్షన్ ఆయా కళాశాలల యాజమాన్యానికి ఇచ్చి నాల్గవ సంవత్సరం నుంచి వారిపై యాక్షన్ తీసుకుంటారా లేదా? ఆ విధంగా చర్యలు తీసుకోక పోయినట్లయితే ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు మూత పడే ప్రమాదం ఉంది . కనుక తగు విధంగా చర్యలు తీసుకోవలసిందిగా, విద్యార్థులకు సరైన విద్యను సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పి. వెంకటేశ్వర రావు : అధ్యక్షా, టీచర్స్ పోస్టులు ఖాళీగా ఉన్న విషయమై ఎన్ని పోస్టులు అన్న సంఖ్యను గూర్చి చెప్పడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పినట్లుగా అవి 9 వేల పోస్టులు కాదు. టీచింగ్ స్టాఫ్ లో ఎయిడెడ్‌లో కళాశాలలో ఉన్న మొత్తం ఖాళీలు 352 పోస్టులు, అలాగే గవర్నమెంట్ జూనియర్ కాలేజీలలో 2,594 పోస్టులు ఉన్నాయి. వీటిలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కొంత, అలాగే ప్రమోషన్ ద్వారా కొంత ఉన్నాయి. 2002 వ సంవత్సరంలో దాదాపు 400 మందిని భర్తీ చేసుకోవడం జరిగింది. తర్వాత ఈ సంవత్సరం ఎపిపియస్‌సి ద్వారా జూలై మూడవ వారం లో 346 పోస్టులకు అభ్యర్థులను తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు చెప్పినట్లు చాలా ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవం . గత 7 లేక 8 సంవత్సరాల నుండి రిక్రూట్‌మెంట్స్ జరుగకపోవడమే ఇందుకు కారణం. ఈ పోస్టులన్నింటినీ ఫేజ్డ్ మేనర్‌లో ఫిలప్ చేయడం జరుగుతుందని, పోస్టులను రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని, ప్రమోషన్ ద్వారా వచ్చే పోస్టులను చూసినట్లయితే కోర్టు లిటిగేషన్‌లో 1121 పోస్టులు పెండింగులో ఉన్నాయి. వాటిని కూడా త్వరలో క్లియర్ చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

ప్రమోషన్స్ ద్వారా నాన్ టీచింగ్ స్టాఫ్‌ను , గవర్నమెంట్ టీచర్స్‌ను, పంచాయతీరాజ్ స్కూల్ టీచర్స్‌ను, ఎస్‌టి వెల్ఫేర్ స్కూల్ టీచర్స్‌ను అందరినీ కూడా తొందరలో కోర్టు తీర్పు తెలిసిన వాటిని ఫిలప్ చేయడం జరుగుతుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

ఉ.10.00

ప్రభుత్వ కాలేజిలలో పనిచేస్తూ ప్రయివేటు కాలేజిలల్లో టీచింగ్ చేస్తున్న వారి మీద డిఫనెట్‌గా యాక్షన్ తీసుకోవడం జరుగుతుంది. గౌరవ సభ్యులు సమాచారం పంపిస్తే ఆ లెక్చరర్సు మీద యాక్షన్ తీసుకుంటామని మనవిచేస్తున్నాను. దాదాపుగా 250 జూనియర్ కాలేజిలలో ఎంసెట్ కోచింగ్ మొదలు పెట్టాము. ఆ లెక్చరర్సుకు ఎక్స్‌ట్రా పేమెంటు చేసి ఎంసెట్ కోచింగ్ ఇప్పిస్తున్నాము. నేను మొన్న కూడా మనవి చేశాను సెప్టెంబరు నెల నుంచి ఎంసెట్‌కు సంబంధించిన కోచింగ్ సీనియర్ లెక్చరర్సును పెట్టి మా టివి ద్వారా శిక్షణ ఇప్పిస్తాము. ప్రభుత్వ కాలేజిలలో 80 శాతం వరకు టివిలు ఉన్నాయి . ప్రతిరోజు ఒక గంట క్లాస్ రూమ్‌లో టి.వి. ద్వారా శిక్షణ ఇప్పిస్తామని మనవిచేస్తున్నాను. నిబంధనలకు లోబడి కాలేజిలు ఉన్నాయా, బిల్డింగ్సు కడతారా అన్నారు. ఆ రకంగా లేని మాట వాస్తవం . 5 సంవత్సరాలకు బిల్డింగ్సు కట్టవలసిన పరిస్థితి వుంది. 5 సంవత్సరాల నుంచి బిల్డింగ్సు కట్టకపోవడం మూలన ఆ కాలేజిని వెకేట్ చేయించవలసిందిగా ప్రభుత్వ ఆర్డర్ ఉన్న మాట వాస్తము. విద్యార్థులు ఆల్‌రెడీ అక్కడ ఉండిపోవడం మూలానా మేనేజ్‌మెంటు మీద మనం ఒత్తిడి తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. కాలేజిలు సరిగా బిల్డింగ్సు కట్టలేకపోవడంవలన ఆ కాలేజిని మూసివేస్తే అక్కడ ఉన్న విద్యార్థులకు ఇబ్బందని ఒక ఆలోచనతో ప్రభుత్వం కొంచెము ముందు వెనుక ఆడుతుంది అయినా మేనేజ్‌మెంటు మీద ఒత్తిడి తీసుకొచ్చి వారి మీద యాక్షన్ తీసుకోడానికి అన్నీ రకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని మీద కోర్టు ఆర్డర్సు ఉన్నాయి. దాని ప్రకారం తప్పకుండా ప్రభుత్వ పరిశీలనలో వుందని నేను తెలియచేస్తున్నాను.

శ్రీ కె. మోహన్‌రావు(పాతపట్నం): అధ్యక్షా, ఇప్పుడు టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ 7,496 మందని మంత్రిగారు సమాధానం చెప్పారు. ఇప్పటికే కాలేజిలు ప్రారంభమై నెల రోజులైనది, చాలామంది పిల్లలు ఇబ్బందులకు గురౌతున్నారు. ఎప్పటిలోగా భర్తీ చేస్తారు? ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో మిళయాకుట్టి మండలం, అది గిరిజన ప్రాంతం . అక్కడ జూనియర్ కాలేజి మంజూరు అయినది 250 మంది పిల్లలు జాయిన్ అయినారు, చాలా ఇబ్బందులకు గురౌతున్నారు. ఎప్పుడులోగా స్టాఫ్‌ని భర్తీ చేస్తారని మీ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ ఎం .అబ్దుల్‌గఫూర్: అధ్యక్షా, మొత్తం విద్యావ్యవస్థ ఎఫెక్టు అవుతుంది. గత ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసిన ఫలితంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ఎయిడెడ్ కాలేజిలల్లో క్రైస్తవ మిషనరీస్ ముస్లిం మైనారిటీస్ ఇన్‌స్ట్యూషన్సు ఎప్పటి నుంచో కాలేజిలు పెట్టుకొని నడుపుతున్నారు. దానిలో ఎయిడెడ్ పోస్టులు ఖాళీ అయితే ఒక్క ఎయిడెడ్ పోస్టు కూడా భర్తీ చేయడానికి 15 సంవత్సరాల నుంచి కూడా పర్మిషన్ ఇవ్వలేదు. దానివల్ల విద్యార్థుల భవిష్యత్తు ఎఫెక్టు అవుతుంది. నా నియోజకవర్గంలో ఎస్.టి., బి.సి. కళాశాల వుంది. ఉస్మానియా డిగ్రి కళాశాల వుంది, అవి చాలా పాత కాలేజిలు, వేలాదిమంది గ్రాడ్యువేట్సును తయారు అయినారు. ఆకాలేజిలు రన్ అవుతాయా లేదా అనే పరిస్థితి ఏర్పడింది. పిల్లలను డబ్బులు విపరీతంగా కట్టమంటున్నారు. ఆ కాలేజీలకు దళితులు, వెనుకబడిన కులాల పిల్లలు పోతారు. వాళ్లు డబ్బులు కట్టకపోతే కాలేజిలు నడపలేమనే పరిస్థితి వచ్చింది. ఉన్నత విద్య కొనసాగుతుందా? నాశనం కావాలా? డబ్బు ఉన్న వాళ్లు ఏ కాలేజికైనా పోతారు. దయచేసి ఎయిడెడ్ పోస్టులు భర్తీ చేయడానికి తక్షణం చర్య తీసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ సిహెచ్. వెంకటరెడ్డి(ఇందుర్తి): అధ్యక్షా, ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజిలకు సంబంధించి ఇప్పటికే చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయా. అకడమిక్ ఇయర్ ప్రారంభమై నెల రోజులు దాటి పోయింది. విద్యాపరమైన విధాన నిర్ణయాలు ఈ ప్రభుత్వం తీసుకొన్నట్టు లేదు. చాలామంది కాంట్రాక్టు లెక్చరర్సు నిరాశా ఆంధోళన చెందుతున్నారు. మేము ముఖ్యమంత్రిగారిని, మంత్రిగారిని కలసి ఎన్నోసార్లు చెప్పాము. తక్షణమే కాంట్రాక్టు లెక్చరర్సు అందరిని రెన్యూవల్ చేసి విధులకు తీసుకొని విద్యార్థులకు ఎలాంటి విద్యాభ్యాసానికి ఆటంకం కల్గకుండా చేయడానికి చర్యలు తీసుకుంటారా అని మీ ద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి.శశిధర్‌రెడ్డి(మెదక్): అధ్యక్షా, మెదక్ నియోజకవర్గంలో 20 సంవత్సరాల క్రిందటే డిగ్రీ కళాశాల ప్రారంభమైనది. అప్పటి నుంచి ఇప్పటివరకు డిగ్రీ కాలేజిలోను,మెదక్ టౌన్‌లో ఉన్న జూనియర్ కాలేజిలో అనేక విభాగాలలో కెమిస్ట్రీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, ఫిజిక్సు సంబంధించి లెక్చరర్సు కొరత చాలా వున్నది. మెట్‌పల్లి , కోరట్ల డిగ్రీ కళాశాలో కూడా అనేక సంవత్సరాలుగా లెక్చరర్సు కొరత చాలా వుంది. ఎప్పటిలోగా ఈ పోస్టులు భర్తీ చేస్తారని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎ. గోవిందనాయక్(ఖానాపూర్): అధ్యక్షా, తెలంగాణా ఏరియా చాలా వెనకబడి వున్నది. తెలంగాణా ప్రాంతలో ఉన్న తల్లిదండ్రులు పిల్లలను చదివించుకోడానికి అతి తక్కువ జూనియర్, డిగ్రీ కాలేజిలు ఉన్నాయి. అందరు గుంటూరు వెళ్లి చదివించుకోలేక ఇబ్బందులకు గురౌతున్నారు. ఒక స్పెసిఫిక్ ప్రశ్న ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. తెలంగాణా 10 జిల్లాలో ఎన్ని డిగ్రీ, జూనియర్ ఎయిడెడ్ కాలేజిలు ఉన్నాయి. మొత్తం గుంటూరులో ఎన్ని ఉన్నాయి? ఏమైనా డిఫరెన్సు వుంటే తెలంగాణాలోకూడా ఎక్కువ ఎయిడెడ్ డిగ్రీ, జూనియర్ కాలేజిలు పెట్టి ఇక్కడ ప్రజల సమస్యలను తీర్చడానికి ఏమైనా ప్రయత్నం చేస్తారా?

శ్రీమతి వి. సునీతాలక్ష్మారెడ్డి (నర్సాపూర్): అధ్యక్షా, మా నర్సాపూర్ నియోజకవర్గంలో 2000-01 ఉర్దూ మీడియం జూనియర్ కాలేజి శాంక్షన్ చేయబడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోస్టులు క్రియేట్ కాలేదు. దానివల్ల పేరెంట్సు కమిటి ఏర్పాటు చేసుకొని డొనేషన్సు రూపంలో లెక్చరర్సును అపాయింట్ చేసుకోవడం జరిగింది. డొనేషన్సు కంప్లీట్ అయిపోయాయి. కాబట్టి ఉర్దూ మీడియం కాలేజిలో వెంటనే లెక్చరర్సును అపాయింటు చేయాలి. ఇంతకుముందు ఉన్న ప్రభుత్వ దృష్టికి పలుసార్లు తీసుకురావడం జరిగింది. అప్పుడు ఎటువంటి చర్య తీసుకోలేదు. కనీసం ఇప్పుడైనా ఆ కాలేజిలో లెక్చరర్సును అపాయింటు చేసి ఉర్దూ మీడియంను ఎంకరేజి చేయవలసిందిగా మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పిన్నమనేని వెంకటేశ్వరరావు:అధ్యక్షా, లెక్చరర్సు ట్రాన్సుఫర్స్ మూలాన నెల రోజులపాటు ఆగిపోయాయి. జున్ మొదటి వారం నుంచి ట్రాన్సఫర్సు జరుగుతున్నాయి. కాబట్టి ఏ పోస్టులు ఎక్కడ ఖాళీ ఉన్నాయి తెలియదు కాబట్టి పోస్టులు ఆపు చేయడం జరిగింది. ఈ నెల 15తో ట్రాన్సఫర్సు అయిపోయిన తరువాత ఈ నెల ఆఖరు లోపల పూర్తి చేస్తామని చెప్పి మనవిచేస్తున్నాను. ఎక్కడైతే లెక్చరర్సు పోస్టులు ఖాళీ ఉన్నాయో, విద్యార్థులకు ఇబ్బంది జరగకుండా మ్యాథ్యస్, సైన్సు, ఆర్ట్సు , లెక్చరర్సు ఎప్పుడు ఖాళీ అయినా ఆ కాలేజిలలో ఉన్న విద్యార్థులకు ఇబ్బంది కలుగ చేయకుండా ఈ నెల ఆఖరు లోపల కాంట్రాక్టు లెక్చరర్సును భర్తీ చేయడం జరుగుతుంది.
ఉ.10.10

గౌరవసభ్యులు మాట్లాడుతూ మైనారిటీ కాలేజ్‌లలో ఎయిడ్ ఇవ్వటంలేదని చెప్పారు. అదేవిధంగా ఎయిడెడ్ కాలేజ్‌లలో లెక్చరర్స్ పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయని చెబుతున్నారు. త్వరలోనే యాక్షన్ తీసుకుంటాము. వాటిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసకుని ఫిలప్ చేస్తాము. కాంట్రాక్ట్ లెక్చరర్స్‌ను రెన్యువల్ చేస్తారా అని వెంకటరెడ్డిగారు అడిగారు. గౌరవసభ్యులు రెండు, మూడు సందర్భాలలో నాకు రిప్రజెంట్ చేసిన విషయం వాస్తవమే. తీసుకునేందుకు ఉన్న పరిస్థితులను పరిశీలిస్తున్నాము. తరువాత లీగల్ కాంప్లికేషన్స్ లేకుండా, రూల్స్‌కు విరుద్ధంగా లేకుండా ఉండేట్లు చూసి వారందరినీ రెన్యువల్ చేయాలా లేక కాలేజెస్‌లోని ఇప్పుడు ఉన్న కమిటీల ద్వారానే ఎగ్జిక్యూట్ చేయాలా అనేది ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. వారం రోజులలో గౌరవసభ్యులకు ఆ విషయాలను తెలియచేస్తాను. శశిధర్‌రెడ్డిగారు మాట్లాడుతూ మెదక్ డిగ్రీ కాలేజ్‌లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. తప్పకుండా దానికి సంబంధించిన రికార్డ్స్ పరిశీలిస్తాము. ప్రభుత్వం క్రొత్త పోస్ట్‌లను క్రియేట్ చేసే ప్రశ్నే లేదు. అది గవర్నమెంట్‌కు సంబంధించిన కాలేజా లేక ఎయిడెడ్ కాలేజా అనే విషయం గౌరవసభ్యులు చెప్పలేదు. ఆ విషయం చెప్పి వారు రిప్రజెంటేషన్ ఇస్తే తప్పకుండా పరిశీలిస్తాము. నాయక్‌గారు మాట్లాడుతూ తెలంగాణా మొత్తంలో ఎన్ని కాలేజెస్ ఉన్నాయి, ఒక్క గుంటూరు జిల్లాలో ఎన్ని

కాలేజెస్ ఉన్నాయని అడిగారు. ఇప్పుడు నావద్ద ఆ సమాచారం లేదు. ఎక్కడెక్కడ ఏయే కాలేజెస్ ఉన్నాయనేది తెలియచేస్తూ రెండు రోజుల్లో గౌరవసభ్యులకు సమాచారం పంపిస్తాను. సోదరి సునీతా లక్ష్మారెడ్డిగారు మాట్లాడుతూ ఉర్దూ మీడియం కాలేజెస్‌లో పోస్టులు ఇవ్వటంలేదని చెప్పారు. తప్పకుండా ఈ పోస్టులన్నీ తొందరలోనే ఫిలప్‌చేస్తామని తమకు మనవిచేస్తున్నాను.

## కరీంనగర్ జిల్లాలో కొండగట్టు దేవాలయం వద్దవాటర్ ట్యాంకు కూలిపోవుట

Q.No:115(9)

Sri Komireddi Ramulu (Metpalli)- Will the Minister for Endowments be pleased to state:

a) whether it is a fact that several pilgrims died due to sudden collapse of the Mini Water Tank at Kondagattu Temple in Karimnagar district;
b) if so, the compensation paid to the kin of deceased; and
c) whether there is any proposal to increase the compensation and also to order a judicial enquiry by a sitting Judge of the High Court?

**MINISER FOR ENDOWMENTS ( SRI M.SATYANARAYANA RAO) :**

a) Yes sir.
seven persons died and four persons were injured on 16-05-2004.
b) i) An amount of Rs.50,000/- was paid to the next kin of each deceased family from the Chief Minister Relief Fund.
(ii) An amount of Rs.10,000/- was paid to the next kin of each deceased family from the temple funds.
(iii) An amount of R.6,457/- was paid to hospital authorities towards medical expenses for the treatment of the injured.
c) No sir.

శ్రీ కొమిరెడ్డి రాములు: అధ్యక్షా, ఇది టెంపుల్స్‌కు సంబంధించిన ప్రశ్న. మా జిల్లాకు చెందిన సత్యనారాయణగారు మంత్రిగా ఉన్నారు. నా నియోజకవర్గంలో భక్తుల సర్వే చేస్తే 42% మంది భక్తులు మెట్‌పల్లి తాలూకానుండి పోతున్నారని తెలిసింది. నేను గెలిచిన తరువాత గుండ్లాపూర్ అనే గ్రామంనుండి భక్తులు నడచిపోయి గుండు కొట్టించుకోవటంద్వారా దేవుని మొక్కు తీర్చుకున్నారు. ఈ కొండగట్టు దేవాలయంపై ప్రజల్లో అంత భక్తి ఉన్నది. అటువంటి టెంపుల్‌లో మేనేజ్‌మెంట్ సరిగా లేదు. సత్యనారాయణగారు ఇంప్రూవ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రిగారు ఈ టెంపుల్‌ను అభివృద్ధిచేసి తద్వారా వచ్చే డబ్బుతో మా మెట్‌పల్లి నియోజకవర్గంలోని ఇతర టెంపుల్స్‌ను కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నాను. రూ.60,000 ఎక్స్‌గ్రేషియా కూడా చాలా తక్కువ. దీనిని ఇంకా ఎక్కువ చేసి కనీసం రూ.1,50,000 చొప్పున ఇస్తారా? మెడికల్ ఎయిడ్ కూడా కల్పించాలి. నేను, మా మిత్రుడు జీవన్‌రెడ్డిగారు ఒక దినం అక్కడ ఉన్నప్పుడు ఒక కొబ్బరికాయ రూ.12కు అమ్ముతున్నట్లు తెలిసింది. ప్రక్కన రూ.4 లేక రూ.5 ఉంటే గుడివద్ద మాత్రం రూ.12కు అమ్ముతున్నారు. వెంటనే అధికారిని పిలిచి ఇది తప్పని, వెంటనే దీనిని రివైజ్ చేయమని చెప్పారు. మంత్రిగారి దృష్టికి కూడా ఈ విషయం తీసుకెళ్లటం జరిగింది. ఈ టెంపుల్‌ద్వారా వచ్చే కొంత డబ్బును తీసుకువచ్చి బొమ్మెలిలోని శ్రీ హనుమాన్ టెంపుల్‌ను కట్టించాలి. కమలపల్లి మరియు పెదలింగాపల్లిల మధ్యలో గడ్డి హనుమాన్ టెంపుల్ ఉన్నది. దాని మరమ్మత్తులకు కూడా కొంత డబ్బు ఇవ్వాలని కోరుతున్నాము. లాలూ ప్రసాద్‌యాదవ్ రైల్వే మినిస్టర్ అయిన తరువాత వారి కాన్‌స్టిట్యుయెన్సీకి వీల్స్ ఫ్యాక్టరీ వచ్చింది. నేను రిక్వెస్ట్ చేసేదేమంటే మెట్‌పల్లిలో కాశీభాగ్ హనుమాన్ టెంపుల్ ఉన్నది. దానికి కొంత డబ్బు కేటాయించాలని కోరుతున్నాను. మెట్‌పల్లి మండలంలో

మార్జాపూర్ అనే గ్రామం ఉన్నది. అక్కడ దళితులకు ఒక గుడి ఉన్నది. కొండగట్టు హనుమాన్ దేవస్థానంనుండి కొంత డబ్బు ఆ గుడికి కేటాయించాలని మనవిచేస్తున్నాను. మొన్న కాన్‌స్టిట్యుయెన్సీ ఎమ్.పి. చంద్రశేఖర్‌గారు వచ్చి కొంత డబ్బు పెడదామని చెప్పారు. మెట్‌పల్లి నియోజకవర్గంలోని హనుమాన్ దేవాలయాలకు డబ్బు ఇప్పించేట్లు చూడాలని, కొండగట్టు హనుమాన్ టెంపుల్ మేనేజ్‌మెంట్ సరిగా ఉండేట్లు చూడాలని కోరుతున్నాను.

శ్రీ టి. జీవన్‌రెడ్డి(జగిత్యాల): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం మొత్తం తెలంగాణాలోనే అతి పెద్ద పవిత్ర దేవస్థానం. ఈమధ్య అక్కడ జరిగిన ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబసభ్యులను గౌరవ దేవాదాయశాఖామంత్రిగారు పరామర్శించి వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పటం జరిగింది. ఏడుగురు చనిపోతే అందులో ప్రతి కుటుంబసభ్యునికీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఎప్పటిలోగా ఉద్యోగాలు ఇప్పిస్తారో తెలియచేయాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రి సహాయనిధినుండి మీరిచ్చే రూ.50,000తోపాటు ఆపద్బంధు పథకంక్రింద మరో రూ.50,000 ఇప్పిస్తానని ప్రకటించారు. దానిని కూడా వెంటనే అందించాలి. ఇప్పుడే మిత్రులు మనవిచేసినట్లు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో పెరుగుతున్న సందర్శకులను దృ ష్టిలో పెట్టుకుంటే యాత్రికుల సంఖ్యకు తగినట్లుగా వసతులు లేవు. నీటి సౌకర్యం సరిగాలేనందున యాత్రికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పవిత్ర స్నానం ఆచరించే స్నానఘట్టాలలో, కోనేరులో నీరు పూర్తిగా కలుషితమైనందున అందులో స్నానం చేయాలంటే భక్తులు భయపడుతున్నారు. యాత్రికులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇంకొక కోనేరు నూతనంగా నిర్మించాలనే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఇంకొక కోనేరు నిర్మాణం తొందరలోనే చేపట్టినట్లయితే యాత్రికులు స్నానం చేయటానికి అనుకూలంగా ఉంటుంది. డార్మిటరీ హాల్స్ సౌకర్యం లేనే లేదు. ప్రతిరోజు వేలమంది, లక్షలమంది యాత్రికులు సందర్శిస్తున్నారు. పెరుగుతున్న సందర్శకుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటుచేయవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నది.

దేవాదాయశాఖామంత్రిగారు కరీంనగర్ జిల్లాకు చెందినవారు. వారికి ఆ దేవుడు ఇలవేల్పు. వారు ఆ దేవస్థానంను ఎడాప్ట్ చేసుకుని ఒక మాడల్ టెంపుల్‌గా తీర్చిదిద్దాలని కోరుతున్నాను. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఏవిధమైన ప్రత్యేకత ఉన్నదో ఆవిధమై ప్రత్యేకతను ఈ యాత్రా స్థలానికి, దేవాలయానికి తీసుకురావటానికి ప్రయత్నించాలని మంత్రిగారిని ఈ సందర్భంగా కోరుతున్నాను.

శ్రీ సిహెచ్. వెంకటరెడ్డి: ట్యాంక్ కూలి ఏడుగురు చనిపోయారు. అదేవిధంగా 15 మందికి గాయాలయ్యాయి. నా ఇందుర్తి నియోజకవర్గానికి చెందిన ఒక వ్యక్తి కూడా చనిపోయాడు. ముగ్గురు, నలుగురికి కాళ్లూ, చేతులు విరిగాయి. ట్యాంక్ కట్టిన కాంట్రాక్టర్స్, ఇంజనీర్స్‌పైన ఎటువంటి చర్య తీసుకున్నారు? ఒకవేళ తీసుకోకుంటే ఇప్పుడైనా ఆ దిశలో ఆలోచిస్తున్నారా? చనిపోయినవారికి నష్టంపరిహారం చెల్లించటానికి, కాళ్లూచేతులు విరిగినవారికి వైద్య సహాయం అందించటానికి దేవాదాయశాఖామంత్రిగారు ప్రయత్నించాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

ఉ. 10.20

శ్రీ ఎమ్. సత్యనారాయణ రావు: అధ్యక్షా, మిత్రులు కొమిరెడ్డి రాములు గారు మాట్లాడుతూ కాంపెన్సేషన్ కాస్త తక్కువైంది. దానిని ఇంకా ఎక్కువ చేయాలని కోరడం జరిగింది. నేను ఈ జిల్లాకు సంబంధించిన వాణ్ణే కాకుండా మా తాత తలిదండ్రుల నుంచి మేము ఆ దేవస్థానానికి భక్తులమే. నేను మంత్రి అయిన వెంటనే మిత్రులు జీవన్ రెడ్డి గారితో పాటు అక్కడికి వెళ్లి అక్కడ జరుగుతున్న అన్ని విషయాలను , అక్కడి పరిస్థితులనుపూర్తిగా తెలుసుకోవడం జరిగింది. ఇక మిత్రులు వెంకటరెడ్డి గారు సంబంధితులపై సీరియస్ యాక్షన్ తీసుకోమని కోరడం జరిగింది. వారి మీద యాక్షన్ తీసుకోవడం జరిగింది. సస్పెండ్ చేయడం జరిగింది. అంతే కాకుండా అది సివియర్ క్రిమినల్ కేస్ కాబట్టి, మర్డర్ చేసినంత వ్యవహారం జరిగింది కాబట్టి

అది అటెంప్ట్ టు మర్డర్ కంటే ఎక్కువ కాబట్టి సస్పెండ్ చేయడమే కాకుండా సెక్షన్ 4 క్రింద కేసు కూడాబుక్ చేయడం జరిగింది. ఇకమీదట ఇలాంటి పొరపాట్లు జరగకుండా తప్పకుండా చర్యలు తీసుకుంటాము. ఆ ఆంజనేయ స్వామి దేవస్థానానికి కరీం నగర్ జిల్లానుండే కాకుండా మీ జిల్లా నుండి కూడా ఎక్కువ భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. దాని ప్రాముఖ్యత మనందరికీ తెలుసు. ఆ దేవస్థానాన్ని ఎంత ఇంప్రూవ్ చేయాలో అంత ఇంప్రూవ్ చేస్తామని హామీ ఇస్తున్నాను. ఇక అక్కడ కోనేరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయవలసిన అవసరముంది. వాటి గురించి చర్యలు తీసుకుంటాము. అక్కడ కొబ్బరికాయల ధరల గురించి కూడా చాలా కంప్లెయింట్స్ వచ్చాయి. అప్పుడే దానిపై యాక్షన్ తీసుకోమని కూడా చెప్పడం జరిగింది. ఇమీదట అలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నాను.

## హైదరాబాదు – విజయవాడ జాతీయ రహదారిని నాలుగు మార్గాల రోడ్డుగా మార్చుట

ప్రశ్న నెం. 116(292)

సర్వశ్రీ కె. వెంకట్‌రెడ్డి (నల్గొండ)– గౌరవనీయులైన రోడ్లు, భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ. హైదరాబాదు-విజయవాడ జాతీయ రహదారిపై అధిక ట్రాఫిక్ మూలంగా భారీ ప్రమాదాలు అనేకం జరుగుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఆ. ప్రమాదాలను అరికట్టడానికి ఈ జాతీయ రహదారి రోడ్డును నాలుగు లైన్ల జాతీయ రహదారి రోడ్డుగా మార్పు చేయడానికి ఏవైనా ప్రతిపాదనలున్నాయా?

ఇ. అయితే, ఇది ఎప్పటికి పూర్తవుతుంది.

**రోడ్లు, భవనాల శాఖ మంత్రి(శ్రీ జె.రామ్మోహన్ రావు):**

అ. అవునండీ.

ఆ. అవునండీ.

ఇ. హైదరాబాదు-విజయవాడ9వ జాతీయ రహదారి నాలుగు లైన్ల పని కోసం భారత ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్నది. వారు ఎటువంటి గడువు తేదీని నిర్ణయించలేదు. మొత్తం 270 కిలోమీటర్ల పొడవుకు గాను, 90 కిలో మీటర్లలో రోడ్డు పని దశలలో వుంది. మిగిలిన 180 కిలో మీటర్ల రోడ్డును "పధాన మంత్రి భారత్ జోడ్ పరియోజన"పథకం కింద నాలుగు లైన్ల రోడ్డుగా వేసే విషయం పరిశీలనలో వున్నట్లు భారత ప్రభుత్వం తెలియజేసింది. ఈ పనిని భారత జాతీయ రహదారుల సంస్థ నిర్వహిస్తుంది.

శ్రీ ఎస్. ఉదయభాను: అధ్యక్షా, ఈ హైదరాబాదు-విజయవాడ జాతీయ రహదారి నం .9 లో మొత్తం 270 కిలోమీటర్లలో 90 కిలోమీటర్లు పూర్తి చేశామని మంత్రి గారు చెబుతున్నారు.అందులో న్యాయంగా 50 కిలోమీటర్లు మాత్రమే పూర్తయ్యింది. మిగిలిన రోడ్డును ఎప్పటి లోపల పూర్తి చేస్తారో చెప్పాలని మంత్రి గారిని కోరుతున్నాను. ఈ జాతీయ రహదారిపై ప్రతి రోజూ ఏడెనిమిది ఇసుక లారీలు యాక్సిడెంటుకు గురవుతున్నాయి. మిగిలిన రోడ్డుకు సంబంధించి ల్యాండ్ అక్విజిషన్ పనులు ఇంకా మొదలే పెట్ట లేదు. కనీసం ఈ 2004 సంవత్సంలోపలనైనా ల్యాండ్ అక్విజిషన్ పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేస్తారా? ఈ పనులు ఎప్పటిలోపల పూర్తి చేస్తారో చెప్పాలని మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ జె.రామ్మోహన్ రావుః అధ్యక్షా, ల్యాండ్ అక్విజిషన్ కోసం ఆల్‌రెడీ నాలుగు కోట్ల రూపాయలను డిపాజిట్ చేయడం జరిగింది.అదేవిధంగా ఈ రోడ్డు 90 కిలో మీటర్లు పూర్తయిందని చెప్పలేదు. దశలలో వుందని చెప్పాను. సభ్యులు దీనిని అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. ఎంత వరకు పూర్తయిందన్న విషయాల గురించి నాకు సమయమిస్తే ఆ వివరాలు కిలోమీటర్ల వారీగా చెప్పడానికి సిద్ధంగా వున్నాను. కొన్ని ప్రాంతాల్లో టువే రోడ్లను ఫోర్‌వే రోడ్లుగాను మరి కొన్ని ప్రాంతాలో సిక్స్‌వే రోడ్లుగాను చేసే కార్యక్రమం కూడా జరుగతోంది.

## కృత్రిమ వర్షాలు

ప్రశ్న నెం.117( 48)

సర్వశ్రీ జి. వీరశివారెడ్డి(కమలాపురం), ఎన్.అమర్‌నాథ్ రెడ్డి(పుంగనూరు),ఎమ్.గోవిందరెడ్డి(రాయదుర్గ్),డి.రమేష్ (మదనపల్లి), శ్రీమతి పి.సుజాత(అచంట), శ్రీమతి ఎ. శ్రీదేవి (ఆసిఫాబాద్) – గౌరవనీయులైన ఎత్తిపోతల సాగునీరు, వర్షాభావ ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాః

అ. రాష్ట్రంలో ప్రస్తుతం అనావృష్టి పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలలో కృత్రిమ వర్షాలు కురిపించే ప్రతిపాదనలు ఏవైనా ప్రభుత్వం వద్ద ఉన్నాయా?

ఆ. మేఘ మథనం, కృత్రిమ వర్షాల కోసం ప్రభుత్వం ఖర్చు చేయాలని ప్రతిపాదించిన మొత్తం ఎంత?

ఇ. మన రాష్ట్రంలో మేఘ మథనం పద్ధతుల ద్వారా చేకూరే అనుకూలమైన ఫలితాల గురించి నిపుణులు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

**ఎత్తిపోతల సాగునీరు, వర్షాభావ ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి(శ్రీ ఎమ్. మారెప్ప)ః**

అ. అవునండీ.

ఆ. రు. 10 కోట్ల మొత్తాన్ని కేటాయించడమైంది. టెండరును ఖరారు చేయడమైంది. రు.11,83,95,630/-ల మొత్తానికి ఒప్పందంపై సంతకం చేయడమయింది.

ఇ. వర్షాలు కురవడానికి సాధనమైన మేఘమథనం సామర్థ్యంపై అనుకూల, ప్రతికూల అభిప్రాయాలు రెండూ వున్నాయి. రాష్ట్రంలో నెలకొంటున్నఆవృత అనావృష్టిని దృష్టిలో వుంచుకొని రైతులకు సహకరించడానికి మేఘమథనాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

శ్రీ జి. వీర శివారెడ్డిః స్పీకర్ సర్, నాకు ఒక కన్ఫ్యూజన్ వుంది. ఈ మేఘ మథనం గురించి, కృత్రిమ వర్షాల గురించి ఎప్పుడూ మంత్రి రఘువీరారెడ్డి గారే పేపర్లలో మాట్లాడుతూ, కనిపిస్తూ వుంటారు. అనంతపురం జిల్లాలో వర్షాల అవసరం ఎక్కువగా వుంది కాబట్టి ఆయన ఈవిధంగా దీని గురించిఎక్కువగా ప్రకటనలు ఇస్తున్నారా లేకపోతే దీన్ని అనంతపురం జిల్లా వారు హైజాక్ చేశారా? ఈ రోజు కూడా పేపర్లలో మేఘమథనానికి ఇంకా రెండు రోజులే గడువుందని రఘువీరారెడ్డి గారు స్టేట్‌మెంట్ ఇచ్చారు. అదేవిధంగా దీనిగురించి పక్క రాష్ట్రానికి వ్యవసాయ శాఖ మంత్రి గారే పర్యటించి వచ్చారు. కాని అసెంబ్లీలోకి వచ్చేసరికి దీనిపై ఇంకో మంత్రి గారు సమాధానమిస్తున్నారు.

మిస్టర్ స్పీకర్ః జాయింట్ రెస్పాన్సిబిలిటీ అండీ.

శ్రీ జి. వీర శివారెడ్డిః అధ్యక్షా, ఈ మేఘమథనానికి ఇంకా రెండు రోజులేగడువుందని స్టేట్‌మెంట్ ఇవ్వడం ద్వారా ఆ మంత్రి గారు తన శాఖలో దీన్ని కూడా భర్తీ చేసుకున్నారా లేక గౌరవనీయులైన మారెప్ప గారికి ఈ శాఖ వుందా లేదా అనే అనుమానం మాకు వస్తున్నది.

మిస్టర్ స్పీకర్ః మీరు ప్రశ్న అడగండి.

శ్రీ జి. వీర శివారెడ్డిః అధ్యక్షా, ఈ మేఘమథనం అనే ప్రక్రియ మన రాష్ట్రంలో కొత్తగా చేపట్టడం జరుగుతున్నది. అయితే ఈ మేఘ మథనం ప్రక్రియ ప్రపంచ దేశాల్లో ఎక్కడెక్కడ దీన్ని ప్రయోగించారో, ఎక్కడెక్కడ విజయవంతం అయిందో తెలుసుకున్నారా? ఈ ప్రక్రియ సక్సెస్ కాలేదని శాస్త్రజ్ఞులు క్లియర్‌గా చెబుతున్నారు.ఇది సక్సెస్ కాదని, తరువాత ఈ మేఘమథనం ప్రక్రియ వల్ల ఇది ప్రయోగించిన చోటరాబోయే కాలంలో వర్షాలు కూడా కురవవని శాస్త్రజ్ఞులు ప్రకటించడం కూడా జరిగింది. దీనిని మన పక్క రాష్ట్రమైన తమిళనాడులో కూడా ప్రయోగించడం జరిగింది.అక్కడా ఈ ప్రక్రియ సక్సెస్ కాలేదు. ఈ ప్రక్రియ ద్వారా మన రాష్ట్రంలోని ఏడు జిల్లాలలో కృత్రిమ వర్షాలు కురిపించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆ ఏడు జిల్లాలలో రాయలసీమలోని నాలుగు జిల్లాలు మరియు మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, నెల్లూరు మరియు ప్రకాశం జిల్లాలలో ఈ ప్రక్రియ అమలు చేయబోతున్నారు. శాస్త్రజ్ఞుల అభిప్రాయం మేరకు ఈ ప్రక్రియను అమలు పరచడం వల్ల కురవవలసిన వర్షాలు కూడా కురవవని, దీని వల్ల అక్కడి వాతావరణం ప్రతికూలించిరాబోయే కాలంలో నష్టాలు కలిగే ప్రమాదముంది.
ఉ. 10.30

రెండవదేమంటే, ఈ మేఘ మథన ప్రక్రియ ద్వారా వర్షాలు కురిపించాలంటే – దట్టంగా అలుముకుని, సూర్యకాంతితో ప్రకాశవంతంగా కనిపిస్తూ, పొడవుగా ఆకాశంలో పరుచుకున్న మేఘాలు, బూడిద రంగులో ఆకాశం నిండా అన్ని వైపులా విస్త రించే ఉండే మేఘాలు మేఘ మథనానికి పనికి వస్తాయి. అయితే ఈ ఏడు జిల్లాలలో అటువంటి అవకాశం లేదని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. రాయలసీమలోని కడప జిల్లాలో ఇప్పుడు వర్షపాతం జీరో వుంది. రైతులు అక్కడ చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఈ ప్రక్రియకు సంబంధించి ప్రయోగాలు మొదలుపెట్టినపుడు గౌరవ మంత్రివర్యులు శ్రీ రఘువీరారెడ్డిగారు దాన్ని చాలా గట్టిగా వ్యతిరేకించారు. ఇప్పుడేమే వేరే వాళ్ల శాఖ తీసుకుని చాలా తొందరపడుతున్నారు. అయ్యా, మేఘమథనం వల్ల రాయల సీమలో వర్షాలు దట్టంగా వస్తాయి, ఇక ఇబ్బందులు ఉండ వని చెబుతున్నారు. ఈ మేఘమథన ప్రక్రియ వల్ల విపరీతమైన ప్రతికూల ఫలితాలు వస్తాయనే విషయంపై ప్రభుత్వం అధ్య యనం చేసిందా? ఉన్న మతి పోయరా చంద్రమతి అన్న చందంగా కొద్దిగా వచ్చే వర్షాలు కూడా ఈ మేఘమథన ప్రక్రియను అమలు చేయడం వల్ల రాకుండా పోయే అవకాశం వుంది. ఒక్క సముద్రపు నీటిని శుద్ధి చేసి వాడుకుంటే తప్ప ఈ ఏడు జిల్లా లకు మోక్షం లేదు. ఈ మేఘమథన ప్రక్రియ వల్ల శాశ్వతంగా మేము మా ప్రాంతాలను వదలిపెట్టి వేరే చోటికి వెళ్లవలసిన పరి స్థితి వచ్చింది. ఈ ప్రక్రియ వల్ల రాబోయే రోజుల్లో చాలా ఇబ్బందులు వస్తాయని, దుష్ఫలితాలు ఏర్పడతాయని శాస్త్రజ్ఞులు దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు, ఆవిషయం ఏమైనా ప్రభుత్వ దృష్టికి వచ్చిందా? దయచేసి మంత్రిగారు తెలియజేయాలని కోరుతు న్నాను.

శ్రీ ఎం . మారెప్ప ః అధ్యక్షా, గౌరవ సభ్యులు వీరశివారెడ్డిగారు మాట్లాడుతూ, ఈ శాఖ ఎవరికి చెందుతుందని అడి గారు. ఈ శాఖ నాకు సంబంధించిందే. ఈరోజు అగ్రికల్చర్‌కు, నా శాఖకు అవినాభావ సంబంధం వుంది. భూమికి నీరు ఎంత అవసరమో, నీటికి భూమి కూడా అంతే అవసరం . ఈ రెండూ జీవరాశులకు అవసరం . కాబట్టి జాయింట్ సంబంధాలు న్నాయి. గతంలో అనంతపురం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే తూతూ మంత్రంగా ల్యాడర్ లేకుండా ఒక విమానం తీసుకొచ్చి కృత్రిమ వర్షాలు కురిపించడానికి ప్రయత్నం చేసినపుడు వైఫల్యం చెందిన ఘనత తెలుగుదేశం వాళ్లకే

దక్కుతుంది. ఈరోజు మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం . డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు మాట ఇచ్చిన ప్రకారం రైతులకు ఉచిత కరెంటును ఇచ్చి ఆ మాటను నిలబెట్టుకున్న ఘనత మా ప్రభుత్వానికి వుందని ఈ సభా ముఖంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, కృత్రిమ వర్షాల గురించి ప్రపంచంలో సుసంపన్న దేశాలైన అమెరికా, చైనా, ఇజ్రాయిల్, రష్యా లు యుద్ధ ప్రాతిప దికపై శాశ్వత ప్రయోగాలు చేసి సక్సెస్ కావడం జరిగింది. మన దేశంలో కూడా మొట్టమొదటిసారిగా కర్ణాటకలో 90 రోజులు ప్రయోగం చేసి 59 రోజుల పాటు వర్షాలు కురిపించిన ఘనత అక్కడ ప్రభుత్వంలో వున్న కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఈ సభా ముఖంగా తెలియజేస్తున్నాను. మానవ లోపం లేకుండా ప్రయోగాలు చేయడం మనిషి ధర్మం, మనిషి ఆశాజీవి . కొత్త ప్రయో గాలు చేపట్టి మంచి ఫలితాలు పొందడమన్నది మానవ జీవిత లక్ష్యం . అధ్యక్షా, Faith is life, doubt is death. కాబట్టి ఏదైనా చేయాలనుకున్నపుడు మంచి మనసుతో నమ్మకంగా ముందుకు పోతే మంచి ఫలితాలు వస్తాయి. వారికి ఆరోజు మంచి మనసు లేదు, బాధ్యత లేదు కాబట్టే ఫెయిల్యూర్ అయ్యారు. అసలు వ్యవసాయ రంగమే దండగ అన్నారు వాళ్లు . ఈరోజు వ్యవ సాయ రంగానికి మెండుగా,నిండుగా, అండగా, వుండి రూ. 6వేల కోట్లు ఆగ్రికల్చర్‌కు, ఇరిగేషన్‌కు కేటాయించిన ఘనత మా ప్రభుత్వానికే దక్కిందని ఈ సభాముఖంగా తెలియజేస్తున్నాను.

శ్రీ జి. వీరశివారెడ్డి : అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు మారెప్పగారు నేను అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పనే లేదు. మనం ఒక మాత్ర వేసుకుంటే అది శరీరానికి పడకపోతే సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. మారెప్పగారు శాస్త్రజ్ఞులు కాదు, నేను శాస్త్రజ్ఞున్ని కాదు. మేఘమథన ప్రక్రియకు సంబంధించి మీరేమైనా శాస్త్రజ్ఞుల నుంచి సలహాలు తీసుకున్నారా? దీని వల్ల భవిష్యత్తులో దుష్ఫలితాలు ఏర్పడి, విపరీతమైన పరిణామాలకు దారితీసే పరిస్థితి వస్తుంది. పోయినసారి తెలుగుదేశం ప్రభుత్వం వాళ్లు ఈ ప్రక్రియకు ప్రయత్నం చేస్తే ఈ రఘువీరారెడ్డి గారు చాలా అడ్డం పడ్డారు. ప్రపంచ దేశాలలో ఎక్కడెక్కడో ప్రయోగాలు చేశారు . అంతెందుకు, మన కళ్ల ముందే తమిళనాడులో జరిగింది, సక్సెస్ కాలేదు. కర్ణాటకలో జరిగింది, అక్కడ కూడా సక్సెస్ కాలేదు. మీరు ఈ రెండు రాష్ట్రాల కన్నా ఎక్కువ పరిజ్ఞానంతో మంచి ఫలితాలు వచ్చే విధంగా ఏదైనా ప్రణాళిక చేశారా? మేఘ మథనం ద్వారా రాబోయే కాలంలో వైపరీత్యాలు సంభవిస్తాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి: అధ్యక్షా, ఉన్నటువంటి మొదటి అనుమానం ఏమంటే, సంబంధిత మంత్రి మారెప్పగారు కదా, మరి అగ్రికల్చర్ మినిష్టర్ దీన్ని హైజాక్ చేస్తున్నారనే అనుమానం గౌరవ సభ్యులు వీరశివారెడ్డిగార్కి వచ్చినట్లుంది. It is a joint responsibility. మారెప్పగారు వ్యవసాయం గురించి మాట్లాడతారు, అవసరమైనతే రోశయ్య గారి విషయంలో జోక్యం చేసుకుని మా ఆర్థిక పరిస్థితి గురించి కూడా మాట్లాడతారు . ఎందుకంటే, it is a joint responsibility. ఈ మేఘ మథనానికి సంబంధించి జీ.ఓ. ఎంఎస్.నెం . 427 ను జారీ చేస్తూ స్టేట్ లెవెల్‌లో ముఖ్యమంత్రిగారు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో నన్ను, మారెప్పగారిని సభ్యులుగా వేశారు. గత సంవత్సరం మేఘమథనం ద్వారా అనంతపురం జిల్లాలో కృత్రిమ వర్షాలు కురిపించాలని కాంగ్రెస్ పార్టీ తరపున వున్న ఆరుగురు ఎంఎల్‌ఏ లు వెళ్లి ముఖ్యమంత్రిగారిని రిక్వెస్ట్ చేస్తే వారు చేయ లేదు. చివరికి మా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , లోకల్ ఎంపి వెంకట్రామిరెడ్డిగారు ఆనాడు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే అప్పుడు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కాని ఏవిధమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకుండా కేవలం రాజకీయంగా అక్కడ నీళ్లు చల్లడా నికి మాత్రమే ప్రయత్నం చేశారు. సరే ఇప్పుడు దాని జోలికి వెళ్లడం లేదు. మేఘమథనం ద్వారా కృత్రిమ వర్షాలు కురి పించాలని, కావాలని పోరాటం చేశాం . వీరశివారెడ్డిగారు మాట్లాడుతూ, నేను దాన్ని వ్యతిరేకించానన్నారు. వారన్నట్లుగా నేను వ్యతిరేకించలేదు. అధ్యక్షా, గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను, ఈ ప్రక్రియ టెంపొరరీగా చేయడం లేదు మేము . ఈ ప్రక్రియ కేవలం ఈ ఒక్క సంవత్సరంతోటే ఆగేది కాదు . ఈసారి నంద్యాలలో రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసి, రెండు విమానాలు తీసుకుని వచ్చి ఒకటి హైదరాబాదు నుంచి తెలంగాణా జిల్లాలకు, ఇంకొకటి బెంగుళూరు, పుట్టపర్తి విమానాశ్రయాల నుంచి రాయలసీమ జిల్లాలకు మొదటి దశగా ప్రారంభిస్తున్నాం .

ఉ.10.40

ఈ ప్రయోగాన్ని శాశ్వత ప్రాతిపదికన రాబోయే సంవత్సరాలలో చేయాలని ధృడ సంకల్పంతో ఉన్నాము. దీనివల్ల ఏదో జరుగుతుందని కాదు. సహజంగా వచ్చే వర్షాల కంటే 15 నుండి 20 శాతం ఎక్కువ వచ్చే అవకాశాలున్నాయి. చైనాలో, ఇజ్రాయిల్‌లో ఆ ప్రయోగాలు సక్సెస్ అయ్యాయి. దీనిని పూర్తిగా తెలుసుకోవాలి. తెలుగుదేశం పార్టీ తరపున మీరు ఈ ప్రయోగాలు వద్దంటున్నారా? చేయమంటారా? వాటీజ్ యువర్ స్టాండ్? మహారాష్ట్రలో పోయిన నెల 13వ తేది నుండి ప్రారంభం అయ్యాయి. మామూలుగా పడే వర్షాల కంటే, ఆ ప్రయోగాలు చేసిన చోట బాగుంది. మేము కూడా వీటిని అధ్యయనం చేసి ముఖ్యమంత్రిగారి ఆదేశాలతో టెండర్లు పిలిచాము. ఇప్పటికే నెల రోజులు పట్టింది. ఇది పదకొండవ తేదిన మొదలు కావలసి ఉంది. కాని ఇంకా నాలుగైదు రోజులు ఆలస్యం అయ్యే పరిస్థితి ఉంది. అమెరికా నుండి రావలసి ఉంది. దీని వల్ల ప్రయోగాలు జరుగుతాయని అనడం లేదు. కాని రైతులు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. వారికి కాస్తో , కూస్తో ఉపయోగం కలుగుతుందని సిన్సియర్ ఎఫర్ట్ చేస్తున్నాము. చైనాలో ఈ ప్రయోగాలు జరిగాయి. ఎన్నికల ముందు చేసేది కాదు. దీనిని శాశ్వత ప్రాతిపదికన చేయాలని అన్నాము. మీకు చిత్తశుద్ధి లేదు. రాడార్ సహాయం లేకుండా ప్రయోగాలు చేయడం కష్టం . అనంతపురంలో మేము నిరాహార దీక్ష చేస్తూ ఉంటే అయిపోయిందని అన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పులివెందులలో మేఘమధనం ద్వారా వర్షం అన్నారు. తరువాత లేదన్నారు. ఆ విధంగా మభ్యపెట్టడం లేదు. ఆషామాషీగా చేయడం కాదు. దీనికి అసిస్టెంట్ ఇంజనీర్, ఆర్‌డబ్ల్యుఎస్‌ను పెట్టారు. వారేమి చేయగలుగుతారు? డైరెక్టర్ – గ్రౌండ్ వాటర్, మిటీరియలాజిస్ట్ – ఐఎమ్‌డిసి, హైదరాబాదు, డైరెక్టర్–ఐఎమ్‌డి, డైరెక్టర్–సైన్స్ అండ్ టెక్నాలజి, ఇఎన్‌సి–ఇరిగేషన్, సెక్రటరి–అగ్రికల్చర్, కమీషనర్–డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సెక్రటరి–రెయిన్ షాడో ఏరియా డెవలప్‌మెంట్, మారప్పగారు , నేను అందరం కలిసి డిస్ట్రిక్ట్ లెవెల్‌లో కలెక్టరుగారు, జాయింట్ కలెక్టర్‌గారి ఆధ్వర్యంలో మానిటర్ చేస్తూ రాడార్ స్టేషన్ సహాయంతో సంపూర్తిగా చేస్తున్నాము. Let us hope for the best to come. దీనిని కూడా అడ్డుకోవాలంటే ఆ భగవంతుడే మిమ్ములను రక్షించాలి. రైతులు మిమ్ములను గమనిస్తున్నారు.

(Interruptions)

MR. SPEAKER: The Government has given reply. You made your point clear. Please resume your seat.

శ్రీ జి. వీరశివారెడ్డి: అధ్యక్షా, మేము ఈ మేఘమధనం ప్రక్రియ అవసరం లేదని చెప్పడం లేదు. రఘువీరారెడ్డిగారికి అన్ని శాఖలు తీసివేసి, వేరే శాఖలు హైజాక్‌చేయకుండా ఈ మేఘమధనం శాఖ మాత్రమే కేటాయించాలని ముఖ్యమంత్రిగారిని కోరుకుంటున్నాను. దీనిలో శాస్త్రీయత ఎంత ఉంది? రాయలసీమ జిల్లాలో వానలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనిలో గ్లోబల్ టెండర్సు పిలుస్తామన్నారు. ఒకే ఒక్క టెండర్ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా మంచి సంస్థలను రమ్మనండి. దీని వల్ల సైడ్ అఫెక్ట్స్ వచ్చే అవకాశాలున్నాయి. శాస్త్రజ్ఞుల సలహాలు తీసుకోండి. రికార్డ్సు చూడండి. ఆయన పూర్తిగా వ్యతిరేకించారు. ఈ ప్రయోగం ఇంతవరకు సక్సెస్ కాలేదు.

శ్రీ ఎమ్.మారప్ప: అధ్యక్షా, దీనిపై వారికి మంచి అభిప్రాయం ఉందా? చెడు అభిప్రాయం ఉందా? అణగారిన రైతులను ఆదుకోవడంలో మీ ఉద్దేశ్యమేమిటి? అనుభవజ్ఞులతో చర్చించడం జరిగింది. అన్ని శాఖల హెడ్స్‌ను ఆచరణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆలు లేదు, చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం అన్నట్టుగా ఇంకా మొదలు పెట్టకుండానే ఇది సక్సెస్ కాదు, సక్సెస్ కాదు అంటే ఎలా? సన్నకారు, చిన్నకారు రైతులను, అణగారిన బలహీన వర్గాలను ఆదుకోవడానికి ఈ ప్రణాళిక తీసుకువస్తే , వారు ఈ విధంగా మాట్లాడడం ఔచిత్యం కాదు. ఇండియా టుడే, దక్కన్ క్రానికల్‌లో టెండర్సు పిలవడం

జరిగింది. మంచి ఎక్స్‌పర్ట్ సంస్థకు అప్పచెప్పడం జరిగింది. నంద్యాలలో జరిగే ప్రయోగానికి మంత్రులు, శాసనసభ్యులు అందరూ వచ్చి చూస్తే ప్రాక్టికల్‌గా అర్థమవుతుంది. ఏమి లేకుండా అపశ్రుతులు పలకడం మంచిది కాదు.

MR. SPEAKER: Q.No. 282 is postponed at the request of the Member. Q.No. 209 is postponed at the request of the Member. Q.No. 194 is postponed at the request of the Member. Now, S.N.Q. (Postponed) No. 280.

## సెట్మచే డిజిటల్ కెమేరాల కొనుగోలు

ప్రశ్న నెం . 92(280)

సర్వశ్రీ జి.చిన్నారెడ్డి(వనపర్తి), యాదమా కిష్టారెడ్డి(కల్వకుర్తి), శ్రీమతి పాలగుటి స్వర్ణ సుధాకర్ (అమరచింత)– గౌరవనీయులైన యువజన సర్వీసులు, ప్రింటింగ్, స్టేషనరీ శాఖమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాధానం తెలియచేస్తారాః

అ. మహబూబ్‌నగర్ జిల్లాలో డిజిటల్ కెమెరాల కొనుగోళ్లలో సెట్మా అధిక మొత్తాలలో నిధులను దుర్వినియోగం చేసిన విషయం వాస్తవమేనా?

ఆ. అయితే ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

**యువజన సర్వీసులు, ప్రింటింగ్ శాఖామాత్యులు (శ్రీ హరీష్ )ః**

అ. లేదండీ.

ఆ. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

డా.జి.చిన్నారెడ్డిఃఅధ్యక్షా, మంత్రిగారికి ఈ సభలో మొట్టమొదటి ప్రశ్న . ఈ ప్రశ్నకు ఇంత సత్యదూరమైన సమాధానం చెబుతారని అనుకోలేదు.

ఉ. 10.50

అందుకని నేను తమ ద్వారా గౌరవ మంత్రివర్యులను కోరేదేమిటంటే మహబుబ్ నగర్ జిల్లాలో 64 మండలాలు వుంటే అందులో ఒక 40 మండలాలలో స్వర్ణ జయంతి గ్రామ స్వరాజ్ యోజన ద్వారా మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసి 40 డిజిటల్ కెమెరాలు ఇవ్వాలని, సియంఈవై., పథకం క్రింద మిగతా 24 మండలాలలో సెట్మా క్రింద మండలానికి ఒకటి చొప్పున నిరుద్యోగ యువకులకు కెమెరాలు కొనుగోలు చేసి ఇవ్వాలని ఈ పథకం యొక్క ఉద్దేశ్యం. వాస్తవంగా ఈ డిజిటల్ కెమెరాలకు ఎవరైతే నిరుద్యోగ యువకులు ఎంపిక కాబడ్డారో వారే స్వయంగా కెమెరాల కొరకు మార్కెట్‌లోకి పోతే 28 వేల రూపాయలకు ఒక

కెమెరా దొరుకుతుంది. అటువంటిది ప్రభుత్వం తరపున మేము కొనిస్తాం మా సంస్థ ద్వారా అని చెప్పి 42,500 రూపాయలకు ఒక్కొక్క కెమెరా కొనుగోలు చేసి ఇవ్వడం జరిగింది. అంటే ఒక్కొక్క కెమెరా దగ్గర దాదాపుగా 14,500 రూపాయలు ఎక్కువగా ఈనాడు ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయింది. ఆ ప్రకారంగా 64 కెమెరాలకు చూసుకుంటే 9,28,000 రూపాయలు మధ్య దళారీలు లేక ప్రభుత్వంలో వుండే అధికారులు గాని లేక ఎవరైతే కెమెరాలు సప్లయ్ చేస్తున్నారో ఫెర్రాయ్ అనే ఒక హైదరాబాద్ బేస్‌డ్ సంస్థ ద్వారా వీరు కొనుగోలు చేయడం జరిగింది. ఈ నిరుద్యోగ యువకులు సంబంధిత అధికారిని నిలదీస్తే నేను చాలా మేలు, 42,500 రూపాయలకే కొంటున్నాను అని చెప్పడమే గాక మీ ఆంధ్ర రాష్ట్రంలోని మిగతా జిల్లాలలో చూడండి అని చెప్పడం జరిగింది. అంతేగాక కొన్ని జిల్లాలలో 46 వేల రూపాయలు, కొన్ని జిల్లాలలో 47,000 వున్నాయి కాబట్టి నా జిల్లాలోనే మేలు అని అధికారి చెప్పడం జరిగిందని మీకు మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, తమరి ద్వారా కోరేదేమిటంటే గత ప్రభుత్వ హయాంలో వివిధ ప్రభుత్వ స్కీంలు అమలుపరచినప్పుడు జరిగినటువంటి అవినీతికి ఇది ఒక మచ్చుతునక అని స్పష్టంగా, సవినయంగా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ విషయం పైన సమగ్రమైన దర్యాప్తు జరగాలి. అదే విధంగా మహబూబ్ నగర్ జిల్లాలో ఈ పరిస్థితి వుంటే రాష్ట్రంలోని మిగతా 22 జిల్లాలలో 46 వేల రూపాయలకు, 47 వేల రూపాయలకు కొన్న మాట ఆ అధికారి చెప్పడం జరిగింది. మిగతా జిల్లాలలో ఎన్ని కెమెరాలు ఈ విధంగా సప్లయ్ చేశారో, ఎంతకు కొన్నారో, ఏఏ సంస్థ వాటిని సప్లయ్ చేసిందో, ఎంత డబ్బు దుర్వినియోగం అయిందో మొదలగు విషయాలను సభ ముందు తెలియపరచవలసిందిగా మనవి చేస్తున్నాను. దీని పైన ఒక సమగ్రమైన ఎంక్వయిరీ వేసి, పరిశీలన చేసి సంబంధిత అధికారి పైన చర్య తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి అవినీతి కార్యక్రమాలు జరగడానికి అవకాశం వుండదని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ టి. హరీశ్వర రావు : అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ టెక్నలాజికల్ సర్వీసెస్ సూచించిన మేరకు పానాసోనిక్ డి.యస్. 50 కెమెరాలను కొనుగోలు చేయవలసిందిగా యువజన సర్వీసెస్ శాఖ డైరెక్టర్ అన్ని జిల్లా కలెక్టర్స్‌కు ఒక లేఖ వ్రాయడం జరిగింది. అందులో భాగంగానే మహబూబ్ నగర్ జిల్లాలోని రెవిన్యూ అధికారి 60 వేల నుండి సీల్డ్ కొటేషన్స్‌ను స్వీకరించి 24.2.2003 న ఓపెన్ చేయడం జరిగింది. అందులో ప్రొసీజర్ లాప్స్ వున్నాయని భావించి అప్పటి జిల్లా కలెక్టర్ ఆ టెండర్లను రద్దు పరచి 26.3.2003 ప్రముఖ దిన పత్రికలో ఓపెన్ టెండర్లుగా పిలవడం జరిగింది. ఆ టెండర్లలో నాలుగు సంస్థలు పాల్గొనగా అందులో అర్హత పొందిన ఫెర్రాయ్ వీడియో, హైదరాబాదు వారు 50,300 రూపాయలకు కోట్ చేసి నెగోషియేషన్స్‌కు పిలవగా చివరకు 46,000 రూపాయలకు ఒప్పుకోవడం జరిగింది. ఈ ధర ఎక్కువని భావించిన జిల్లా కలెక్టరు తిరిగి టెండర్లను పిలవడం జరిగింది. అందులో నాలుగు సంస్థలు పాల్గొనగా ఫెర్రాయ్ వీడియో వారు తిరిగి 42,500 రూపాయలకు కెమెరాలు సప్లయ్ చేయడానికి అంగీకరించడం జరిగింది. తదనుగుణంగా సెట్మా వారు 15 డిజిటల్ వీడియో కెమెరాలు ఫెర్రాయ్ వీడియో నుండి కొనుగోలు చేయడం జరిగింది. దానికి యువజన సర్వీసెస్ శాఖ నుండి 50 శాతం అనగా 3,61,250 రూపాయలను చెల్లించగా మిగతా 50 శాతం బ్యాంకర్లు సమకూర్చడం జరిగింది. ఇంతకు ముందు గౌరవసభ్యులు చిన్నారెడ్డి గారు 8,9 లక్షల రూపాయల దుర్వినియోగం జరిగిందని చెప్పారు. వాస్తవానికి యువజన సర్వీసెస్ శాఖ నుండి చెల్లించినది కేవలం 3,61,250 రూపాయలు మాత్రమే. ఇందులో ఎటువంటి అవినీతి జరగలేదని మీద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ వై. కిష్టారెడ్డి : అధ్యక్షా, మహబూబ్ నగర్ జిల్లాలో సెట్మా కొనుగోలు చేసిన డిజిటల్ కెమెరాల కొనుగోళ్లలో పెద్దయెత్తున అవినీతి జరిగిన మాటా వాస్తవం. మా సోదరులు చిన్నారెడ్డి గారు చెప్పినట్లు సెట్మా క్రింద 24, డిఆర్‌డిఏ క్రింద 40 మొత్తం 64 డిజిటల్ కెమెరాలు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరింది. తరువాత నోటిఫైడ్ డీలర్స్ తక్కువ ధరకు ఇవ్వడానికి సిద్ధముగా వున్నప్పటికీ, జిల్లా యంత్రాగం ఫెరీరా వీడియో డీలర్ వద్ద 42,500 రూపాయల చొప్పున ఒక్కొక్క కెమెరా కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ధర చాలా ఎక్కువగా వుందని లబ్దిదారులు కూడా చెప్పారు. ఒక్కొక్క నాణ్యత

కలిగిన కెమెరా 28 వేల రూపాయలకు ఇచ్చే అవకాశం వుంది కాబట్టి తక్కువ ధరకు కొనుగోలు చేయాలని వారు కూడా సూచించినప్పటికీ, వారి సూచనలను కూడా పక్కన పెట్టి పెద్దమొత్తంలో ముడుపులు ముట్టిచెప్పిన ఫెరీరా వీడియో డీలరు వద్దనే అధికారులు ఈ కెమెరాలను కొనుగోలు చేయడం జరిగింది. అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన మాట వాస్తవం. సెట్మా క్రింద 24 కెమెరాలు ఖరీదు చేశాము. ఆ 24 కెమెరాలకు 3,48,000 రూపాయలు అధికంగా చెల్లించడం జరిగింది. ఇది అవినీతి కాదా? ఇప్పటికైనా వాస్తవాలు వెలికి తీసుకు రండి. ఇది నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేటటువంటి కార్యక్రమం. నేను గౌరవ మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నదేమంటే మహబూబ్ నగర్ జిల్లాలో డిజిటల్ కెమెరా కొనుగోలులో సెట్మానే కాకుండా డిఆర్‌డిఏ.,లో అవినీతిని, దుబారా ఖర్చులపైన, అవినీతి పైన పునఃపరిశీలన చేసి అవినీతికి పాల్పడిన అధికారుల పైన చర్య తీసుకుంటారా అని అడుగుతున్నాను. అధ్యక్షా, గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు లాభం జరగలేదు. అధికారులకు, నాయకులకు లాభం జరిగింది. ఇకముందు అట్లాంటి అవినీతి, దుబారా ఖర్చు జరగకుండా ప్రభుత్వ పరంగా గట్టి చర్యలు తీసుకుంటారా? తీసుకునే ప్రయత్నం చేస్తారా అని అడుగుతున్నాను.

డాక్టర్ జి. చిన్నారెడ్డి : అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు మేము సెట్మా నుండి కేవలం తక్కువ డబ్బు మాత్రమే అందజేయడం జరిగింది. మూడు లక్షలో ఏదో వారు చెప్పారు. ఒక్కొక్క కెమెరా 42,500 రూపాయలకు కొనుగోలు చేసినప్పుడు 64 కెమెరాలకు కలిపి మొత్తం 27,20,000 రూపాయలు అవుతుంది. అందులో అదనంగా చెల్లించిన ఏదైతే సొంతంగా కొనుగోలు చేసిన దానికి, దాని తరువాత ఈ టెండర్ల ద్వారా కొనుగోలు చేసినదానికి వ్యత్యాసం 14,500 రూపాయలుంటే 64 కెమెరాలకు దాదాపుగా 9 లక్షల 28 వేల రూపాయలు అదనంగా ఈ రోజున ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయింది. సెట్మా నుండి గాని లేక బెనిఫిషియరీ కంట్రిబ్యూషన్ నుండి గానీ ఇందులో తప్పకుండా దాదాపుగా 9,28,000 రూపాయలు దుర్వినియోగం వుంది. కాబట్టి సంబంధిత అధికారి పైన మీరు డిపార్టుమెంట్ తరపున సమగ్రమైన దర్యాప్తు జరిపించి చర్య తీసుకోండి. కేవలం మహబూబ్ నగర్ జిల్లా ఒక్కటే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి వుంది. రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాలలో సమగ్రమైన దర్యాప్తు జరిపించి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వ పథకాలు న్యాయంగా వాళ్లకు అందే విధంగా ప్రయత్నం చేసే అవసరముందని మనవి చేస్తున్నాను.

శ్రీ టి. హరీశ్వరరావు : అధ్యక్షా, ఇక్కడ రెండు విషయాలు వున్నాయి. ఒకటి జిల్లా కలెక్టర్లను ఆథరైజ్‌డ్ డీలర్ల నుండి మాత్రమే కొనుగోలు చేయవలసిందిగా చెప్పడం జరిగింది. రెండవది ఈ డిజిటల్ వీడియో కెమెరాలతోపాటు కొన్ని స్పేర్ పార్ట్స్ కూడా ఇవ్వడం జరిగింది. అడిషనల్‌గా డియస్ 50 మిని కెమెరా, యుయస్‌బి రీడర్, బ్యాటరీ, ఛార్జర్, కొన్ని క్యాసెట్స్, ల్యాంపు, బ్యాకు, దీనితో పాటు మెమొరీ స్టిక్ ను ఇవ్వడం జరిగింది. ఈ మెమొరీ స్టిక్ ఫ్లాపీలోనికి కాపీ చేయడానికి ఉపయోగపడుతుంది. మరియు రెండు రోజుల శిక్షణను కూడా ఆథరైజ్‌డ్ డీలర్ల నుండి ఎవరైతే లబ్దిదారులున్నారో వారికి ఇవ్వడం జరిగింది. ఇదంతా కలిపి టెండర్లలో వారు కోట్ చేయడం జరిగింది. వాస్తవానికి మార్కెట్‌లో 30వేల రూపాయలకు ఎవైలబుల్‌గా వున్నప్పటికీ వాటికి మన కస్టమ్స్ పేపర్స్ గాని వుండవు. ఆథరైజ్‌డ్ డీలర్ల ద్వారా పర్చేజ్ చేసినప్పుడు మనకు సర్వీసుకు గాని, స్పేర్స్‌కు గాని అవకాశముంటుంది. పత్రికల ద్వారా టెండర్లను కోట్ చేసి, ఓపెన్ టెండర్ల ద్వారా ఫైనల్ చేయడం జరిగింది. ఇందులో ఎటువంటి అవకతవకలకు అవకాశం లేదని మీద్వారా గౌరవసభ్యులకు మనవి చేస్తున్నాను.

ఉ.11.00

## ఎస్.ఆర్.ఎస్.పి. వరద నీటి ప్రవాహ కాలువ నుండి చెర్యాలకు సాగునీటి సదుపాయం

స్వల్ప వ్యవధి ప్రశ్న నెం. 59(89)

సర్వశ్రీ జి. ముకుంద రెడ్డి(పెద్దపల్లి), కె. ప్రతాప రెడ్డి (చేర్యాల)– పెద్దతరహా నీటి పారుదల శాఖమంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరాః

అ. చేర్యాల నియాజకవర్గంలో వర్షాభావ పీడిత ప్రాంతాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద నీటి ప్రవాహ కాలువ నుండి సాగునీటి సదుపాయాన్ని విస్తరింపచేయాలను ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం వద్ద కలదా?

ఆ. అయినచో, సాగునీటి సదుపాయాలను ఎప్పుడు కల్పిస్తారు?

**పెద్దతరహా నీటిపారుదల శాఖామంత్రి (శ్రీ పి. లక్ష్మయ్య)**

అ. అవునండి.

ఆ. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి వరద ప్రవాహకాలువ ప్రాజెక్టుకు 1996 ఏప్రిల్‌లో కేంద్ర జల సంఘం ఆమోదం తెలిపింది. దీనిలో 1వ దశ, 2వ దశ ప్రతిపాదనలు ఉన్నాయి. 1వ దశ క్రింద గ్రావిటీ ద్వారా 1.00 లక్ష ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడానికి ప్రతిపాదిత మిడ్ మానేరు రిజర్వాయరులో నీటిని నిల్వచేయడానికి ఎస్.ఆర్.ఎస్.పి డ్యామ్ నుండి 130 కి.మి పొడవు గల వరదప్రవాహ కాలువ త్రవ్వకం పని చేరి ఉంది. 2వ దశ క్రింద గ్రావిటీ ద్వారా 120 లక్షల ఎకరాల ఆయకట్టుకు దీటిని సరఫరా చేయడానికి మిడ్‌మానేరు రిజర్వాయరు నుండి నీటిని దశలలో ఎత్తిపోతల ద్వారా ప్రతిపాదిత గౌరపెల్లి రాజర్వాయరులో నిల్వ చేయాలని ప్రతిపాదించడమయింది. చేరియాల నియోజకవర్గంలోని సదరు 670 ఎకరాల ఆయకట్టు గౌరపల్లి రిజర్వాయరు క్రిందికి వస్తుంది. 5 సంవత్సరాలలో ప్రాజెక్టును పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమవుతున్నది. కార్యాచరణప్రణాళిక ప్రకారం, ప్రాజెక్టు 2వ దశ 2009 నాటికి పూర్తవుతుంది. రూ. 859 కోట్ల మొత్తంలో 1వ దశ ప్రతిపాదనలను చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలక ఆమోదాన్ని 17.11.1997 తేదీనాటి ఎం.ఎస్.నెం 209 జి.ఒ ద్వారా ఇచ్చింది. తదనుసారంగా, వరదప్రవాహ కాలువ త్రవ్వకం పని జరుగుతున్నది. 1వ దశ పని పూర్తయిన తరువాత, 2వ దశ ప్రతిపాదనలను చేపట్టడమవుతుంది.

శ్రీ జి. ముకుంద రెడి: అధ్యక్షా, మంత్రి గారు పెద్ద ప్రశ్న చాలా చిన్న సమాధానం ఇచ్చారు. శ్రీరాంసాగర్ వరద కాలువ నిర్మాణం సమస్య గత 20 సంవత్సరాల నుండి ప్రజల మనస్సులలో నిలిచిపోయింది. క్షామ పీడిత ప్రాంతాలు, దుర్భిక్ష ప్రాంతాలైన కరీంనగర్, వరంగల్, నల్గొండ జిలాలలో రైతులు ప్రాజెక్టుల కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా ఈ వరద కాలువ నిరంతరంగా సాగే కాలువ కాదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వచ్చిన వరదలను గోదావరి నదిలోకి వదలకుండా రిజర్వాయర్ నిర్మాణం చేయాలి. అది రెండు లక్షల ఇరవై వేల ఎకరాలకు నీరు ఇచ్చే పథకం. కరీంనగర్‌లో లక్షా ముప్పై వేలు, వరంగల్‌లో 60 వేల, నల్గొండలో 30 వేల ఎకరాలకు ఉద్దేశించిన పథకం. ఇది రూపుదిద్దుకోడానికి స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధి అప్పటి కేంద్ర మంత్రులు శ్రీ పి.వి. నరసింహ రావు 1984 అక్టోబర్ 13వ తేదీన జగాం పట్టణం సందర్శించిన సందర్భంలో, అక్కడి ప్రజల కోరిక మేరకు ఈ పథకానికి అంకురార్పణ జరిగింది. శ్రీ పి.వి. నరసింహ రావు గారు ప్రధాన మంత్రి గా ఉన్న సమయంలో జూన్ 30, 1993లో దీనికి శంఖుస్థాపన చేసి కేంద్ర జల శాఖ కమీషనర్, పర్యావరణ కమీషనర్, అడ్మినిస్ట్రేటీవ్ శాంక్షన్ ఇచ్చి రెండవ స్టేజ్‌లో తీసుకురావాలని నిర్ణయించడం జరిగింది. దీని అంచనా వ్యయం 2500 కోట్లు. ఈ సంవత్సరం బడ్జెటులో 2011 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ రెండు స్టేజిలను ఏక కాలం లోపల టేకప్ చేస్తే 5 సంవత్సరాలలో పూర్తి అయ్యే అవకాశం ఉంటుందని మంత్రి గారిని కోరుతున్నాను. ఇక్కడ ముఖ్యంగా రెండు సమస్యలు ఉన్నాయి, ఒకటి వర్షాలు, రెండవది ల్యాండ్

అక్విజిషన్. ల్యాండ్ అక్విజిషన్ చాలాప్రధానమైన సమస్య. మా నియోజక వర్గ రైతులు ఆందోళన చెంది 1999లో అక్కడ శంఖుస్థాపన చేసినప్పుడు మంత్రి గారిని ఘెరావ్ చేసారు. రైతులకు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా కాంపెన్సేషన్ ఇవ్వడం కోసం ఏ.పి.స్టేట్ లీగల్ అథారిటి ఛైర్మన్ గారు ఒక సిట్టింగ్ జడ్జితో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసి కాంపెన్సేషను రైతులకు న్యాయబద్ధంగా ఇవ్వాలని ఒక నిర్ణయానికి వచ్చారు. అది ఎంత వరకు పురోగతిలో ఉంది? దీనిపైన తీసుకున్న చర్యలేమిటి? ఇప్పటివరకు ఎంతమంది రైతులకు పేమెంట్ చేసారు? అదే విధంగా క్షామ పీడిత ప్రాంతాలు ఉన్నాయి, ఇన్సాట్ రిమోటింగ్ ఏజెన్సీల ద్వారా వీటిని సర్వే చేసారు. కరీంనగర్‌లో హుజూరాబాద్, హుస్నాబాద్, సిరిసిల్ల,నేరెళ్ల, ఇందుర్తి, మెడ్‌పల్లి, వరంగల్‌లో జనగాం, చేర్యాల అదే విధంగా ఆలేరు ప్రాంతాలు సర్వే చేయబడ్డాయి. ఇవన్నీ రానున్న కొద్ది రోజులలో రిపోర్ట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టు తొందరగా పూర్తి చేయకపోతే ఆయా ప్రాంతాల ప్రజలకు కేవలం మంచి నీళ్లు కూడా దొరకవు. అన్ని భూములలో అక్కడ తుమ్మ చెట్లు మొలిచాయి. అయిదు సంవత్సరాల కాలపరిమితి కాకుండా తొందరగా ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని, అదే విధంగా డబ్బు ఎక్కువ కేటాయించి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె. ప్రతాప రెడ్డి: అధ్యక్షా, చేర్యాల నియోజక వర్గంలో అన్ని గ్రామాలు కరువుపీడిత ప్రాంతాలుగా ఉన్నాయి. ఇరవై సంవత్సరాల నుండి వర్షాలు లేక, త్రాగునీరు లేక ప్రజలు సతమతమవుతున్నారు. అక్కడ వరద కాలవ ద్వారా నీళ్లు వస్తాయని ఎంతో మంది నాయకులు ఆశ చూపగా, ప్రజలు ఎదురుచూస్తున్నారు. సముద్ర మట్టం కంటే చేర్యాల నియోజక వర్గం మొత్తం నాలుగు వందల నుండి 558 మీటర్లు ఎం.ఎస్.ఎల్ హైట్‌లో ఉంది. ఇది హైట్‌లో ఉన్నందున రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వారు వేసుకున్నటువంటి బోర్లలో నీళ్లు పడక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత రెండు సంవత్సరాల నుండి దాదాపు 60 మంది రైతులు అప్పులు తీసుకొచ్చి బోర్లు వేసి, నీళ్లు పడక ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధి అక్టోబర్ 13, 1984వ సంవత్సరంలో ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసారు, తప్పకుండా వరద కాలువ ద్వారా నీళ్లు ఇస్తామని హామి ఇచ్చారు. వరంగల్ జిల్లాలో నీళ్లు ఇప్పిస్తామని అన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు రాలేదు. అక్కడి రాజకీయ నాయకులు ఎం.ఎల్.ఏలు, మంత్రులు అయ్యి, రిటైర్డ్ కూడా అయ్యారు. వారు రిటైర్డ్ అయినా నీటికి మోక్షం లేదు. చేర్యాల నియో జక వర్గంలో గోదావరి ఎత్తిపోతల ప థకం రెండవ దశలో 670 ఎకరాలు మాత్రమే ఇన్‌క్లూడ్ చేసారు. చేర్యాల నియోజక వర్గంలో లక్ష ఎకరాలు సాగు చేసుకోడానికి అవకాశం ఉంది. లక్ష ఎకరాలు సాగు చేస్తే ప్రజల జీవనోపాధి సక్రమంగా ఉంటుంది. సాగుకు అవసరమైన పంస్థితులలో 6 ఎకరాలు మాత్రమే ఇంక్లూడ్ చేయడం అది కూడా ఖిలాషాపూర్ 349 మీ ఎం.ఎల్.ఎల్‌లో ఉంది. మొత్తం 99 శాతం ఏరియా నాలుగు వందల నుండి 558 మీ ఎం.ఎల్.ఎస్‌లో ఉంది. ఏ ప్రభుత్వమైనా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి, కరువు ప్రాంతాలకు సహాయం చేయాలి. గత ప్రభుత్వం ఈ విషయంలో అన్యాయం చేసింది, ఎన్నో వాగ్ధానాలు చేసారు, డిగ్రీ కాలేజీలు కట్టిస్తామన్నారు, రైతులను ఆదుకుంటామన్నారు చివరికి ఒక్కటి కూడా కాలేదు. కాబట్టి మంత్రి గారిని కోరేదేమిటంటే వెనుకబడ్డ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకొని రైతులను ఆదుకోవాలని కోరుతున్నాను. చేర్యాల నియోజక వర్గంలో 20 సంవత్సరాల నుండి కరువుపీడిత ప్రాంతాలు ఉన్నాయి. ఐదు మండలాలను కరువు పీడిత మండలాలుగా డిక్లేర్ చేసారు, 670 ఎకరాలను మాత్రమే రెండవ దశలో ఇన్‌క్లూడ్ చేసారు. 2009 సంవత్సరానికి రెండవ దశ వరద కాలువ పూర్తి చేద్దామని మంత్రి గారు అన్నారు. 2009 సంవత్సరం వరకు పూర్తి చేయదలచుకున్న వరద కాలువ రెండవ దశ ప్రాతిపదికలో వరుసగా కరువు ప్రాంతంగా ప్రకటిస్తున్న చేర్యాల నియోజక వర్గంలో అన్ని గ్రామాలను చేర్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

ఉ. 11.10

శ్రీ ఇ. దయాకర రావు(వర్ధన్నపేట): అధ్యక్షా, ఈ వరద కాలువ గురించి మీకు కూడా బాగా తెలిసిన విషయమే. ఈ పరిస్థితి కూడా బాగా అవగాహన చేసుకోవలసిన విషయం. ప్రతాపరెడ్డిగారు చెప్పారు. ఇందిరా గాంధీ గారు ఉన్నప్పుడు కూడా జనగాంకు వచ్చినప్పుడు ప్రామిస్ చేశారు. వారు దిగిపోయిన తరువాత పి.వి. నరసింహారావుగారు జనగాం మీటింగ్‌కు

వచ్చినప్పుడు హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీలు హామీల వరకే నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడుగారు ఉండగా వారు చొరవ తీసుకుని, డబ్బు కేటాయించినా, ల్యాండ్ ఎక్విజిషన్ సమస్య వల్ల కొన్ని సంవత్సరాల పాటు ఆగిపోయింది. మీరు కూడా చొరవ తీసుకుని, రైతుల తరఫున ల్యాండ్ తీసుకున్న దానికి పేమెంట్ చెయ్యాలని చొరవ తీసుకున్నారు. లోక్ అదాలత్ ద్వారా జడ్జిని నియమించి గత ప్రభుత్వం చొరవ తీసుకుని, రైతులకు పేమెంట్ చేసింది. ప్రత్యేకంగా చంద్రబాబు నాయుడు గారు చొరవ తీసుకోవడంతో ముమ్మరంగా పనులు అవుతున్నాయి. వాస్తవంగా చేర్యాల, జనగామ ప్రాంతాలు చాలా వెనుకబడిన ప్రాంతాలు.. చాలా సంవత్సరాల నుంచీ ప్రజలు ఆశతో ఉన్నారు. ప్రతాపరెడ్డిగారు చెప్పారు. చేర్యాల, జనగామలలో అధ్వాన్న పరిస్థితి ఉంది. మంత్రిగారికి మంచి పోర్ట్‌ఫోలియో వచ్చింది. మా జిల్లా ప్రజలము సంతోషపడ్డాము. వరద కాలువను రెండు సంవత్సరాలలో పూర్తి చేస్తామని గవర్నర్ ప్రసంగంలో చెప్పారు. నేను కోరేది, తప్పకుండా రెండు సంవత్సరాలలో ఈ వరద కాలువ పూర్తి చేసినట్లయితే వారి పేరు శాశ్వతంగా ఉండిపోతుంది. కరవు ప్రాంత ప్రజలు మరచిపోకుండా ఉంటారు. కనుక చొరవ తీసుకుని ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని కోరుతున్నాను.

శ్రీ సిహెచ్. వెంకట రెడ్డి: అధ్యక్షా, గత 20 సంవత్సరాలుగా మేము ఉద్యమాలు చేస్తున్నాము.1994లో ప్రధాన మంత్రిగారు, ముఖ్యమంత్రిగారు శంఖుస్థాపన చేశారు. ప్రభుత్వం మారిన తరువాత తిరిగి ఫౌండేషన్ వేశారు. సమస్య ఏమంటే 1998 నుంచీ రు. 20 కోట్లు కేటాయిస్తూ వచ్చారు. ఒక్క పైసా కూడా ఖర్చు చెయ్యలేదు. మేము పెద్ద ఆందోళన చేస్తే, పోయిన సంవత్సరం రు. 50 కోట్లు బడ్జెటులో పెట్టారు. కొంత వరకే పని పూర్తయింది. వరద కాలువ విషయంలో నిర్లక్ష్యం చేశారు. మంత్రిగారు 5 సంవత్సరాలలో పూర్తి చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి గారు ఒకసారి 3 సంవత్సరాలలో పూర్తి చేస్తామన్నారు. ఇప్పుడు అవకాశాలు చాలా ఉన్నాయి. వెంటనే ఫస్ట్ ఫేజ్ ప్రారంభించి, రెండు దశలలో ప్రత్యేకంగా భూ సేకరణ విషయం పరిశీలిస్తే బాగుంటుంది. తక్షణ ప్రాముఖ్యం ఉంది.. నీరు లేక మొత్తం భూమి ఉంది. 70 వేల ఎకరాలు నా నియోజక వర్గంలో నుండి నల్గొండ వరకూ పోతుంది. మూడు సంవత్సరాలలో పూర్తి చెయ్యడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ పొన్నాల లక్ష్మయ్య: గౌరవ సభ్యులు ఈ ప్రాజెక్ట్ పూర్వాపరాల గురించి చెప్పారు. గతంలో మొదటిసారిగా 1985లో ఇందిరా గాంధీ గారు చెప్పిన తరువాత ప్రస్తుత శాసన సభ్యుడు పురుషోత్తమ రెడ్డిగారు, నేను సమగ్ర పోచంపాడు కార్యాచరణ సమితికి వారు అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా వరద కాలువ అవసరం అని ఆ నాడు ప్రభుత్వాలకు చెప్పడం, అన్ని రాజకీయ పక్షాల వారు ఉద్యమాలలో పాల్గొనడం, 1996లో వరద కాలువ ప్రాజెక్టుకు ఏప్రిల్ మాసంలో సెంట్రల్ వాటర్ కమిషన్ ఆమోదం రావడం జరిగింది. అదృష్టమో, దురదృష్టమో కానీ ప్రభుత్వం వద్ద గల సమాచారం మేరకు, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నేను ఇక్కడ సమాధానం చెప్పగలుగుతాను. 670 ఎకరాలు మాత్రమే చేర్యాలలో సాగు కావడానికి ఈ ప్రాజెక్టు క్రింద వచ్చినందుకు నిరాశగా వచ్చింది. అప్పటి కార్యక్రమాలు సభ దృష్టికి తేవడం అవసరం. గౌరవ సభ్యులు ముకుంద రెడ్డిగారు ఈ రెండు దశలను సైమల్టేనియెస్‌గా తీసుకోవాలని, ల్యాండ్ ఎక్విజిషన్ త్వరగా చెయ్యాలని అన్నారు. అధికారం లోకి రాగానే యాక్షన్ ప్లాన్ తీసుకుని, ఫేజ్-1లో 25 వేల ఎకరాలకు, ఫేజ్-2లో 8,800 ఎకరాలకు ల్యాండ్ ఎక్విజిషన్ క్రింద కార్యాచరణ పథకం తయారు చేశాము. దానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లకు ల్యాండ్ ఎక్విజిషన్ తీసుకునే అధికారం ఇచ్చాము. ప్రతాపరెడ్డిగారు అన్నారు. గ్రామాలకు సాగు నీరు అందే విధంగా తీసుకునే కార్యక్రమం గురించి అడిగారు. ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్. దానికి అనుగుణంగా గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా కొన్ని ప్రతిపాదనలు మండలాల వారీగా ప్రతిపాదిస్తున్నాము. దీనిలో చేర్యాల మండలంలో 26 వేల ఎకరాలు, మద్దూరు మండలంలో 23,400 ఎకరాలు నర్మద మండలంలో 10,900 ఎకరాలు బచ్చన్నపేట మండలంలో క్రి ద 11,600 ఎకరాలకు సాగు నీరు అందించే విధంగా ప్రతిపాదనలు తయారు చేస్తున్నాము. రెండవ ఫేజ్‌లో వచ్చే విధంగా తీసుకుంటున్నాము. దయాకర రావుగారు చాలా చక్కటి సూచనలు ఇచ్చారు. 10 సంవత్సరాల కాలంలో రు. 30 కోట్లు, రు. 40 కోట్లు ఖర్చు చెయ్యలేని స్థితిలో ఉండి, ఇప్పుడు కొద్దిగా స్వాతంత్ర్యం వచ్చినట్లుంది మాట్లాడడానికి. రెండు సంవత్సరాలలో పూర్తి చెయ్యాలని అంటున్నారు. 5 సంవత్సరాలలో పూర్తి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నాము. దానికి అనుగుణంగా

ప్రణాళికలు తయారు చేస్తున్నాము. తప్పకుండా 5 సంవత్సరాలలో అంటే 5 సంవత్సరాలు వేచి ఉండే అవసరం లేదు. సాధ్యమయినంత త్వరగా పూర్తి చెయ్యడానికి కార్యక్రమాలు రూపొందిస్తున్నా. వెంకట రెడ్డిగారు చెప్పారు. భూసేకరణ కార్యక్రమం త్వరగా చెయ్యాలని చెప్పారు. తమ నియోజక వర్గానికి కూడా పనికొచ్చే కార్యక్రమం కనుక చేపట్టాలని అన్నారు. తప్పకుండా 5 సంవత్సరాలలో తగిన చర్యలు తీసుకుంటాము.

శ్రీ ఇ. దయాకర రావుః చిన్న విషయం. మంత్రిగారు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. గత ప్రభుత్వం ఎంత ఖర్చు చేశారు, ఏం చేశారనేది కూడా చెబితే బాగుంటుంది.

## ఖమ్మం జిల్లాలో నీటిపారుదల చెరువులు, గట్లు, కాలువలు మున్నగువాటి నిర్వహణ

స్వల్ప వ్యవధి ప్రశ్న నెం. 120(82-ఐ)

సర్వశ్రీ జలగం వెంకట రావు(సత్తుపల్లి), రామిరెడ్డి వెంకట రెడ్డి (సుజాతానగర్)- గౌరవనీయులైన చిన్న సాగు నీటి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింద సమాచారం తెలియచేస్తారాః

అ) ఖమ్మం జిల్లాలో సాగు నీటి చెరువులు, గట్లు, కాలువలు మొదలగు వాటి నిర్వహణను చేపట్టలేదనే విషయం వాస్తవమేనా?
ఆ) రెగ్యులర్ ప్రాతిపదికన వాటి నిర్వహణ కోసంప్రభుత్వం ఏదేని కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందా?
ఇ) అయితే అందుకు సంబంధించిన వివరాలేమిటి?

**చిన్న తరహా సాగు నీటి శాఖ మంత్రి ( శ్రీ ఎస్. చంద్రశేఖర్)ః**

అ) లేదండీ
ఆ) అవసరాన్ని బట్టి రెగ్యులర్ నిర్వహణ పనులను చేపట్టడం జరిగింది.
ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ జలగం వెంకట రావుః అధ్యక్షా, మంత్రి గారు సమాధానంలో మొదటి ప్రశ్నకు లేదు అన్నారు. ఏ విధంగాను డబ్బు ఖర్చు చెయ్యడం లేదు. ప్రశ్నకు జవాబు అధికారులు వ్రాసినట్లు ఉంది. వాస్తవాలు చూసినట్లు లేదు. మా వద్ద అనేక మండలాలలో మైనర్, మేజర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ ట్యాంకులకు 9 సంవత్సరాలలో పనులు జరగలేదు. చెయ్యవలసిన అవసరం ఉంది. పంగిడి చెరువు, కల్లూరు మండలంలో ఉంది. 226 ఎకరాల ఆయకట్టు ఉంది. మెయిన్‌టెనెన్స్, మరమ్మత్తులు లేక, ఇప్పటికి 50 ఎకరాలలో మాత్రమే సాగు చెయ్యడం జరుగుతోంది. మరమ్మత్తులకు డబ్బు కేటాయింపు చాలా తక్కువగా ఉంది. త్వరగా రిపైర్స్ చేస్తే, లబ్ధి బాగా ఉంటుంది. చాలా ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంటుంది. ఎన్.ఎస్.పి కెనాల్స్ నా నియోజక వర్గం నుంచి పోతాయి.కొన్ని చోట్ల వాటికి గండ్లు పడినా, వాటి రిపైర్స్‌కు బడ్జెటులో పెట్టడం లేదు. కొద్ది నీరు ఉంటే, అది కూడా దుర్వినియోగం

అయ్యే అవకాశముంది. తప్పకుండా తగిన చర్య తీసుకోవాలని కోరుతున్నాను. అశ్వారావు పేటలో 16 వేల ఎకరాలు సాగయ్యే పెద్దవాగు ప్రాజెక్టు ఉంది. బండ్స్, కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ పూర్తిగా డ్యామేజ్ అయి ఉంది. గతంలో ఇందుకు డబ్బు ఖర్చు చెయ్యలేదు. డబ్బు ఖర్చు చేసి, త్వరగా రిపైర్స్ చేయించాలి. అనేక ట్యాంకులు ఉన్నాయి. పెద్దవి, చిన్నవి ఉన్నాయి. మెయిన్‌టెయిన్ చెయ్యలేకపోవడం వల్ల చాలా ఎకరాలు దెబ్బతింటున్నాయి. నీరు ఉన్న ప్రాంతాలలో కూడా రైతులకు నీరు ఇవ్వలేకపోతున్నాము. బేతుపల్లి చెరువు క్రింద 5,060 ఎకరాలు సాగవుతుంది. దాని బండ్ 3 కి.మి లు దారుణంగా ఉంది. రిపైర్స్ లేవు. 28 కి.మి కెనాల్స్ ఉన్నాయి నీటి సరఫరాకు. అయినా రిపైర్స్ లేవు. నీరు పారకం కాదు. రిపైర్స్ కావు. చాలా మంది ఇంజనీర్స్‌తో మాట్లాడాము. త్వరగా ఫండ్స్ ఇవ్వాలి. వర్షాలు వస్తాయి. ఈ లోగా చెయ్యకపోతే చాలా కష్టపడే అవకాశముంది. ఆలోచించాలి. ఏ విధంగా ప్రభుత్వ వైఖరి ఉందనేది తెలియచెయ్యాలి. వైనగూడెంలో పెద్దచెరువు ఉంది. పూర్తిగా డ్యామేజ్ అయి వుంది. అది పనికి రావాలంటే డబ్బు త్వరగా ఎలొకేట్ చేసి, రిపైర్ చెయ్యాల్సిన అవసరం ఉంది.

మిస్టర్ స్పీకర్ః కూర్చోండి.

ఉ 11.20

మేజర్ ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్, పంచాయతీ రాజ్ కు సంబంధించిన ముగ్గురు మంత్రులు ఇక్కడ ఉన్నారు. నీరు త్వరలో ఆలోచించి ఫండ్స్ ఎలొకేట్ చేసి తప్పనిసరిగా ట్యాంక్స్, కెనాల్స్ రిపేర్స్ చేపట్టాలని కోరుతున్నాను.

శ్రీ ఆర్. వెంకటరెడ్డి:– ఖమ్మం జిల్లాలో నాలుగు డివిజన్స్ ఉన్నాయి. ఈ నాలుగు డివిజన్స్‌లో మూడు డివిజన్స్ ఏజెన్సీ ఏరియాలుగా ఉండడం వల్ల గత 10 సంవత్సరాల నుంచి చెరువులు రిపేర్స్ లేక బాగా నెగ్లెక్ట్ అయ్యాయి. ట్యాంక్స్, బండ్స్ కూడా రిపేర్ చేయలేదు. తూములు బాగాలేవు. ముఖ్యంగా సుజాతనగర్, ఇల్లెందు నియోజక వర్గంలో గత 10 సంవత్సరాల నుంచి రిపేర్ చేయలేదు. కాలువలు, పెద్ద చెరువులు, బండ్స్, తూములు మరమ్మత్తులు చేసి స్ట్రెంగ్తెన్ చేయాలని కోరుతున్నాను. నా నియోజక వర్గంలో 5 సంవత్సరాల నుంచి బ్రీచ్ అయి ఉన్నాయి. కాంపెల్లి మండల్, బాతిన నగర్, మంగల్‌కాని చెరువులు ఎప్పుడూ రిపేర్స్ చేస్తున్నారు కాని నీళ్లు పోతూనే ఉన్నాయి. దయచేసి మంత్రి గారు వాటిని వెంటనే చేపట్టాలని కోరుతున్నాను.

శ్రీ ఎ. చంద్రశేఖర్:– అధ్యక్షా, మిత్రులు వెంకట్రావు గారు మెన్షన్ చేసినవి మేజర్ ఇరిగేషన్‌కు సంబంధించిన చెరువుల గురించి చెప్పారు. వాటిని మేజర్ ఇరిగేషన్ మంత్రి గారికి పంపిస్తాను. కాకాపోతే గత 5 సంవత్సరాల నుంచి ఖమ్మం జిల్లాలో సుమారు 393 చెరువుల మరమత్తులు, ఆనకట్టలు టేకప్ చేయడం జరిగింది. 1.43 లక్షల ఎకరాల భూమి సాగులోకి తీసుకు రావడం జరిగింది. జిల్లాలో 5 సంవత్సరాలలో సుమారు రు.12 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. గ్యాప్ ఆయకట్ దాదాపు 35 వేల ఎకరాలు సాగులోకి తీసుకు రావడం జరిగింది. గౌరవనీయులు వెంకటరెడ్డి గారు చెప్పినది రిపేర్ చేస్తున్నారు కాని వాటిని సరిగా రిపేర్ చేయడం లేదు అన్నారు. ఎంక్వయిరీ చేసి వాటి గురించి తెలుసుకుని డెఫినెట్‌గా మళ్లీ రిపేర్ చేయించడానికి తక్షణమే చర్యలు తీసుకుంటాను.

శ్రీ జె. వెంకట్రావు:–అధ్యక్షా, రు.12 కోట్లు ఖర్చు పెట్టాము అంటున్నారు. అవి ఎక్కడికి పోయాయి? తప్పని సరిగా ఎంక్వయిరీ చేయాలి. ఫండ్స్ ఖర్చు పెట్టినట్లుగా మాకు ఎక్కడా కనిపించడం లేదు. నా నియోజక వర్గంలో ఎక్కడా ఏ ట్యాంకు రిపేర్ జరగలేదు. రు.12 కోట్లు ఎక్కడికిపోయాయో మాకు తెలియదు. దాని మీద ఎంక్వయిరీ చేయించండి.

శ్రీ ఎ. చంద్రశేఖర్:– అన్నిటి మీద ఇప్పటి వరకు ఎక్కడెక్కడ ఏ ఏ వర్కులు మీద ఎంతెంత ఎమౌంట్ పెట్టారు అన్నది నేను వివరాలు పంపుతాను.

## సర్వశ్రేయో నిధిని మళ్లించుట

**SNQ No. (120-B) 85-U**

**Sri K. Nagesh** (Alair)**-** Will the Minister for Endowments be pleased to state:

a) Whether it is a fact that the amount being allocated to CGF from the income of Temples has been increased from 6% to 12 - 14% ;
b) Whether it lis also a fact that CGF amounts have been diverted from the respective districts to other districts and other programmes like Neeru Meeru are being taken up ;
c) If so, whether it is a fact that funds required to impart religious and spiritual education in respective areas of Temples are not available adequately due to the above said reason ;
d) the alternatives being contemplated to overcome the said problem ;
e) whether the role of temples in the development of tourism will be increased ; and
f) the role of Endowment Department in the development of Global Tourism ?

**MINISTER FOR ENDOWMENTS(SRI M. SATYANARAYANA RAO) :**

Sir, answer

a) No Sir.
b) There is no stipulation to spend the amounts collected in a district towards CGF in that district only. The entire state is being treated as a single unit in this regard. No amounts are being spent for programmes like Neeru-Meeru from CGF.
c) Does not arise.
d) Does not arise.
e) Yes Sir.
f) The Endowment Department has no plans as yet to promote global tourism.

శ్రీ పి. జనార్ధన రెడ్డి(ఖైరతాబాద్):- అధ్యక్షా, దేవాలయాల ఆదాయం నుంచి సిజిఎఫ్ క్రింద కేటాయిస్తున్న మొత్తం 6 శాతం నుంచి 12 టు 14 శాతానికి పెంచిన మాట వాస్తవమేనా? ఇందులో 12 నుంచి 14 శాతం, ఇంకా ఎక్కువ పెంచడం జరిగింది. 3 శాతం సిజిఎఫ్ క్రింద, 15 శాతం కంట్రిబ్యూషన్ ఫండ్ క్రింద దేవాలయాల ఆదాయం నుంచి తీసుకు రావడం జరుగుతోంది. దేవాలయాల ఆదాయం తక్కువగా అంటే రు.3 లక్షలు, 4 లక్షలు ఉన్నటువంటివి సిజిఎఫ్ నుంచి కాని కంట్రిబ్యూషన్ కాని ఏదైనా మినహాయింపు చేస్తారా? ఇంకో విషయం. దేవాలయాలను టూరిజం సెంటర్‌గా చేస్తే బాగుండదు. ఎవరైతే యాత్రికులు వస్తారో భక్తి రూపంగా వస్తే అక్కడ ఇంపార్టెన్స్ ఉంటుంది. భక్తి శ్రద్ధలతో దేవాలయాలలో పూజలు చేస్తే బాగుంటుంది. టూరిజం సెంటర్ లాగా అంటే ఫారినర్స్ వస్తారు. దేవాలయాల ప్రాముఖ్యత దెబ్బ తింటుంది. భక్తుల కొరకు కట్టినవి కాబట్టి టూరిజం సెంటర్‌గా పెడితే బాగుండదు. ఇప్పటి వరకు సిజిఎఫ్ కాని కంట్రిబ్యూషన్ కాని ఎంత వసూలు అయింది? ఇవన్నీ దేని మీద ఖర్చు పెట్టారు? నీరు-మీరు క్రింద ప్రభుత్వం ఖర్చు పెట్టలేదు. సిజిఎఫ్ సంవత్సరానికి ఎంత వసూలు కావడం జరుగుతోంది?

శ్రీ కె. నగేష్:- అధ్యక్షా, మేము 12 నుంచి 14 శాతం రాశాము కాని 16 శాతం వరకు కూడా ప్రభుత్వ దేవాలయాలలో తీసుకువస్తున్నాము. ఈ డబ్బును ఉద్యోగస్థుల జీతాల కోసం వాడుతున్నారు. అయితే ఎ గ్రేడ్‌గా ఉన్నటువంటి కొన్ని దేవాలయాలలో మీరు వాటి ద్వారా వచ్చే డబ్బుని మిగతా ప్రాంతాల దేవాలయాలకు మినహాయిస్తే ఫర్వాలేదు కాని ఆఖరుకు నీరు-మీరు పథకం క్రింద కూడా దేవాలయాల డబ్బును గత ప్రభుత్వం ఉపయోగించింది. దీని వల్ల దేవాలయాలలో ఉన్నటువంటి సంస్కృతి, ఆధ్యాత్మికంగా ఏవైతే కార్యక్రమాలు చేపట్టాలో అవి చేపట్టకుండా నీరు-మీరు పథకానికి మళ్లించడం జరిగింది. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలిగించడం లేదు. యాదగిరి గుట్టలో ఇంతకు ముందు సంవత్సరానికి రు.20, 30 లక్షలు పోతోంది. ఇప్పుడు రు.80 లక్షలు, కోటి రూపాయలు ప్రభుత్వానికి కడుతున్నారు. యాత్రికులకు కనీస సౌకర్యాలు లేవు. స్నానానికి వసతులు లేవు. తాగడానికి మంచినీళ్లు లేవు. ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యారని ప్రజలు ధర్నాలు చేయడం జరిగింది. అఖిల పక్షం వారు వెళ్లడం జరిగింది. సి.జి.ఎఫ్ క్రింద డబ్బులు డైవర్ట్ అవుతున్నాయి. సరైన న్యాయం చేయలేకపోతున్నాము. ఇవన్నీ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే తప్ప మేము ఏమీ సహాయం చేయలేని పరిస్థితిలో ఉన్నాము అని చెప్పారు. యాదగిరి గుట్ట హైదరాబాదుకు చాలా దగ్గరగా ఉండి పిక్‌నిక్ స్పాట్ లాగ వాడుకుంటున్నారు తప్ప ఆధ్యాతికంగా రూపు దిద్దుకోవడం లేదు. సంగీత కళాశాల, డ్యాన్స్ కళాశాల, వేదపాఠశాల, సాంస్కృతిక కళాశాల కావాలని అడిగాము. అవన్నీ పెట్టడానికి యాదగిరి గుట్టపైన ఏమాత్రం డబ్బు లేకుండా చేశారు. భక్తుల ద్వారా వచ్చే డబ్బు యాత్రికులకు ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటు చేసి వారి కోసం ఉపయోగించాలి. పర్యాటక ప్రాంతాలకు అక్కడ ఉన్న చెరువులకు ఇప్పటి వరకు మంచి ప్రాజెక్టులు చేపట్టలేదు. పర్యాటక మంత్రి గారికి చెప్పాము. అయినా కూడా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. తెలంగాణా లో ముఖ్యమైన దేవాలయం యాదగిరి గుట్ట. ఆ దేవాలయానికి కావలసిన అభివృద్ధి కార్యక్రమాలకు యాత్రికుల ద్వారా వచ్చే డబ్బు ఉంపయోగించాలి. సిజిఎఫ్ ద్వారా వచ్చే డబ్బు స్థానికంగా ఉపయోగించి చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

ఉ. 11.30

శ్రీ కె. అచ్చన్నాయుడు(హరిశ్చంద్రాపురం): అధ్యక్షా, మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. గతంలో రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు సిజియఫ్ గ్రాంట్ మంజూరుచేయడం జరిగింది. దేవాలయాల పనులు కూడా పూర్తయినాయి. కానీ యింకా నిధులు రిలీజ్ కాలేదు. అందువలన రిలీజ్ చేయవలసిందిగా కోరుతున్నాను. గతంలో గ్రామంలో ఎవరయినా రు. 5000 విరాళం కడితే ప్రభుత్వం సిజియఫ్ గ్రాంట్ నుండి రు. 25,000 చాలావరకు రామాలయాల కొరకు మంజూరు చేసేవారు. గతంలో చాలమంది కట్టిన డిడిలు తమ డిపార్ట్‌మెంట్ దగ్గర వున్నాయి. వాటిని బయటకు తీసి వీలైనంత త్వరగా మంజూరు చేయాలని తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ యం . సత్యనారాయణరావు: జనార్దనరెడ్డి గారు వేసిన ప్రశ్నకు జవాబు, 12 శాతం, 15 శాతం కలెక్ట్ చేస్తున్నట్లుగా వారు చెబుతున్నది తప్పు. కేవలం 3 శాతం మాత్రమే కలెక్ట్ చేస్తున్నారు. అది కూడా 50 వేల పైచిలుకు ఆదాయం వున్న టెంపుల్స్ నుండి సిజియఫ్ గ్రాంట్ 3 శాతం వస్తుంది. వీకర్ సెక్షన్స్‌కు సంబంధించిన టెంపుల్స్ విషయంలో ఏమయినా శ్రద్ధవహిస్తారా అని వారు అడిగారు. మీ అందరికీ తెలుసు, సిజియఫ్ గ్రాంట్స్ నుండి వీకర్ సెక్షన్స్ కాలనీస్‌లో కట్టడానికి ప్రాముఖ్యత యిస్తున్నాము. వీకర్ సెక్షన్స్ కాలనీస్‌లో కట్టడానికి, రిన్నొవేషన్‌కు ప్రాముఖ్యత యిస్తున్నాము. ఇతర సభ్యులు కూడా అడిగారు. 5 శాతం కాదు, రాయలసీమ, తెలంగాణా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో 20 శాతం మ్యాచింగ్ గ్రాంట్ మీరు యిస్తే 80 శాతం సిజియఫ్ గ్రాంట్ టెంపుల్స్ తరఫున యిస్తాము. జనార్దనరెడ్డి గారు మరొక విషయం కూడా ప్రస్తావించారు. టెంపుల్ ఫండ్స్ టెంపుల్స్ కొరకే ఉపయోగించాలని, వేదపాఠశాలలు పెట్టాలే తప్ప , టూరిజం డెవలప్‌మెంట్ కొరకు వాడడం మంచిది కాదని అన్నారు. వారితో నేను ఏకీభవిస్తున్నాను. టెంపుల్స్‌కు, టూరిజంకు అవినాభావ సంబంధం వుంది. రెండు పోర్ట్‌ఫోలియోస్ ఒకటిగా వుంటే బాగుండేది. టూరిస్ట్‌లు టెంపుల్స్‌కు కూడా పోతున్నారు. దేవాలయాలకు వెళ్లి పూజలు

చేస్తున్నారు. జనార్దనరెడ్డిగారు పెద్దమ్మ గుడి కట్టారు. వారిని అభినందిస్తున్నాను. వారి ఎగ్జాంపుల్ అందరు తీసుకుంటే బాగుంటుంది. మా నుండి ఏమీ ఎక్స్‌పెక్ట్ చేయకుండా మీరే కృషి చేసి పెద్దమ్మ టెంపుల్ ఎలా డెవలప్ చేశారో, అదే విధంగా , మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకొని మిగతా సభ్యులు ఈ విధంగా చేస్తే బాగుంటుంది. సిజియఫ్ ఫండ్ తప్పకుండా యిస్తామని చెబుతున్నాము. 20 శాతం రాయలసీమ, తెలంగాణాలలో, 40 శాతం కోస్తా జిల్లాలలో మీరు యిస్తే తతిమ్మాది మ్యాచింగ్ గ్రాంట్ యిస్తాము.

శ్రీ కె. నగేష్: అధ్యక్షా, మంత్రిగారికి మరలా మనవి చేస్తున్నాను. యాదగిరి గుట్టను ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దడం కోసం ప్రభుత్వం ఏ రకమైన చర్యలు తీసుకుంటుందో తెలియజేయవలసిందిగా స్పష్టంగా అడిగాము.

శ్రీ యం. సత్యనారాయణ రావు: అధ్యక్షా, యాదగిరిగుట్ట తెలంగాణాలోను, మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే బాగా ప్రసిద్ధిచెందింది. తిరుపతి తరువాత డిమాండ్ యాదగిరి గుట్టకు వుంది. సిటీకి దగ్గరగా వుండడం వల్ల అనేకమంది భక్తులు పోతున్నారు. దాన్ని ఎంతో డెవలప్ చేయవలసి వున్నది. అక్కడ చౌల్ట్రీస్ కట్టవలసి వున్నది. నీటివసతి కల్పించవలసి వున్నది. అక్కడ వాటర్ సోర్స్ లేదు. నేను అక్కడకు వెళ్లినప్పుడు చూశాను. ఏమి చేయాలనేది ఆలోచిస్తున్నాము. నీటి సరఫరాను తప్పకుండా కల్పించవలసి వున్నది. ఆధ్యాత్మిక పరంగా అక్కడ యజ్ఞయాగాదులు జరిగాయి. ఇతర కార్యక్రమాలను కూడా చేయబోతున్నాము. తప్పకుండా మీరు సూచించిన విషయం దృష్టిలో పెట్టుకొని ఆ విధంగా డెవలప్ చేసే ప్రయత్నం చేస్తాము.

శ్రీ పి. జనార్దనరెడ్డి: అధ్యక్షా, చిన్న క్లారిఫికేషన్. మంత్రిగారికి అధికారులు సరిగా సమాచారం యిచ్చారో, లేదో తెలియదు. వచ్చిన ఆదాయం నుండి 3 శాతం కామన్ గుడ్ ఫండ్ క్రింద వసూలు చేయడం జరుగుతోంది. అంతే కాకుండా వచ్చిన ఆదాయం నుండి 12 శాతం కంట్రిబ్యూషన్‌గా కట్టడం జరుగుతోంది. ఆదాయం తక్కువగా వుండే చిన్న దేవాలయాలలో జీతాలే సరిగా యివ్వలేనప్పుడు ఎట్లా కంట్రిబ్యూషన్ చేయగలరు? 12 శాతం కంట్రిబ్యూషన్, 3 శాతం సిజియఫ్ వసూలు చేస్తున్నారు. టూరిజం, ఎండోమెంట్స్ ఒక్కరి దగ్గర వుంటే మంచిదని మంత్రిగారు అంటున్నారు. ఎండోమెంట్స్ వారు భక్తి శ్రద్ధలతో భక్తులను ఆకర్షిస్తారు. టూరిజంకు సంబంధించి దుర్గం చెరువు దగ్గర జరిగిన అర్ధనగ్న నృత్యం గురించి ఇంతకుముందు అసెంబ్లీలో అడగడం కూడా జరిగింది.

శ్రీ యం . సత్యనారాయణరావు: వారి ఆవేదనను అర్థం చేసుకున్నాను. టూరిజం డెవలప్‌మెంట్ క్రింద వారు చెప్పిన విధంగా డ్యాన్స్‌లు చేశారు. మొన్న దానికి సంబంధించి ప్రశ్న కూడా వచ్చింది. టూరిజం మంత్రిగారు చెప్పడమే కాకుండా, హోం శాఖ మంత్రిగారు సివియర్ యాక్షన్ తీసుకుంటామని చెప్పారు. యాక్షన్ తీసుకున్న విషయం పత్రికల ద్వారా చూశాము. అటువంటివి ప్రోత్సహించము. వారితో ఏకీభవిస్తున్నాను. అటువంటి డ్యాన్స్‌లు కాకుండా భక్తికి సంబంధించి కూచిపూడి, భరతనాట్యం, భక్తి కథలు మొదలైనవి పెట్టే పరిస్థితి రావాలి తప్ప , వారి యిష్టం వచ్చిన రెండర్థాల పాటలు, డ్యాన్సులు కాదు. యాదగిరి గుట్ట గుట్ట మీద వుంది కనుక భక్తులతోబాటు టూరిస్టులు కూడా వస్తారు. తిరుపతి కొండకు భక్తులతోబాటు, ఫారినర్స్ కూడా వస్తారు. సింహాచలం టెంపుల్‌కి వెడితే ఎంతో ఆనందం కలుగుతుంది. భక్తితోబాటు ఆహ్లాదం కూడా కలుగుతుంది. మీరు చెప్పినటువంటి విషయాలను మీ మనసు నుండి తొలగించండి. అటువంటివి ఎంకరేజ్ చేయవద్దు. మీతో ఏకీభవిస్తున్నాను.

## జీరో అవర్

మిష్టర్ స్పీకర్: జీరో అవర్‌లో రెండు నిముషాల టైమ్ మాత్రమే తీసుకోవలసిందిగా సభ్యులను కోరుతున్నాను. రామకృష్ణుడు గారూ, మాట్లాడండి.

శ్రీ వై. రామకృష్ణుడు(తుని): అధ్యక్షా, ఎండోమెంట్స్ మినిస్టర్‌గారు చెబుతున్నారు. మీరంతా గుళ్లు కట్టుకోండని. ఆయన హుండీ పట్టుకొని ఎండోమెంట్స్‌కు ఆదాయం మూటకడతానంటున్నారు.

జీరో అవర్‌కు సంబంధించి మాట్లాడుతున్నాను. కేంద్రంలో రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు మా పార్టీ తరపున ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు, ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం జరిగిన విషయం రెయిజ్ చేయడం జరిగింది. దానికి సంబంధించి రిజొల్యూషన్ మూవ్ చేయవలసిందిగా కోరాము. లేదా మేము మూవ్ చేస్తే వారిని ప్రపోజ్ చేయవలసిందిగా కోరాము. ప్రభుత్వం తరఫున ఆలోచిస్తామని అన్నారు. కానీయింతవరకు ప్రస్తావించలేదు. నిన్న చిదంబరం గారు సెంట్రల్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆంధ్ర రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిన విషయం అందరికీ తెలుసు. బీహార్‌కు స్పెషల్ ప్యాకేజ్ యిచ్చారు. తమిళనాడుకు సంబంధించి రు.1000 కోట్లు డిశాలినేషన్ కొరకు చెన్నయ్‌కి యిచ్చారు. మన రాష్ట్రం నుండి కూడా రిక్వెస్ట్స్ వున్నాయి. బ్యాక్ వార్డ్ ఏరియాస్ అభివృద్ధికోసం స్పెషల్ ప్యాకేజ్ కావాలని కేంద్రాన్ని రిక్వెస్ట్ చేశాము. బ్యాక్‌వార్డ్ ఏరియాస్ అభివృద్ధి కొరకు స్పెషల్ ప్యాకేజ్ యివ్వడం కోసం బడ్జెట్‌లో ఎలకేషన్ జరగలేదు. యన్‌డిఏ గవర్నమెంట్‌లో మనం చాలా గ్రాంట్స్ తెచ్చుకోవడం జరిగింది. కావలసిన గ్రాంట్స్ తెచ్చుకొని ఆంధ్ర రాష్ట్రాన్ని డెవలప్ చేసుకున్నాము. యుపిఎ గవర్నమెంట్‌లో మన రాష్ట్రంలో వున్న అనేక పథకాల అమలుకు కావలసిన గ్రాంట్స్ యివ్వలేదు. బీహార్‌కు, మిగతా రాష్ట్రాలకు యిచ్చినట్లు మన రాష్ట్రానికి స్పెషల్ ప్యాకేజెస్ ఎందుకు యివ్వలేదు? బడ్జెట్ ఎలకేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందనే అభిప్రాయాన్ని ఎక్స్‌ప్రెస్ చేస్తున్నాము. ఒక రిజొల్యూషన్ పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి మన విజ్ఞప్తులను తెలియజేయడం సమంజసంగా వుంటుందనేది మా అభిప్రాయం అధ్యక్షా.

ఉ.11.40

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి:- అధ్యక్షా, ఉదయం సి.ఎల్.పి ఆఫీసు నుంచి నాకు ఫోన్ చేశారు. టి.డి.పి వారు అడ్జర్న్‌మెంట్ మోషన్ మూవ్ చేస్తున్నారు అన్నారు. వారు ఎందుకు విత్‌డ్రా చేసుకున్నారో నాకు తెలియదు. ఎందుకంటే చాలా చిన్న విషయాలకు వారు అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇచ్చేవారు. నిజంగా ఇంత తీవ్రత గుర్తించి ఉండి ఉంటే మేము కూడా అనుకున్నాము. దానికి ఏదైనా స్పందించవలసి ఉంటుంది అనుకుని వచ్చాము. తీరా చూస్తే ఎందుకు విత్‌డ్రా చేసుకున్నారో నేను ఆ విషయాల గురించి పోదలచుకోలేదు. సమన్వయ లోపమో లేక ఇంకొకటో దానిలోకి వెళ్లదలచుకోలేదు. వారి సమస్యలు, వారి కన్‌ఫ్యూజన్ వారికి ఉంది.

ఇందాక పెద్దలు రామకృష్ణుడు గారు లేవనెత్తారు. కేంద్ర ప్రభుత్వం యొక్క బడ్జెట్ గ్రామీణ ప్రాంతాలకు, రైతాంగానికి ఊరట కలిగించే మంచి బడ్జెటు. ప్రత్యేక ప్యాకేజ్ అన్నారు. ప్యాకేజ్ మేము అడగలేదు. ముఖ్యమంత్రి గారు ఫ్లోర్ ఆఫ్ ది హౌస్ చెప్పడం జరిగింది. ప్రత్యేక ప్యాకేజీగా మేము అడగలేదు. మొత్తం అవసరాలు ఏవో చెప్పడం జరిగింది. ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ రాష్ట్ర అవసరాలు ఉన్నటువంటి వాటిని తీసుకు రావడంలో సఫలీకృతం అవుతాము.

శ్రీ వై. రామకృష్ణుడు:- అధ్యక్షా,

MR. SPEAKER:- This is Zero Hour. Please.

శ్రీ వై. రామకృష్ణుడు:- మంత్రి గారు చెప్పకపోతే నేను లేచేవాడిని కాను. మంత్రి గారు సరిగా సమాధానం చెప్పినా, లేక తరువాత సమాధానం చెబుతాము అని చెప్పినా నేను కూర్చునేవాడిని. అడ్జర్న్‌మోషన్ ఎప్పుడు ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి, ఏమి ఇవ్వాలి, అదే విధంగా 304 ఏమి ఇవ్వాలి అని చెప్పించుకునే స్థితిలో లేము. ఎప్పుడు అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇవ్వాలో, ఏ విధంగా ఇవ్వాలో తెలుసు. ఎందుకు విత్‌డ్రా చేసుకున్నారో అంటే that is our right. పరిస్థితులను బట్టి మేము తీసుకుంటాము. అంతేకాని మీరు

ఈ ఇస్యూ మీద ఇవ్వండి, దీని మీద అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇవ్వకూడదు అని చెప్పించుకునే స్థితిలో లేము. ఎలాంటి ఉచిత సలహాలు మాకు అక్కర్లేదు. మేము అడిగిన దానికి చెప్పండి. చాలు. కరవు రైతుల గురించి ప్రధాన మంత్రి గారు వచ్చారు. రు.1000 కోట్లు ఇస్తాము అన్నారు. ఆ రు.1000 కోట్లు ఎందుకు ఇవ్వలేదు? అటువంటి విషయం మీద సమాధానం చెప్పండి. నోటీసులు ఎట్లా ఇవ్వాలి, ఎందుకు ఇవ్వాలి, ఎందుకు విత్‌డ్రా చేసుకున్నారు అనే హక్కు మీకు లేదు.

శ్రీ జె. రంగా రెడ్డి:- అధ్యక్షా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యుత్ బిల్ కలెక్టర్స్ సుమారుగా 1000 మంది గత 17 సంవత్సరాల కాలం నుంచి వారు పని చేయడం జరుగుతోంది. వీరికి కనీస వేతనం అమలు అయ్యే పరిస్థితి లేదు. వీళ్ల వసూలు చేసుకున్న బిల్లుకు 50 పైసలు మాత్రమే ఇవ్వడం జరుగుతోంది. 80 శాతం కలెక్షన్ చేస్తే రూపాయి మాత్రమే ఇవ్వడం జరుగుతోంది. 1987 నుంచి ఇది అమలులో ఉన్నాయి. అప్పటి నుంచి 50 పైసలకన్నా ఎక్కువ పెంచలేదు. దాని వల్ల ఈ 1000 మంది బిల్ కలెక్టర్స్ అనేక ఇబ్బందులకు గురి కావడం జరిగింది. ఈనాడు శాశ్వత ఉద్యోగులకు నాల్గవ వేతన సవరణలు జరిగాయి. వీరిని తీసుకోవాలని, వీరికి కూడా అమలు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా బిల్ కలెక్టర్స్ అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పైగా ఇ-సేవా కేంద్రాలకు ఇష్టం వచ్చినట్లుగా రాయితీలు ఇస్తున్నారు. వారికి ఇచ్చే రాయితీలు పోల్చి చూస్తే ఇప్పటి వరకు వీరికి ఇస్తున్నది చాలా తక్కువ. రు.6.25 ల చొప్పున ఇ-సేవా కేంద్రాలకు రాయితీ ఇవ్వడం జరుగుతోంది. పైగా 80 శాతం బిల్లులకు సరిపడా మొత్తం కూడా చెల్లించడం జరుగుతోంది.

మిస్టర్ స్పీకర్:- ఇది జీరో అవర్. పూర్తి చేయండి.

శ్రీ జె. రంగారెడ్డి:- ఇ-సేవా కేంద్రాలకు ఇచ్చే రాయితీల కంటే పెద్ద మొత్తంలో ఇస్తున్నాము. ఆ విధంగా ఈ బిల్ కలెక్టర్స్‌కు ఇచ్చినట్లయితే ఈ 1000 మందికి ఉపాధి లభించడమే కాకుండా శాశ్వత పరిష్కారం కావడం జరుగుతుంది. అందుకొరకే ఇ-సేవా కేంద్రాలకు ఇచ్చే రాయితీ మానుకోవాలి. ఈ బిల్ కలెక్టర్స్‌ను పర్మనెంట్ చేయవలసిన అవసరం ఉంది. లక్ష రూపాయల గ్యారంటీ అడుగుతున్నారు.

మిస్టర్ స్పీకర్:- ఇది జీరో అవర్. పూర్తి చేయండి. చాలా మంది కొత్త సభ్యులు ఉన్నారు. వారికి కూడా అవకాశం ఇవ్వాలని రోజూ చెబుతున్నాను. వారికి కూడా సమయం కేటాయించాలి కదా.

శ్రీ జె.రంగారెడ్డి:- వీరంతా చదువుకున్న నిరుద్యోగులు. గ్యారంటీ ఇవ్వకపోతే క్యాన్సిల్ చేయడం జరుగుతోంది. ఆ పద్ధతి మంచిది కాదు. అలాగే 2001 సంవత్సరంలో శాసన సభ కమిటీ రికమెండ్ చేయడం జరిగింది. ఖాళీ పోస్టులలో ఎల్‌డిసి లుగా తీసుకోవాలన్నారు.

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి:- గౌరవ సభ్యులు చెప్పిన విషయం నోట్ చేసుకున్నాను. సరైన చర్యలు తీసుకుంటాము.

శ్రీ . జె. రంగా రెడ్డి:- అధ్యక్షా, నేను ఇంకా కంప్లీట్ చేయలేదు.

మిస్టర్ స్పీకర్:- 10 నిముషాలు మాట్లాడి ఇంకా సబ్జెక్ట్ కంప్లీట్ కాలేదు అంటే ఎలా? జీరో అవర్‌లో రెండు నిముషాలలో పూర్తి చేయాలి.

శ్రీ జె. రంగా రెడ్డి:- ఈ విషయం 2001 సంవత్సరంలో శాసన సభ కమిటీ రికమెండ్ చేయడం జరిగింది. ఎల్‌డిసి, ఆర్‌సి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ వారిని భర్తీ చేయాలని రికమెండ్ చేయడం జరిగింది. వారిని ఆ పోస్టులలో భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలి. జూనియర్ లైన్‌మెన్ మూడు, నాలుగు వేల మంది కంట్రాక్ట్ బేసిస్ పైన పని చేస్తున్నారు. వారి విషయంలో కూడా న్యాయం చేయాలని కోరుతున్నాను.

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి:- నోట్ చేసుకున్నాను.

శ్రీ పి. వెంకటేశ్వర రావు:- అధ్యక్షా, ఖమ్మం జిల్లా, బూర్గుంపాడు నియోజక వర్గంలో సారపాకలో ఉన్నటువంటి పేపర్ బోర్డు కర్మాగారంలో ఉప్పర్ల ప్రతాప రెడ్డి అనే క్యాజువల్ లేబర్ పని చేస్తున్నారు. గత రాత్రి పని చేస్తున్న సందర్భంలో 12.30 గంటల సమయంలో రివైండర్‌లో పడడం వల్ల మరణించడం జరిగింది. ఆ ప్రాంతంలో పేపర్ బోర్డు యాజమాన్యం వారు పర్మనెంట్ అయిన కార్మికుని పెట్టవలసిన అవసరం ఉంది. అలా కాకుండా క్యాజువల్ లేబర్‌ను పెట్టి పని చేయించడం పేపరు బోర్డు యాజమాన్యం యొక్క నిర్లక్షానికి నిదర్శనంగా కనపడుతున్నది. ప్రతాపరెడ్డి ప్రమాదానికి కారణం అయిన ఈ పేపర్ బోర్డు యాజమాన్యం పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. మరణించిన ప్రతాపరెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు, అన్ని యూనియన్స్ వారు, అన్ని పార్టీల వారు ఆందోళన చేస్తున్నారు. అయినా కూడా పేపర్ బోర్డు యాజమాన్యం వారు స్పందించడం లేదు. కాబట్టి ఈ సంఘటనకు బాధ్యులైన అధికారులపైన చర్యలు తీసుకుని మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రు. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

శ్రీ ఎన్. రఘువీరా రెడ్డి:- నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి పంపుతాము.

جناب اکبرالدین اویسی - شہر حیدرآباد میں اس وقت پینے کے پانی کا ایک تشویش ناک مسئلہ بنا ہوا ہے - کرشنا کا پانی بہت سارے علاقوں میں دینے کا اعلان کردیا گیا تھا لیکن وہاں پانی کی سربراہی برابر نہیں ہورہی ہے اور جہاں پر کرشنا کا پانی آرہا ہے اس پانی کو چوبیس گھنٹے رکھنے سے بدبو پیدا ہو رہی ہے - شہر حیدرآباد کے ان علاقوں میں پانی کی سربراہی برابر نہیں ہے جیسے حلقہ چارمینار میں جہاں نما' اپّا ریڈی نگر' مدینہ کالونی' قاضی پورہ' خلوت' رحمت پورہ' کاماٹی پورہ' نواب صاحب کنٹہ' اندرانگر اور فاطمہ نگر حلقہ یاقوت پورہ میں عیدی بازار' رین بازار' منڈی میر عالم' نورخاں بازار' ڈبیر پورہ اور حلقہ چندرائن گٹہ میں ریاست نگر' حافظ بابا نگر' معین باغ' بارکس' جنگم میٹ' ہاشم آباد اور حلقہ آصف نگر میں فرسٹ لانسر ' ملے پلی' اے-سی گارڈ حلقہ خیریت آباد ' ملک پیٹ' مشیر آباد کے علاوہ شہر کے کئی حصوں میں پانی کی برابر سربراہی نہ ہونے کی وجہ سے شدید قلت ہو رہی ہے - بارش نہیں ہونے کی وجہ سے بھی پانی کی قلت میں مزید اضافہ ہوگیا ہے- میں وزیر بلدیہ سے درخواست کرتا ہوں کہ وہ سٹی ایم-ایل-ایز کی ایک میٹنگ طلب کریں تاکہ اس مسئلہ پر بات کرسکیں -

ఉ. 11.50

శ్రీ చల్లా రామకృష్ణారెడ్డి (కోయిలకుంట్ల): స్పీకర్ సార్. ఈ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఒక ప్రధాన రంగంగా భావిస్తోంది. అట్లాగే ఇది రైతు రాజ్యమని ప్రకటించింది. సంతోషం. వ్యవసాయ రంగంలో ఒక నేషనల్ అవార్డు గ్రహీతగా రైతు శ్రేయస్సే లక్ష్యంగా మా మిత్రుడు వ్యవసాయ శాఖా మంత్రి గారిని అడుగుతున్నాను.

మన రాష్ట్రంలో 400 మండలాల్లో అగ్రికల్చర్ ఆఫీసర్సు లేరు. వ్యవసాయ రంగాన్ని ప్రధాన రంగంగా తీసుకుని, రైతు రాజ్యంగా మన ప్రభుత్వం ప్రకటించినపుడు, వ్యవసాయ రంగంలో ప్రాధాన్యత ఇచ్చినపుడు రైతులకు అనుగుణంగా సలహాలు ఇవ్వడానికి రైతులకు చేదోడు వాదోడుగా ఉండటానికి అగ్రికల్చర్ ఆఫీసర్సు ప్రతి మండలంలో ఉండాలి. అటువంటిది, 400 మండలాల్లో అగ్రికల్చర్ ఆఫీసర్సు లేకపోవడం, ఉన్న వాళ్లలో 110 మంది కాంట్రాక్టు బేసిస్ మీద ఉండటం జరుగుతోంది. స్టాట్యుటరీ పవర్సు వాళ్లకు ఉండవు. సీడ్ యాక్టు, ఇన్‌సెక్ట్ యాక్టు, పెస్టిసైడ్ కంట్రోల్ ఆర్డర్,నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులను నియంత్రించే అధికారాలు వారికి ఉండవు. పోలీసు ఉంటాడు గానీ దొంగను పట్టుకోలేడు. మనది రైతు రాజ్యమని గొప్పగా ప్రకటించుకున్నాము కాబట్టి తప్పనిసరిగా ఇలా కాంట్రాక్టు బేసిస్ మీద కాకుండా, ప్రతి మండలంలో ఒక రెగ్యులర్ అగ్రికల్చర్ ఆఫీసరు ఉండేలా ప్రయత్నం చేయాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను. ఈ ప్రయత్నంలో మీ లక్ష్యం ఎప్పటిలోగా సఫలీకృతం చేస్తారో చెప్పాలని కోరుతున్నాను.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి : నోట్ చేసుకున్నాము. తగు చర్య తీసుకుంటామని మనవి చేస్తున్నాను.

శ్రీ సిహెచ్. వంశీకృష్ణ (అచ్చంపేట): అధ్యక్షా, ఈ రోజు ఆంధ్ర రాష్ట్రంలో వెనుకబడిన జిల్లా మహబూబు నగరు జిల్లా. మా జిల్లాలో అచ్చంపేట చాలా వెనుకబడిన నియోజకవర్గం. ఇరిగేషను గాని, ఇండస్ట్రీస్ గాని ఇక్కడ లేవు. ఈ ప్రాంతం అంతా నల్లమల ప్రాంతంలో 30, 40 శాతం ఉంది. ఇక్కడ ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్ (పి.టి.జి.) చెంచులు చాలా దుర్భర జీవితం గడుపుతున్నారు. వీరి దుర్భర జీవితం గురించి గత ప్రభుత్వ దృష్టికి తేవడం జరిగింది. వీరికి వైద్య సదుపాయం లేదు. గృహ నిర్మాణం లేదు. మంచి నీటి కొరత ఉంది. విద్యుత్ ఇబ్బంది ఉంది. మన్ననూరు నుంచి మహబూబునగరు వరకూ వీరు పాద యాత్ర చేశారు. అప్పుడు ప్రభుత్వంలో ఉన్న మంత్రి గారు, కలెక్టరు, ఆర్‌డీఓ పాద యాత్రను అడ్డుకుని ఒక నెల లోపల మీకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని చెప్పారు. ఇప్పుడు గౌరవనీయులైన ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజలలో, ఈ పి.టి.జి.లు, ఎస్‌సి, ఎస్‌టిలు, బిసిలు, వెనుకబడిన తరగతుల వారిలో ఆశ చిగురిస్తోంది. మేము నేరుగా ప్రభుత్వానికి విన్నవించేది, ఇచ్చిన హామీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, చెంచులకు అన్యాయం చేస్తున్నారు. వారు పెట్టిన డిమాండ్సు చాలా వీలయినవి. వీటి వల్ల ప్రభుత్వానికి భారం ఉండదు. వారు చాలా సులభమైన డిమాండ్సు పెట్టారు. అవి ఏమిటంటే, వారికి పూర్తి వైద్య సదుపాయం కల్పించాలి. చెంచుగూడేలకు రవాణా సౌకర్యం మెరుగుపరచాలి. వృద్ధులకు వృద్ధాప్య పింఛను, బడికి పోయే వయసు పిల్లలను రెసిడెన్షియల్ స్కూలులో చేర్పించడం, వారిని లిటరసీ పరంగా ఇంప్రూవ్ చేయడం వంటివి. మహబూబునగరులో 126 గూడేలున్నాయి. ఐటిడిఏ శ్రీశైలం పరిధిలోకి వస్తాయి. ఈ పి.టి.జి. గ్రూపులను ఆదుకుని, వారి బ్రతుకులను మెరుగుపరచి, తీర్చిదిద్దాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాను.

అధ్యక్షా, ముఖ్యమైనది, ఈ గూడేలు అటవీ ప్రాంతంలో ఉన్నప్పటికీ కొన్ని గూడేలను ఏజెన్సీ ఏరియాలుగా గుర్తించలేదు. కాబట్టి వాటిని ఏజెన్సీ ఏరియాలుగా గుర్తించి, అటవీ ప్రాంతంలో ఉన్న ఆ భూమిని పి.టి.జి. చెంచులకు హక్కు కల్పించాలని కోరుతున్నాను.

శ్రీ డి.ఎస్. రెడ్యా నాయక్ : నోట్ చేసుకున్నాను. సంబంధిత మంత్రి గారికి పంపిస్తాను.

శ్రీ పి. శశిధరరెడ్డి : స్పీకర్ సార్. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14 లక్షల మంది ఉద్యోగస్తులకు సంబంధించింది ఇది. ప్రధానంగా స్పీకరు గారి ఛాంబరులో పని చేసే పిఎ, పిఎస్‌లు గాని అనేకమంది మంత్రుల కార్యాలయాల్లో గాని, ముఖ్యమంత్రి గారి కార్యాలయంలో గాని పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించింది. వీరి వేతన సవరణ కొరకు పే రివిజన్ కమిషన్ వేసి 8 – 9 నెలలు కావస్తోంది. దాని ఫైనల్ రిపోర్టు వచ్చే వరకూ తక్షణమే వారికి ఇంటెరిమ్ రిలీఫ్ ఇవ్వాలని, ఫైనాన్సు మినిస్టరు గారి నుంచి

నిర్దిష్టమైన హామీ రావాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు అంతకు ముందు ఉద్యోగ సంఘాల వారు విజ్ఞప్తి చేసినపుడు 15 శాతం ఇంటెరిమ్ రిలీఫ్ ఇస్తామన్నారు. మన బడ్జెట్ సమావేశాలు జులై 29 వరకూ జరుగుతాయి. ఈ సెషను జరగాలన్నా, సంక్షేమ పథకాలు ప్రజలకు వెళ్లాలన్నా మీ పక్కనే ఉన్న దుబాసీ వంటి వారి నుంచి అందరకూ ఇంటెరిమ్ రిలీఫ్ అవసరం ఉంది. అందుకొరకు పే రివిజన్ కమిషన్ ఫైనల్‌గా వచ్చేవరకూ ఉద్యోగులకు 30 శాతం ఇంటెరిం రిలీఫ్ తక్షణమే ఇవ్వాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఎన్. రఘువీరారెడ్డి : సంబంధిత మంత్రి గారికి వివరాలు తెలియజేస్తాను.

శ్రీ కె. వీరభద్రస్వామి (విజయనగరం): అధ్యక్షా, మా విజయనగరం జిల్లా వెనుకబడిన జిల్లా అని మీ అందరకూ సుపరిచితమే. మా జిల్లాలో ముఖ్యమైన విద్య, వైద్యం, సంక్షేమ శాఖలకు సంబంధించిన 22 మంది అధికారుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమైన బాధ్యతలు గల అధికారులు లేకపోవడం వల్ల వారి స్థానంలో ఇన్‌ఛార్జిలు పని చేస్తున్నారు. ఇందువల్ల ప్రధానమైన విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం కూడా వెనుకబాటుకు గురి అవుతోంది. దిగువ స్థాయి అధికారులు అదనపు బాధ్యతలు వహిస్తూ ఉండటం వల్ల ముఖ్యమైన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఇతర శాఖల అధికారులు ఇన్‌ఛార్జీలుగా బాధ్యతలు నిర్వహించడం వల్ల, ఒకరే రెండు శాఖలు నిర్వహించడం వల్ల ప్రజలకు పూర్తి న్యాయం జరగడం లేదు. రెండు చోట్ల విధులు నిర్వహించడం వల్ల ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియక ఇబ్బంది కలుగుతోంది. పరిపాలన ఎక్కడికక్కడ స్తంభిస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రాధాన్యత లోపించిన పలు శాఖలకు కేటాయించిన నిధులు సకాలంలో ఖర్చు కావడం లేదు. ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడా లేని పరిస్థితి ఈ విజయనగరం జిల్లాలో ఉంది. ముఖ్యమైన అధికారులు సుమారు 22 శాఖలకు చెందిన అధికారులు లేకుండా ఉన్నారు.

శ్రీ ఎస్. విజయరామరాజు : అధ్యక్షా, వారు చెప్పిన విషయాలను సమగ్రంగా నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా యాక్షను తీసుకుంటాము.

మ. 12 . 00

శ్రీ ఎం సత్యనారాయణ రెడ్డి (హన్మకొండ): నోట్ చేసుకుంటామని అంటారు గానీ సమాధానం రాకపోతే ఎట్లా ?

మిస్టర్ స్పీకర్ : నోట్ చేసుకుంటారు, మూడు రోజులల జవాబు వస్తుంది . పంపిస్తున్నారు .

శ్రీ కె నాగేష్: అధ్యక్షా, జాతీయ ఫైలేరియా నిర్మూలన కార్యక్రమం గత నెల 26 .6 . 2004 నాడు జరిగినపుడు నా నియోజకవర్గం ఆలేరు లోని 6 మండలాల్లో ని 50, 60 గ్రామాలలో మందులు వికటించి చాలామంది హాస్పిటల్ పాలయ్యారు . నేనే దాదాపు 1000 మంది పేషెంట్లను రాత్రింబగళ్లు చూచి ట్రీట్‌మెంట్ ఇచ్చాను . 7 మంది చనిపోయారు . దీని మీద మందులు ఇచ్చేప్పుడు రోగ నిర్ధారణ జరిగిన తరువాత మూడు విడతలుగా ఇచ్చే పరిస్థితి ఉంది . కానీ ఒకసారే మూడు డోసులు కలిపి ఇచ్చారు . దానివలన వికటించిందా ? లేకపోతే క్రానిక్ డిసీజెస్ ఉన్నవాళ్లకు మందులు ఇవ్వడం వలన చనిపోయారా ? సంపత్‌కుమార్ అనే 5 సంవత్సరాల విద్యార్థి కి 100 గ్రాముల డోసు ఒకేసారి ఇవ్వడం వలన చనిపోయాడు . మూర్ఛ, టిబి వచ్చిన వారికి ఈ మందు ఇస్తే చనిపోతారా ? క్రానిక్ డిసీజెస్ ఉన్న వారికి ఇస్తే చనిపోతారా ? ఈ మధ్య నల్గొండ జిల్లాలో విషజ్వరాలు వచ్చినప్పుడు వైరల్ ఫీవర్ అని అంతా ట్రీట్‌మెంట్ ఇచ్చారు . నా అనుమానం ఏమిటంటే, జిల్లాలో ఈ మధ్య వలస వెళ్లి వస్తున్నారు . డెంగ్యూ జ్వరం ఈ ప్రాంతంలో ప్రవేశించిందా , అందువలన ఈ మందులు ఇస్తున్నదానికి చనిపోతున్నారా దీనిపై విచారణ చేయవలసి ఉంది . డి ఎం అండ్ హెచ్ వో గారు ఈ రోజు పేపర్లో డిక్లేర్ చేశారు . దీనివలన

ఎవరూ చనిపోలేదని ఇచ్చారు . దీనిపై నిర్ధారణ చేయాలని మనవిచేస్తున్నాను . ఇది చెర్యాల ప్రాంతంలోనూ, మెదక్ జిల్లా సంగ్రూరు మండలంలో కూడా పాకింది . దీనికి డెంగ్యూ ఫీవర్‌తో సంబంధం ఉందని అనుమానిస్తున్నాము . దీనిపై సమగ్రమైన విచారణ చేసి , అక్కడ అందరూ భయపడుతున్నారు . జాతీయ నిర్మూలన కార్యక్రమం ఇక ఏ జిల్లాలో కూడా చేసే పరిస్థితి రాదు కాబట్టి దానిపై చర్యలు తీసుకోవాలని మనవిచేస్తున్నాను .

శ్రీ ధర్మాన ప్రసాద రావు : అధ్యక్షా, సభ్యుల ఆవేదన అర్థ అయింది . సంబంధిత అధికారులను చర్యలకై ఆదేశించడం జరుగుతుంది .

MR SPEAKER: Now, Teabreak for 10 minutes .

( The House is Adjourned Teabreak for 10 minutes ) .

**( టీ విరామానంతరం తిరిగి సభ మధ్యాహ్నం 12.20 గంటలకు సమావేశమైనది )**
**( శ్రీ బి.వేదవ్యాస్ అధ్యక్ష స్థానం వహించారు )**

( సభ సమావేశం కాగానే సభ్యులు శ్రీ పి.రామయ్య, నాన్ అఫిషియల్ బిజినెస్‌ను తీసుకోవలసిందిగా కోరారు )

చైర్మన్ : ముందర స్టాట్యుటరీ రిజల్యూషన్ తీసుకుందాము.

శ్రీ పి.రామయ్య : టీ బ్రేక్ అయిన వెంటనే నాన్ అఫిషియల్ బిజినెస్‌ను తీసుకుంటామని ఇందాక స్పీకర్ గారు చెప్పారు.

చైర్మన్ : లాస్ట్ 2 అవర్స్‌లో తీసుకుందాము.

శ్రీ పి.రామయ్య : లాస్ట్ 2 అవర్స్‌లో గ్యారంటీ ఏముంది ?

శ్రీ కె.రోశయ్య : అధ్యక్షా, ఇది ఒక సింపుల్ బిల్. ఆర్డినెన్స్‌ను రిప్లేస్ చేయడానికి పెట్టిన బిల్ ఇది. గత వారం రోజులుగా ప్రతి రోజూ లిస్ట్ అవుతోంది. నిన్న అడిగితే రేపు తీసుకుంటామని చెప్పారు. పెద్ద డిస్కషన్‌తో కూడుకున్నది కాదు. కాబట్టి మీరు స్టాట్యుటరీ రిజల్యూషన్ మూవ్ చేయండి, వారిని మాట్లాడమనండి.

శ్రీ పి.రామయ్య : ఇది ఆల్‌రెడీ మూవ్ అయింది. నాకు మాత్రం ఈ రోజు నాన్ అఫిషియల్ బిజినెస్ రావాలి.

శ్రీ కె.రోశయ్య : ఈ రోజు ప్రైవేట్ మెంబర్స్ బిజినెస్‌ను తప్పకుండా టేకప్ చేద్దాము. ముందు స్టాట్యుటరీ రిజల్యూషన్‌ను తీసుకుందాము. ఇది ఒక్క 5 నిమిషాలలో పూర్తవుతుంది.

## చట్టబద్ధ తీర్మానము

## 2003, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసులకు నియామకముల క్రమబద్ధీకరణ మరియు సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధముచేయు (సవరణ) ఆర్డినెన్సు

(నిరాకరించబడినది)

శ్రీ సున్నం రాజయ్య : అధ్యక్షా, 2003 డిసెంబర్ 29వ తేదీన గవర్నరుగారు జారీ చేసిన 2003 ఆంధ్ర ప్రదేశ్ ( పబ్లిక్ సర్వీసులకు నియామకముల క్రమబద్ధీకరణ మరియు సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధము చేయు ) (సవరణ ) ఆర్డినెన్స్, 2003 సంవత్సరపు ఆంధ్ర ప్రదేశ్ ఆర్డినెన్స్‌ను ఈ సభ నిరాకరిస్తున్నది.

శ్రీ ఎం.ఎ.గఫూర్ : సర్, మేము స్టాట్యుటరీ రిజల్యూషన్‌ను మూవ్ చేసాము. మంత్రిగారు పాస్ చేయమనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన ఈ బిల్ రాజ్యాంగ విరుద్ధమైనదని, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైనదని మా అభిప్రాయం. మన ఆర్థిక మంత్రిగారు మాటి మాటికీ సింపుల్ బిల్, సింపుల్ బిల్ అంటున్నారు. విషం ఒక్క చుక్క చాలు ప్రాణం తీయడానికి. ఇది చాలా సింపుల్‌గానే కనపడుతుంది కాని ప్రాణం కూడా సింపుల్‌గానే హరీ మంటుంది. ఈ బిల్‌లో ఫార్ రీచింగ్ కాంప్లికేషన్స్ చాలా వున్నాయి. మంత్రిగారు దీనిని చాలా లోతుగా అధ్యయనం చేసే అంటున్నారో లేదో తెలియదు.

చైర్మన్ : మీరు బిల్ మూవ్ చేసిన తరువాత మాట్లాడండి.

శ్రీ ఎం.ఎ.గఫూర్ : మీరు ఎట్లా చెబితే అట్లా చేస్తాము. ఎప్పుడైనా మాట్లాడక తప్పదు.

## ప్రభుత్వ బిల్లు

## 2004,ఆంధ్ర ప్రదేశ్ ( పబ్లిక్ సర్వీసులకు నియామకముల క్రమబద్ధీకరణ మరియు సిబ్బంది తీరును, వేతన స్వరూపమును హేతుబద్ధము చేయు ) (సవరణ ) బిల్లు

## (ఎల్.ఎ.బిల్లు నెం.4, 2004) (ఆమోదించబడినది)

SRI K. ROSAIAH: Mr. Chairman, Sir, I beg to move:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Bill, 2004 (L.A.Bill No.4 of 2004) be taken into consideration"

CHAIRMAN: Motion is moved. Now the discussion on the Bill.

శ్రీ ఎం.ఎ.గఫూర్ : సర్, మాజీ స్పీకర్ గారు ఇప్పుడు చెబుతున్నారు, స్టాట్యుటరీ రిజల్యూషన్ విషయం తేలిపోయిన తరువాత బిల్ మూవ్ చేస్తారని చెబుతున్నారు.

శ్రీ కె.రోశయ్య : మీరు చెప్పింది కరెక్ట్. రాజయ్య గారు మూవ్ చేసిన తరువాత నేను ఇది మూవ్ చేసాను.

శ్రీ వై.రామకృష్ణుడు : అధ్యక్షా, రిజల్యూషన్ మూవ్ చేసిన తరువాత ఎస్ ఆర్ నో అని హౌజ్ చెప్పిన తరువాత, అప్పుడు బిల్ మూవ్ చేసి ఎస్ ఆర్ నో చెబుతారు. రెండూ క్లబ్ చేసి చెప్పడం కరెక్ట్ కాదు. క్లబ్ చేసినా నాకు అభ్యంతరం లేదు.

శ్రీ కె.రోశయ్య : మంచి సలహా ఇచ్చారు, మీ సలహా ప్రకారమే నడుద్దాము.

శ్రీ ఎం.ఎ.గఫూర్ : అధ్యక్షా, ఈ బిల్ విషయంలో ఇద్దరిదీ ఒకటే పద్ధతి. వాళ్ల చెప్పుల్లో వీరు కాళ్లు పెడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంతో గత అనేక సంవత్సరాలుగా మేము గొడవ పడ్డాము. గత ప్రభుత్వం అవలంభించిన విధానాలు కార్మిక వ్యతిరేకమైనవి, ఉద్యోగులకు వ్యతిరేకమైనవి, అనేకమైన దుర్మార్గమైన చట్టాలను ఈ శాసన సభలో వారికున్న మెజారిటీని ఉపయోగించుకుని చేసారు. దాని పరిణామ ఫలితంగా అనేకమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారు.

చాలా మంది ఈ రోజు నిరుద్యోగులై బజారులో తిరుగుతున్నారు. ఎక్కడ చూసినా దయనీయమైన పరిస్థితులు వున్నాయి. అప్పుడు ఆ రకమైన పరిస్థితులలో ఆ ప్రభుత్వం యొక్క విధానాలకు వ్యతిరేకంగా వారందరూ కూడా పట్టు పట్టి, ఎటువంటి పరిస్థితులలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం రాకూడదనే కృత నిశ్చయంతో ఈ రాష్ట్రంలో పని చేసి, కార్మికులు, ఉద్యోగులు తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఓడించారు. ఆ కారణంగానే వారు ఇటు వైపు వచ్చారు. ఉద్యోగుల, కార్మికుల సహాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ కూర్చుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ఏ రకమైన కార్మిక వ్యతిరేకమైన విధానాలతో తెలుగుదేశం ప్రభుత్వం పోయిందో, వారి చెప్పులలో కాళ్లు పెట్టి, అదే రకమైన విధానాలతో మేము నడుస్తామంటే, అది ఎంతవరకూ న్యాయం ? మేము అపీల్ చేసేదేమిటంటే, ఇక్కడ బిల్ పెట్టారు. ఇంతకు ముందు ఆర్డినెన్స్ జారీ చేసింది తెలుగుదేశం ప్రభుత్వం, ఈ ఆర్డినెన్స్‌ను తప్పకుండా చట్టం చేయవలసిందే, కాబట్టే మేము పెడుతున్నామని అంటున్నారు. అయ్యా, తప్పనిసరిగా దానిని చట్టం చేయవలసిన అవసరం లేదు.

ఆ రోజులలో కోపరేటివ్ సొసైటీలలో పనిచేసే వారు హైకోర్ట్‌కు వెళ్లగా, హైకోర్ట్ కూడా స్పష్టమైన తీర్పునిచ్చింది. వీరిని తొలగించడం అన్యాయం, 3000 మంది ఉద్యోగులను తొలగించరాదు, వారిని ఉద్యోగాలలో పెట్టుకోవాలని హైకోర్ట్ స్పష్టంగా చెప్పింది. హైకోర్ట్ ఇచ్చిన తీర్పును మీరు అమలు చేస్తే, ఈ బిల్ అవసరం లేదు, ఆర్డినెన్సూ అవసరం లేదు. ఆ ఆర్డినెన్స్‌ను చెత్త బుట్టలో పడెయ్యవచ్చు. ఆ రోజున అధికారంలో లేనపుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తరువాత మరొక మాట చెబుతున్నారు.

ఈ రోజు సమస్య ఏమిటంటే, ఆల్‌రెడీ తొలగించబడిన 3000 మంది బయట ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చింది, కొత్త ఉద్దేశ్యాలతో వచ్చింది, తప్పకుండా తమకు న్యాయం చేస్తారని, తమకు తప్పకుండా ఉద్యోగాలు ఇస్తారని వారు ఎదురు చూస్తున్నారు. వారికి తోడుగా ఇప్పుడు మరొక కొత్త ప్రమాదం వచ్చింది. ఈ ఆర్డినెన్స్ వచ్చిన తరువాత కోపరేటివ్ సెక్టార్‌లో జరుగుతున్న ప్రక్రియ ఏమిటంటే, 1995 నుంచి తొలగించబడిన వారు 3000 మంది బయట వున్నారు. 1993 నవంబర్ నుంచి ఇది అమలులోకి వచ్చింది కాబట్టి, ఆ రోజు నుంచీ వుండే వారిని అందరినీ లెక్కలోకి తీసుకుని, వారికి నోటీసులు ఇస్తున్నారు.

ఆర్డినెన్స్‌ను అవకాశంగా తీసుకుని మరో 3000 మందిని బయటకు పంపాలనే ప్రక్రియ సహకార రంగంలో స్టార్ట్ అయింది. ఇప్పుడు కొత్తగా రిఫార్మ్స్ తీసుకొస్తున్నారు. అక్కడ క్రింది స్థాయిలో వినబడే మాట, మండలానికి ఒక పి.ఎ.సి.ఎస్. పెట్టిన తరువాత, ఇప్పుడు వుండే దానిని మెర్జ్ చేసి, మండలానికి ఒకటి పెట్టి, అదనంగా వుండే వారిని తొలగించడానికి ఈ బిల్ ఉపయోగపడుతుంది. ఈ రిఫార్మ్స్ అన్నీ కార్మికులకు, ఉద్యోగులకూ వ్యతిరేకమైనవి.

నేను ఒక్క మాట చెప్పదలచుకున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు ఇందిరమ్మ రాజ్యం వచ్చింది అనే మాట చెబుతున్నారు. ఈ ఉద్యోగాలు 'హాఫ్ మిలియన్' ఉద్యోగాల పేరిట క్రియేట్ చేసిన ఉద్యోగాలు. పి.ఎ.సి.ఎస్.లో పెయిడ్ సెక్రటరీ పోస్టులను ఇందిరాగాంధీ గారి యొక్క ఆశల మేరకు, ఆ రోజున 'హాఫ్ మిలియన్' జాబ్స్ అని సృష్టించింది. అప్పుడు ఆ రకంగా ఉద్యోగాలు వచ్చాయి. వారిలో చాలా మందిని మీరు తొలగిస్తున్నారు. కొత్తగా మీరు చేయబోయే రిఫార్మ్స్ వల్ల అనేక మందిని తొలగించే ప్రమాదం కనపడుతోంది. ఇది మీరు ఆలోచించే చేస్తున్నారా అని అనిపిస్తోంది. ఉద్యోగులను తొలగించడం అనే విషయం మీద ఒక స్పష్టత వుండాలి. తెలుగుదేశం ప్రభుత్వానికి వారి ఉసురు తగిలింది, వారి శాపం తగిలింది, వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు కనుకే వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేసారు. ఇప్పుడు మీరు వచ్చిన తరువాతనైనా వారికి గ్యారంటీ వుందా అంటే అదీ లేకుండా చేస్తున్నారు. ఈ రోజు రైతుల ఆత్మహత్యల గురించి మనం అనుకుంటున్నాము, రుణభారం పెరిగిపోయిందని అనుకుంటున్నాము.

గౌరవ ముఖ్యమంత్రిగారు చాలా సందర్భాలలో చెప్పారు, ఇన్‌స్టిట్యూషనల్ ఫైనాన్స్ అందుబాటులో లేనందువల్ల ప్రైవేటు వడ్డీ వ్యాపారస్థుల బారిన పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాస్తవం.
మ.12.30

ముఖ్యమంత్రిగారు చాలా వాస్తవమయిన మాటలు చెబుతున్నారు. ఆ రకమయిన పరిస్థితి ఉంటే, రైతులను ఆదోకోవాలంటే, రైతులకు మరితంగా ఇన్‌స్టిట్యూషనల్ ఫైనాన్స్ అందుబాటులో రావాలని అడుగుతున్నాను. వేరే మార్గం ఏమిటంటే, పిఏసిఎస్‌లను స్ట్రెంగ్తెన్ చేయడంద్వారా కోఆపరేటివ్ రంగాన్ని స్ట్రెంగైన్ చేయడం ద్వారా ఇతరత్రా మార్గాల ద్వారా రైతులకు సహాయం చేయగలుగుతారా? నాబార్డ్ రీఫైనాన్స్ ద్వారా డిసిసిఏల ద్వారా పిఏసిలకు పోతుంది. ఆ రకంగా మనం నాబార్డ్, ఆప్కాబ్, డిసిసిబి క్రింద ఉన్న పిఏసిల ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలన్న సదుద్ధేశ్యంతో ఆలోచిస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం ఈ రోజు బడ్జట్‌లో చెప్పింది. రైతాంగాన్ని ఆదుకోవడం కోసం కోఆపరేటివ్ సెక్టార్‌లో అందుబాటులో తీసుకురావడం కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాము, మేము స్టడీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ఆలోచిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే లైన్స్‌లో చాలా సార్లు చర్చలు చేయడం జరిగిందన్నారు. ఆలోచనలతో మంచి డైరెక్షన్‌తో ఎప్పుడయితే ముందుకు పోతారో అప్పుడే మంచి జరుగుతుంది. క్రింది స్థాయి రైతాంగానికి తోడ్పడాలంటే కోఆపరేటివ్ సొసైటీలను, పిఏసిలను స్ట్రెంగ్తెన్ చేయాలి. ఆ రకంగా వారికి అవసరమయితే క్రింది స్థాయిలో ఇంకా కొంత అదనపు బాధ్యతలు అప్పజెప్పి క్రిమిసంహారక మందులు, మంచి విత్తనాలు అందుబాటులోకి తేవాలి. పిఏసిల ద్వారా డిస్ట్రిబ్యూట్ చేయాలి. ఏవయితే గ్రామీణ రంగాల్లో సొసైటీలు ఉన్నాయో, వాటిని కాపాడి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెంచి దాని పని విధానాన్ని మరింత సంస్కరిస్తే, రైతాంగానికి ఉపయోగం అవుతుంది. అప్పుడు ఈ బిల్లు అవసరం ఉండదు. రైతాంగానికి తోడ్పడాలని చెబుతూ, రెండవ వైపు క్రింది స్థాయిలో ఉన్న రైతులకు అందుబాటులో ఉన్న పిఏసిల రీస్ట్రక్చర్‌కి భిన్నంగా ఏదో తెస్తామని చెప్పడం న్యాయబద్ధం కాదు. నాకు తెలిసినంత మేరకూ మెంబర్స్ అటూ, ఇటూ ఉండవచ్చు, 1 కోటి 30 లక్షల మంది పిఏసిఎస్‌లలో రైతులు సభ్యులుగా ఉన్నారు. 1 కోటి 30 లక్షల మందిలో ప్రభుత్వ లెక్కల ప్రకారంగా షుమారు 30 లక్షల మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ విధానానికి మనం ఫైనాన్స్ అందిస్తున్నాము. చిన్నకారు, సన్నకారు రైతులకు అప్పు అందుబాటులో లేదు. వారంతా కూడా వడ్డీ వ్యాపారస్థుల బారిన పడుతున్నారు. ఒక కోటి మందికి ఎలా అప్పు అందించాలి. ఆర్థికంగా ఎలా ప్రభుత్వం నుండి సహాయం చేయాలనేది ఆలోచిస్తే, ఈ బిల్లు అవసరం లేదు. దయచేసి పునఃసమీక్షించమంటున్నాను. ఈ బిల్లు పరిణామాలు చాలా దారుణంగా ఉంటున్నాయి. సహకార రంగాన్ని పూర్తిగా నాశనం చేసే పద్ధతిలో అధికారుల ఆలోచనలు, ప్రయత్నాలు సాగుతున్నాయి. 15,000 మంది బయటకుపోయే ప్రమాదం ఈ బిల్లు ద్వారా ఉంది. ఇది చాలా అన్యాయం. రైతులకు నష్టం కలుగుతుంది. ఇన్‌స్ట్యూషనల్ ఫైనాన్స్ వారికి అందుబాటులో రాదు. రైండవవైపు ఉద్యోగులు ఆల్‌రెడి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బజారున పడిన తరువాత హైకోర్ట్ ఉత్తర్వు కొరకు ఎదురు చూస్తున్నారు. వారికి ఉద్యోగాలు రావు. 1993 నవంబరు నుండి మళ్లీ తీసివేయాలని అంటున్నారు. రీస్ట్రక్చర్‌లో భాగంగా మరొక 2,000, 3.000 మందిని తీసివేసే ఆలోచన చేస్తున్నారని తెలిసింది. ఇది అన్యాయం. ఇక బిల్లు రూపొందించిన భాష చదివితే, ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేదా అనేది వస్తుంది. ఏ కోర్ట్‌కానీ, ట్రిబ్యునల్‌కానీ ఎవరు ఎలాంటి తీర్పు చెప్పినా ఇది చెల్లదుఅనే పద్ధతిలో ఉంది. న్యాయవ్యవస్థ పవిత్రమైన రాజ్యాంగధర్మాన్ని నిర్వర్తిస్తోంది. న్యాయవ్యవస్థ అన్ని విషయాలను కూలంకషంగా ఆలోచించిచేస్తుంది. చట్టరీత్యా చెల్లదుఅనడం ధర్మం కాదు. 1993 నుండి ఎవరి మీద చెప్పినా చెల్లదు. మేము చెప్పిందే కరెక్ట్‌అనే పద్ధతిలో ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ కాదు. అది కూడా రెట్రాస్‌పెక్టివ్ ఎఫెక్ట్. 1993 నవంబరుఅని తీసుకురావడం ఎలా సమంజసం అవుతుంది. ఎలా ప్రభుత్వం సమర్థించుకోవాలి. తెలుగుదేశం ప్రభుత్వం ఆర్డినెన్స్‌జారీ చేసింది. అప్పుడు మేము వ్యవహరించాము అంటే ఇది దుర్మార్గమయిన ఆర్డినెన్స్, అప్రాజాస్వామిక చట్టవిరుద్ధమయిన, రాజ్యాంగ విరుద్ధమైన చర్య. ఈనాడు ఆ ఆర్డినెన్స్‌ని చట్టరూపంగా బదలాయిస్తాము, వారి యొక్కఅధికారాన్ని హస్తగతం చేసుకొని అదే విధానం కొనసాగిస్తామని చెప్పడం రైతాంగానికి, కార్మిక విధానానికి గొడ్డలిపెట్టు. దయచేసి ఈ బిల్లుని ఉపసంహరించుకోవాలని కోరుతున్నాను. బిల్లులో ఉండే అంశాలు చాలా అప్రజాస్వామిక అంశాలు. అటువంటి చర్యలకు ఈ ప్రభుత్వం తలపడవద్దని, ఆశతో ఎదురుచూస్తున్న ఉద్యోగులకు మంచి సందెశం పోవాలి. చెడు సందేశం పోరాదు. కొత్తగా ప్రభుత్వం వచ్చింది. రెండు నెలలయింది. చాలా చాలా యాస్పిరెషన్సే ఉన్నాయి. అటువంటప్పుడు మంచి సందేశం ప్రభుత్వం నుండి రావాలి. అలా కాకుండా, తెలుగుదేశం ప్రభుత్వ విధానాన్ని ఆ దుర్మార్గమయిన, అప్రజస్వామికమైన విధానాన్ని, ఆ ఉద్యోగ వ్యతిరేక విధానాలను కంటిన్యూ

చేస్తామని చెప్పే సందేశం మంచిది కాదు. ప్రభుత్వానికి ఇది మంచిది కాదు. దయచేసి పునరాలోచించుకోవాలని ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య: Article 16 of our Constitution is very clear. Equality of opportunity in matters of public importance. క్లియర్‌గా ఎంప్లాయిమెంట్ ఇవ్వవలసిన బాధ్యత ప్రభుతం మీద పూర్తిగా లేకపోయినా ఉన్న ఉద్యోగులను తొలగించరాదనేది నైతిక ధర్మము. ఈ సంధర్భంగా నేను చెప్పేదేమంటే, ఈ బిల్లుకి సంబంధించి మా శాసనసభ్యులు గఫూర్‌గారు వివరంగా చెప్పారు. ఒక్క విషయం మాత్రం చెప్పదలచుకున్నాను. ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగం ఈ రెండు ఒక దానికి ఒకటి ఉన్నప్పుడు ఇవి రెండూ చేయలేని పనులు సహకార రంగం చేస్తుంది రాజ్యాంగ స్ఫూర్తితో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దానిని అనుభవించాలనే ఆలోచనతో ఈ సహకార రంగాన్ని ఏర్పాటు చేసిన అంశాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. షుమారుగా 15,000 మంది ఉంటే, 10,000 మంది వెళ్లిన తరువాత సహకార రంగం బ్రతుకుతుందా? గాంధీ మహాత్ముడు కలలుకన్న రాజ్యం వీలుపడుతుందా? ఈ విషయాన్ని ముందుగా ప్రభుత్వం ఆలోచించి ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన అంశాలకూ, ఇప్పుడు చేసే దానికి ఎంత తేడా ఉందో ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఒకవైపు నుండి టిడిపి వర్గం బూట్ పెట్టింది. దానిలో అన్నీ తేళ్లూ, పాములు ఉన్నాయని తెలుసు. వీరేమో( ఈ ప్రభుత్వం ) అందులో కాళ్లు పెడుతున్నారు. పాములూ, తేళ్లూ లేకనా, అటు నుండి ఇటు వచ్చారు. దానిలో కాలు పెట్టిన తరువాత ఆ తేళ్లూ, పాములూ ఏమీ అనవా? అది అర్థం చేసుకోమని తమరి ద్వారా కోరుతున్నాను. ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలవగానే ఎక్కువ మంది కోఆపరేటివ్ సెక్టార్‌కి సంబంధించిన ఉద్యోగులు అంతా పండుగ వాతావరణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కాంగ్రెస్‌వారు గెలిచారు, రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రి అవుతున్నారని పోదాం, పోదాం అని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈనాడు దివాలా తీసే సొసైటీ ని రివైవ్ చేయడానికి మార్గం ఉంది. అన్వేషిస్తే పరిష్కారం ఉంది. అలా కాకుండా, వారిని తీసివేయడం సబబు కాదు. గత ప్రభుత్వం చేసిన అనాలోచిత పనుల వల్ల సొసైటీలు దివాలా తీయడం జరిగింది. సొసైటీకి సంబంధం లేని వాడు అప్పు తీసుకొన్న తరువాత రికవరి చేద్దామంటే అతని ఇల్లు దొరకదు. ఆస్థి దొరకదు. రికవరి చేద్దామంటే ఏమీ దొరకదు. బంజారాహిల్స్‌లో ఉంటారు. అలాంటప్పుడు సొసైటీ మునగక ఏమవుతుంది? మొత్తం అంతా జరిగింది, తప్పు ఎక్కడుందంటే, వారు ఎక్కడ అప్పు తీసుకున్నారో అంటే అప్పు తీసుకున్న చోటనే ప్రాధమిక లోపం ఉంది. ఈ తప్పును సరిచేసుకోవాలి. గతం లో మావాళ్లు చెప్పారు. తలలో పేలు వస్తే, వాటిని తీసివేసుకోవాలి అంతే తప్ప నెత్తిని గొరిగేసుకోవడం సాధ్యపడదు.
మ.12.40

నెత్తి గొరిగి తీసుకోవాలనే ఆలోచన చేసి అధికారం నుండి వారు తొలగించబడ్డారు. ఇది భారత రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తి. సహకార రంగం వర్ధిల్లితేనే, సమ సమాజంవైపుగా ప్రజల పార్టిసిపేషన్ వస్తుంది. సహకార రంగం, ప్రజల భాగస్వామ్యంతో వస్తుంది. ప్రజల భాగస్వామ్యం తీసేసి, ప్రయివేటు వారికి అప్పగిస్తే, అన్యాయంగా ఉంటుంది. శ్రేయోరాజ్య స్థాపన జరగదు. ప్రజలు వ్యతిరేకంగా తయారౌతారు. దీని వల్ల పదివేల కుటుంబాలకు నష్టం వస్తుంది. ఈ విషయాలు ఆలోచించండి. తెలుగుదేశం పార్టీ వారు బిల్లు చేశారు, ఆ బిల్‌నే మెమూ చేస్తామంటే ఎట్లా? రోశయ్య గారు అంటే నాకు విద్యార్థిదశ నుండి మంచి అభిమానం ఉంది. ఈ బిల్ విషయమై పునరాలోచన చేయండి. లేకపోతే ఈ బిల్‌ని సెలెక్ట్ కమిటికి పంపించండి. అనేక విషయాలు పరిశీలన చేద్దాము. నిన్న విధాన మండలి పునరుద్ధరణ రిజొల్యూషన్‌ని పాస్ చేశాము. అది వస్తుంది. దాంట్లో పెద్దలు ఉంటారు. వారు కూడా చర్చించి నిర్ణయిస్తే బాగుంటుంది. విత్‌డ్రా చేసుకోడానికి ఇబ్బంది ఉంటే, ఈ విధంగానైనా చేయండి. ఈ బిల్ పబ్లిక్ సెక్టర్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పీకనులిమేసే విధంగా ఉంది. ఇది సరైన పద్ధతి కాదు. సహృదయంతో ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ సిహెచ్. వెంకటరెడ్డి :- అధ్యక్షా, ఈ బిల్లుని లోతుగా అధ్యయనం చేస్తే, పూర్తిగా కార్మికుల, ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను హరించే విధంగా ఉంది. గత ప్రభుత్వం దీన్ని ఎందుకు తెచ్చిందో తెలియదు. వారికి ఉన్న ఆలోచనా విధానంతో తెచ్చారు. ఎంతో మంది ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారు. దీనిని ప్రభుత్వం పునః పరిశీలించడం మంచిది. సహకార రంగం కూడా ధ్వంసమై పోయింది. సహకార రంగంలో ఎన్నికలు లేవు. ఉద్యోగులు ఎక్కడి వారు అక్కడే, ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉన్నారు. ఇది సహకార రంగంలో ఉండే ఉద్యోగులకు, ప్రభుత్వ రంగంలో ఉండే ఉద్యోగులకు, కార్మికులందరికి సంబంధించింది. తొందరపడి ఆర్డినెన్స్ తీసుకువచ్చారు. కాబట్టే బిల్ తీసుకువచ్చి తొందరగా పాస్ చేయించుకోవాలనే ఆలోచన చేయరాదని చెపుతున్నాను. ఈ ప్రభుత్వం ఏర్పడి 50 రోజులైనది. ఈ ప్రభుత్వంపై ప్రజలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, లెక్చరర్లు, ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. గత ప్రభుత్వం అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వ హయాం లో న్యాయం జరుగుతుందని, బాగు పడతామని అనుకొంటున్నారు. ఈ బిల్లుని ఉపసంహరించుకోవాలని కోరుతున్నాను. లేకపోతే, కనీసం సెలక్ట్ కమిటీకైనా పంపేందుకు ప్రయత్నం చేయాలి. ఆంధ్ర ప్రదేశలో కార్మికుల,ఉద్యోగుల హక్కులను కాపాడడానికి, వారి హక్కులకు భంగం వాటిల్ల కుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ జె. రంగారెడ్డి :-అధ్యక్షా, ఈ బిల్లు పబ్లిక్ సర్వీసుల్లో పనిచేసే వారికి తీరని అన్యాయం చేసిన వారౌతారు. గత ప్రభుత్వం చాలా నిరంకుశంగా, కార్మిక, ఉద్యోగులను కుదించాలనే ఉద్ధేశ్యంతో దీనిని తయారు చేయడం జరిగింది. దీనిని యధాతధంగా పెట్టి ఈ బిల్ పాస్ చేయించుకోవాలనే ఆలోచన చేయడం సరైంది కాదు. వేలాది మంది ఉద్యోగులకు అన్యాయం జరుగుతుంది. వీరు బజారున పడాల్సి వస్తుంది. దీని వల్ల ప్రభుత్వానికి అనేక రకాలైన సమస్యలు ఎదురౌతాయి. వారిపొట్ట కొట్టడానికి ఈ బిల్లు ఉంది. ఇది సరైనది కాదు. ఒక రకంగా ఇది వారికి ఉరి లాంటిదే.. దీంట్లో కోర్టుకి వెళ్లడానికి, అక్కడ చెప్పుకోడానికి కూడా వీలు లేదు. చాలా ప్రమాదకరమైన అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంతకు ముందు మాట్లాడిన, గఫూర్‌గారు, నర్శింహయ్య గారు చెప్పినట్లు మరో పర్యాయం ఆలోచించి, సెలక్ట్ కమిటికి పంపించండి. అక్కడ చర్చించి, మార్పులు చేసి ఆమోదించాల్సిందిగా కోరుతున్నాను. తొందరపడి ఈ బిల్లుని పాస్ చేయవద్దని కోరుతున్నాను. ఈ బిల్లుని వాపస్ తీసుకోడానికి గాను ఆలోచించాలని కోరుతున్నాను.

శ్రీ కె. రోశయ్య :- అధ్యక్షా, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ నుండి రామకృష్ణుడు గానీ, మరో నాయకుడు కానీ మాట్లాడతారు అనుకొన్నాను. వారు మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నట్లు లేరు. ఇది లేటెస్టుగా తెలుగుదేశం పార్టీ పెట్టిన చట్టం అనేది కాదు. 1994వ సంవత్సరంలో చట్టాన్ని చేయడం జరిగింది. అప్పుడు నేను ఆర్థికశాఖ మంత్రి గా ఉన్నాను. చట్టాన్ని ప్రవేశ పెట్టింది నేనే. శాసనసభ ఆమోదం నేనే తీసుకొన్నాను. ఆనాటి ఉద్దేశ్యం, నియామకాలు ఒక పద్ధతిలో జరగాలని, అధికారులు వారి ఇష్టానుసారంగా నియామకాలు చేసుకొంటున్నారన్న సంగతులు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. అపసవ్యంగా నియామకాలు జరుగుతున్నాయని, వాటిని క్రమబద్దీకరించాలని 1994లో చట్టం చేయడం జరిగింది. తరువాత 1998వసంవత్సరంలో, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీనికి కొన్ని అమెండ్‌మెంట్స్ చేశారు. అలా అది సాగుతూ వచ్చింది. ఉద్యోగులను క్రమబద్దీకరణ చేయడం, అపసవ్యంగా చేయడం జరుగుతూ వచ్చింది. 2003లో హై కోర్టులో వచ్చిన తీర్పు దృష్ట్యా ఆర్డినెన్స్ జారీ చేయాల్సి వచ్చింది. ఎందుకంటే, కో-ఆపరేటీవ్ సెక్టర్‌లోని వారు అప్పటికే పైదొలగిన వారు, పైదొలగించబడిన వారుపోగా, సుమారుగా 428 మంది మాత్రమే హై కోర్టు లో ఒక రిట్ పిటీషన్‌ని వేసి, రిట్ డైరెక్షన్ ఆధారంగా కొనసాగుతూ వచ్చారు. అనేక మంది క్రమబద్దీకరణలో, క్రమంగా నియమ నిబంధనలకు అనుగుణంగా అప్పాయింట్ కానీ వారి గురించి ఇంతకు ముందే చెప్పడం జరిగింది. మిగిలిన వారు 428 మంది విషయంలో కఠినంగా ఉండాలని కాదు ప్రభుత్వ ఉద్దేశ్యం. సవ్యంగా అప్పాయింట్ అయిన వారిని తొలగించడం లేదు. అపసవ్యంగా నిబంధనలను ప్రక్కన పెట్టి ఏవిధంగానైతే ఉద్యోగాల్లో అప్పాయింట్ అయ్యారో వారిని తొలగించే నిమిత్తం ఆర్డినెన్సను జారీ చేయడం జరిగింది. బిల్ రూపంలో పెట్టాము. ఈ ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉంది. నిరుద్యోగసమస్యను తీర్చాలని ఉద్యోగావకాశాలను కల్పించాలని, దీనికి కొంత వరకైనా

పరిష్కారం చేస్తామని ఎన్నికల ముందే చెప్పాము. ఉద్యోగాలు అంటే, ప్రభుత్వ ఉద్యోగాలనే భావన బహుశా ఎవరూ అనుకోరు. ఉపాధిఅవకాశాల కల్పన కోసం ప్రయత్నం చేస్తున్నాము. అనేక రకాలైన కార్యక్రమాల క్రింద చదువుకొన్న యువకులు వారి కాళ్లపై వారు నిలబడి, జీవనోపాధి సంపాదించుకోడానికి కార్యక్రమాలు ఒకవైపు చేస్తున్నాము. ఇం తకు ముందు చెప్పాను. కొన్ని సొసైటీల్లో అధ్యక్షులుగా ఉన్న వారు వారి బంధువులనో, వారి స్నేహితులనో, ఖజానాకు, ఎంత నష్టం వచ్చినా, ఫర్వాలేదన్నట్లు అప్పాయింట్‌మెంట్స్ చేసిఉనటువంటి వారికి వర్తిస్తుంది.

మ. 12.50

అలాంటి వారికి వర్తిస్తుంది తప్ప మరొకటి కాదు. మరొక మాట మనవి చేస్తున్నాను. గఫూర్ గారు గానీ, నోముల నర్సింహయ్య గారు గానీ మిగిలిన మిత్రులు చెప్పిన విధంగా కోపరేటివ్ సెక్టార్ ఫంక్షనింగ్‌కు ఏ మాత్రం కూడా ఈ నియామకాల తొలగింపు అడ్డం రాదు. కోపరేటివ్ రంగాన్ని క్షాళన చేసుకోవలసిన అవసరం ఉంది దానికి సక్రమంగా ఎన్నికలు జరుపుకోవలసిన అవసరం ఉంది. లెండింగ్‌లో కూడా పద్ధతులు మార్చుకోవలసిన అవసరం ఉంది . అయితే ఇది ఈ 428 మందితో అయ్యే పని కాదు. అదే అసలు దానికి ఉన్నటువంటి రోగమని ఈ రోజు మనవి చేస్తున్నాను.

1995 వ సంవత్సరం జులై 26 వ తేదీన ఎన్నికలు జరిగాయి. 3 సంవత్సరాల కాలవ్యవధిలో జరిగాయి . అంటే 1998లో ఎన్నికలు జరగాలి . కాని నాటి ప్రభుత్వం సంస్కరణలు తీసుకు వస్తామని, బోగస్ మెంబర్స్‌ను ఏరి వేస్తామని అన్నారు. అందువల్ల మాకు మరి కొంత కాల వ్యవధి కావాలని 3 ఏళ్ల పదవీ కాలాన్ని 5 ఏళ్లకు పెంచుతూ చట్టాన్ని సవరించి 5 ఏళ్లు చేశారు. అంటే రెండు వేల సంవత్సరంలో ఎన్నికలు జరగాలి. దరిమిలా ప్రతి ఆరు మాసాలకు 'వర్డింగ్' ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా సంస్కరణలు తీసుకు వస్తున్నాము. బోగస్ మెంబర్స్‌ను ఏరి వేస్తున్నాము. వయబిలిటీ చేస్తున్నాము – అన్న పేరుతో ఇప్పటివరకు కూడా ఎన్నికలు జరగకుండా వచ్చాయి. అంతేకాకుండా లెండింగ్‌లో కూడా టార్గెట్స్‌ను మీట్ చేయడంలో పేద రైతులకు అప్పు ఇచ్చి ఉంటే లెండింగ్ టార్గెట్ మీట్ కావడానికి అతని అప్పు చెల్లించినట్లూ, మరలా కొత్త అప్పు ఇచ్చినట్లు చాలా సందర్భాలలో డీల్ చేస్తున్నారు. ఈ విషయం మీ అందరికీ కూడా తెలుసు. ఈ పద్ధతిలో మార్పు రావాలి . ఈ మార్పు కోసం తప్పకుండా ప్రయత్నం చేద్దాము. ప్రభుత్వం దీనిని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నది.

సహకార రంగం మన పొరుగున ఉన్న మహారాష్ట్రలో మూడు పూవులు ఆరు కాయలుగా విలసిల్లుతూ ఉంటే, దురదృష్టవశాత్తూ మన రాష్ట్రంలో దానికి విరుద్ధంగా ఉంది. దీనిని ఓవర్‌హాలింగ్ చేసుకోవలసిన పని ఉంది. అందువల్ల అది వేరే విషయం . దీనికి సంబంధించి నంతవరకు ఉద్యోగులకు ఎవరికీ వ్యతిరేకత కాని, ఉద్యోగులపై వేటు వేయడం గానీ కాదు. నిబంధనలకు సంబంధం లేకుండా ఎపాయింట్ అయిన వారు కొంత మంది – ఆ 428 మందికి మాత్రమే వర్తిస్తుంది. కనుక దీనిని ఆమోదించవలసిందిగా సభను కోరుతున్నాను.

శ్రీ ఎమ్. ఏ. గఫూర్ : అధ్యక్షా, పెద్దలు రోశయ్య గారు తమ అపార అనుభవంతో ఏ విషయాన్ని ఎలా కన్విన్సింగ్‌గా చెప్పాలనే నైపుణ్యం గల వారు. ఆ నైపుణ్యం మాకు లేక పోవచ్చు. అయినా వాస్తవం ఏమంటే , సహకార శాఖా మంత్రి గా కన్నా లక్ష్మీ నారాయణ గారు ఉన్నారు. వారికి సహకార రంగంలో ఏమి జరుగుతున్నదో బాగా తెలుసు. అధ్యక్షా, వారు 428 మంది కోర్టుకు వెళ్లిన వారున్నారని చెప్పారు. కానీ మాకు తెలిసిన సమాచారం ప్రకారం టిడిపి హయాంలో కోపరేటివ్ సెక్టార్‌లో పిఎసిఎస్ లలో కానీ తదితర ప్రైమరీ సొసైటీలలో పని చేసిన వా రు, తొలగింపబడ్డ వారు సుమారు 3 వేల మంది ఉన్నారు. అందరూ కోర్టుకు పోలేరు కాబట్టి ఆ మూడు వేల మందిలో బహుశా హైకోర్టుకు పోయిన వారు 428 మంది ఉండవచ్చు. ఇది 3 వేల మంది ఉద్యోగులకు సంబంధించినటువంటి విషయం .

మంత్రి గారు అపసవ్యంగా జరిగిన ఎంప్లాయ్‌మెంట్‌కు సంబంధించి అన్నారు. కానీ వారన్నది కరెక్టు కాదు. బహుశా రోశయ్య గారికి గుర్తుంటుంది, జి.ఓ. 212 ప్రకారం 1994 వ సంవత్సరంలో 5 సంవత్సరాలు ఎవరైనా పని చేస్తే అటువంటి వారిని రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది. ఆ పద్ధతిని కర్బ్ చేయాలన్న ఉద్దేశ్యంతో జి.ఓ ను తీసుకు వచ్చారు. అంటే యాక్టు 94 కంటే ముందు ఒక పద్ధతి ఉంది. దాని ప్రకారం తేదీ 25-11-1993 న రెగ్యులరైజ్ చేయబడిన వారు తప్ప మిగిలిన వారిని రెగ్యులరైజ్ చేయకూడదని ఉంది. దానిని మీరు చట్టం చేశారు. అప్పటికే 4 సంవత్సరాలుగా అలా ఉన్న వాళ్లు కంటిన్యూ అయ్యారు. తర్వాత 5 సంవత్సరాలు మాకు పూర్తి అయింది మమ్మల్ని రెగ్యులరైజ్ చేయమని అడిగారు. కానీ రెగ్యులరైజ్ చేయలేదు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత , 'అసలు రెగ్యులరైజ్ చేసే ప్రశ్నే లేదు. వీళ్లందరినీ తొలగిస్తాం ' అని చెప్పారు. పది, పదిహేను సంవత్సరాలు పని చేసిన తర్వాత సవ్యంగా, అపసవ్యంగా అంటూ ఇక్కడ లెక్క తీసుకోవడం మొదలెడితే మనం ఎక్కడికి పోతాం ? ఒకటి రెండు నెలలో లేదా ఆరు మాసాలో, అదీ కాదంటే ఒక సంవత్సరం అంటే వారిని తొలగిస్తే అర్థం ఉంది. 15 సంవత్సరాల జీవిత కాలం ఉద్యోగం చేసిన తర్వాత , ' నీవు పుట్టినపుడు ఇలా పుట్టి ఉండవలసింది ' అంటే దానికి ఎవరు సమాధానం చెబుతారు? ప్రభుత్వం ఎందుకు ఆ విధంగా ఎలవ్ చేశారు? అటువంటి వారిని ఈ రోజు బయటకు తరిమేస్తే వాళ్ల జీవితాలు ఏమై పోవాలి. టిడిపి ఆ రోజు అలా చేసింది. ఇప్పుడు ఈ చట్టం ఆర్డినెన్సు ద్వారా తమరు సభలో ప్రవేశపెట్టారు. దీనిని చట్టబద్ధం చేయదలచుకున్న దాని యొక్క పర్యవసానం ఇప్పుడు సహకార రంగంలో ఎక్సర్‌సైజ్ జరుగుతున్నది. తొలగించబడిన వారే కాకుండా, ఇంకా కొత్తగా తొలగించేందుకు గాను లిస్టు తయారు చేయడం జరుగుతున్నది. నోటీసులు ఇవ్వడం జరుగుతున్నది. మరొక 4, 5 వేల మంది దాకా ఉద్యోగులు ఇళ్లకు వెళ్లిపోయే ప్రమాదం ఉంది. ఆ విషయాన్ని తమరు సభ దృష్టికి తీసుకు రావడం లేదు. ఈ 428 మందికి తప్ప 429 వ వారికి ఇది వర్తించదన్న అష్యూరెన్స్ మీరు ఇస్తారా? ఈ చట్టాన్ని ఉపయోగించుకుని మీరు చెబుతున్న కోపరేటివ్ రిఫార్మ్స్‌లో కొని వేల మంది ఉద్యోగులు బలి కాబోతున్నారు. దయచేసి ఈ విషయమై ఆలోచించండి. ఇది అన్ డెమోక్రటిక్. ఇది మంచి సందేశం ఇవ్వదు.

మా అప్పీల్ ఏమంటే సభను ప్రక్క దోవ పట్టించకండి. సహకార రంగంలో ఈ రోజు జరుగుతున్న దానిని నేను సభ దృష్టికి తెస్తున్నాను. కొన్ని వేల మంది ఉద్యోగులు తొలగింపబడడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే 116 – సి అని పెట్టారు. వారికి 18 – 20 మాసాల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. మంచి రిఫార్మ్స్ అయినట్లయితే వాటిని ఎవరూ వ్యతిరేకించరు. కావాలంటే ఆ సంఘాలను పిలిచి మనం కూర్చుని మాట్లాడుకుందాము. ఏ విధంగా రీ స్ట్రక్చర్ చేయాలో మాట్లాడదాము. మీరు సలహాలు తీసుకుంటామంటే మాకు అభ్యంతరం లేదు. యాక్ట్ అంటే యట్ కాస్ట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అనే ధోరణి గతంలో వారిది. ఆ తత్వాన్ని మీరు తీసుకు రావద్దని, సభను తప్పు తోవ పట్టించకండి. దయచేసి బిల్ పర్యవసానం – రాబోయే కాలంలో చాలా మంది ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించే ప్రమాదంగా ఉంది. కాబట్టి మరొకసారి సమీక్షించమని మనవి జేస్తున్నాను.

శ్రీ కె. రోశయ్య : అధ్యక్షా, గౌరవ సభ్యులు గఫూర్ గారు ఒకసారి బిల్లులోని Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure. కానీ రీస్ట్రక్చరింగ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ కాదు. వారు చెప్పారు. ఇంతకు ముందు అంటే 1994 వ సంవత్సరంలో చట్టం చేయడం జరిగింది. 1994 సంవత్సరానికి ముందు మీరనేటటువంటి 212 జీఓ ఉన్నప్పటికీ కూడా వాటన్నింటి అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ చట్టం చేయడం జరిగింది. ఈ నియామకాలు సవ్యం కాదు. అయితే 1995 వ సంవత్సరం తర్వాత ఎపాయింట్ అయిన వారు చట్టం వున్నప్పటికీ చట్ట ప్రకారం కాకుండా చట్టానికి సంబంధం లేకుండా ఎపాయింట్ అయిన వారు అని మీరు చెప్పారు. మీ మాట వాస్తవం . 1995 నుంచి కాదు , రెండు ఇష్యూలున్నాయి. దటీజ్ డిఫరెంట్. 1995 సంవత్సరం నుంచి 2003 వరకు గల మధ్య కాలంలో హైకోర్టులో స్టే రావడానికి ముందు 2728 మందిని అన్ని డిపార్ట్‌మెంట్స్‌నుంచీ తొలగించడం జరిగింది . కానీ ఎక్కడయితే సవ్యంగా ఉన్నారో అక్కడ నుంచి ఇప్పుడు ఈ ప్రిసీడింగ్ ఆర్డినెన్స్ కేసు కోపరేటివ్ సెక్టార్ లో వున్నటువంటి వారు

స్టే మీద ఉన్న వారికి మాత్రమే  ఇప్పుడు నేను తీసుకు వచ్చిన బిల్ వర్తిస్తుంది తప్ప మరొకటి కాదు.  చట్టం ఉంది.  అది మామూలుగా ఉంది.  దానికి దీనికి సంబంధం లేదు.    ఇప్పుడు ఉన్నది ఉన్నట్లుగా దీని వల్ల ఎఫెక్ట్ అయ్యే వాళ్లు 428 మంది మాత్రమే.  ఇంతకు ముందు 2728  మందిని తొలగించడం జరిగింది.  దయచేసి దీనిని అర్థం చేసుకోవలసిందిగా కోరుతున్నాను. మామూలుగా మీరు చెప్పారు.   సహకారాన్ని  గురించి దాని మీద  ఆలోచన చేద్దాం . మీ అందరి సలహాలూ తీసుకుంటాము. క్షాళన ఏ విధంగా ఉండాలో , వాస్తవంగా రైతుల లెండింగ్ ఎలా జరగాలి?  ఎఫెక్టివ్‌గా, జెన్యుయిన్‌గా లెండింగ్ జరిగే విధంగా కావలసిన మార్పు చేద్దామని మరొకసారి కోరుతూ, దయచేసి బిల్లును ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

మ.1.00

CHAIRMAN: The question is:

"That this House disapproves the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Ordinance, 2003 (A.P. Ordinance No. 11 of 2003) promulgated by the Governor on 29th December, 2003."

(Pause)

The motion was negatived and the Statutory Resolution was lost.

AMENDMENT TO THE MAIN MOTION

SRI M.A. GAFOOR: Sir, I beg to move:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Bill, 2004 be referred to elicit public opinion."

CHAIRMAN: Motion moved.  The question is:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Bill, 2004 be referred to elicit public opinion."

(Pause)

The motion was negatived and the amendment was lost.

CHAIRMAN: The question is:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Patern and Pay Structure) (Amendment) Bill, 2004 be taken into consideration."

(Pause)

The motion was adopted and the Bill was considered.

CLAUSE 2

CHAIRMAN: The question is:

"That Clause 2 do stand part of the Bill."

(Pause)

The motion was adopted and Clause 2 was added to the Bill.

CLAUSE 3

SRI G. KISHAN REDDY: Sir, I beg to move:

> "That add the following at the end of sub clause (2) of Clause3 "Unless any organisation within the public service applied for prior permisssion from the Government to recruit an individual or set of individuals."

CHAIRMAN: Motion moved. The question is:

> "That add the following at the end of sub clause (2) of Clause3 "Unless any organisation within the public service applied for prior permisssion from the Government to recruit an individual or set of individuals"

(Pause)

The motion was negatived and the amendment was lost.

CHAIRMAN: The question is:

> "That Clause 3 do stand part of the Bill."

(Pause)

The motion was adopted and Clause 3 was added to the Bill.

CLAUSE 4, CLAUSE 1, ENACTING FORMULA AND LONG TITLE

CHAIRMAN: The question is:

"That Clause 4, Clause 1, Enacting Formula and Long Title do stand part of the Bill."

(Pause)

The motion was adopted and Clause 4, Clause 1, Enacting Formula and Long Title were added to the Bill.

SRI K. ROSAIAH: Sir, I beg to move:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Bill, 2004 be passed.

CHAIRMAN: Motion moved. The question is:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Bill,

2004 be passed.

(Pause)

నోముల నరసింహయ్య: అధ్యక్షా, నేను పదే, పదే తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరినాను. పెద్దలు అనేక రకాలుగా ఈ రాష్ట్రానికి సంబంధించిన ఇబ్బందులు అర్థంచేసుకొనేటటువంటి ముఖ్యమంత్రిగారు సభలో ఉన్నారు. రోశయ్యగారు చెప్పినట్టి ఆర్థిక పరిస్థితికి సంబంధించి 425 మంది పెద్ద ఇది కాదు. చిన్నకాయకి తీగకు బరువు అవుతుందా? ఈ విషయాన్ని ఆలోచించండి (ఇం) ఈ బిల్లుఅవసరం లేదు, అయినా సరే మేము అంతవరకే పెడతాము, పెడితే మీ చేతుల్లోకి ఆయుధం వస్తుంది. ఆ ఆయుధం ఒకసారి ఉపయోగిస్తే మీకే నష్టం జరుగుతుంది చెప్పి సలహా ఇస్తే వినకపోతే ఎట్లా? అందుకని మీరు బేషాజాలకు పోకుండా సెలక్టు కమిటికి పెట్టమన్నాను. డ్రాప్‌చేయమని మేము అన్నాము కాబట్టి డ్రాప్ చేసుకొనే ఇబ్బంది ఎందుకని , అట్లా వినడం లేదు దయచేసి మీరు ఒకసారి ఆలోచించమని చెప్పి కోరుతున్నాను. 425 మంది పెద్ద లెక్క కాదు, మీరు ఎంతోమందికి ఉద్యోగాలు ఇస్తామని అన్నారు. నోటిఫికేషన్సు ఇస్తున్నారు. ఉద్యోగ అవకాశాలు కోసం చెబుతున్నారు. పెద్ద ఇది కాదు. నిన్న కూడా మనం 90 మందితో పెద్దల సభను ఏర్పాటు చేసుకున్నాము.ఈ విషయాన్ని పునపరిశీలించాలని అంటున్నాను. ఫర్ యవర్ గుడ్ హెల్తు, గవర్నమెంటుకు సంబంధించి గుడ్ హెల్తు కోసం చెబుతున్నాను. ఈ విషయాన్ని గమనించాలని మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ కె.రోశయ్య: అధ్యక్షా, బిల్లు కూడా పాస్ అయినది, అయినా కూడా వారి మీద ఉన్నటువంటి గౌరవంతో ఒక మాట చెప్పాలని అనుకుంటున్నాను. ఈ మధ్య టెంపరరీ అపాయింట్మెంట్సు చాలా జరుగుతున్నాయి. కాంట్రాక్టు అని, ఎన్ఎంఆర్ అని ఏవేవో పేర్లు నాకు తెలియదు. ఎంపిఇఒలను సుమారు 5 వేల మందిని అపాయింటు చేశారు. మండలంలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్సు దానికి కొందరి క్వాలిఫికేషన్ బిఎస్.సి. (అగ్రికల్చర్) కొందరేమో ఇంటర్‌మీడియట్, కొందరేమో బి.కామ్, కొందరేమో 10వ తరగత తప్పిన వాళ్లు , ఏమిటండీ అంటే ప్రభుత్వం వాళ్లు వేసుకోమన్నారు, వేసుకున్నాము, ఎవరినో ఒకరిని కానీయండీ అంటారు. వాళ్లను రైగ్యులరైజ్ చేయడం సబబేనా చెప్పండి. పద్ధతి ప్రకారం రిక్రూట్ అయితే ఏమటని ఆలోచించవచ్చు. పద్ధతి లేకుండా క్రింద ఉన్న అధికారులు , 10వ తరగతి ఫైల్ అయినటువంటి వాళ్లను వేసుకొని ముఖ్యంగా అగ్రికల్చర్ బి.ఎస్‌సి. వాళ్లతో కంపేర్‌చేసి ఇద్దరిని ఒకే పోస్టులో వేసుకుంటే ఎలా వుంటుంది. అందువల్ల నియామకాలు క్రమబద్ధంగా జరగాలి. దీనికి 1994 చట్టం చేశాము. దర్మిలా ఆ చట్ట ప్రకారమే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉన్న రోజుల్లో కూడా వ్యవహరించారు. తరువాత వారు తీసుకొచ్చిన ఆర్డినెన్సును వారిని గౌరవించి వారు తెచ్చిన ఆర్డినెన్సును రిప్లేస్‌చేసి చట్టం చేయాలని ప్రయత్నం చేస్తే వారేమో మౌనంగా కూర్చొన్నారు. అయినా కూడా క్రమబద్ధీకరణ చేయడం అవసరం . దయచేసి అంగీకరించాలి. నియామకాలు అవసరమే కాని క్రమమైన పద్ధతిలో జరగలేదు.

శ్రీ వై. రామకృష్ణుడు: అధ్యక్షా, రోశయ్యగారు ఫైనాన్సు మంత్రిగా ఉన్నప్పుడు ఈ బిల్లు తీసుకురావడం జరిగింది. బిల్లు పాస్ చేశారు. అప్పుడు రోశయ్యగారితోటి కాంగ్రేడ్సుకు స్నేహం లేదు. కాని ఇప్పటి పరిస్థితి వేరు. ఇప్పుడు కాంగ్రేడ్సుతోటి స్నేహం ఉంది కాబట్టి బహుశ వీరి సలహా అయినా పాటిస్తారని అనుకొంటూ మేము కూర్చొన్నాము. ఏ రోశయ్యగారు ఈ బిల్లు తీసుకొచ్చారో 1994, అదే రోశయ్యగారు మంచి సలహా ఇచ్చినప్పుడు పాటిస్తే తప్పు ఏమి లేదు, పాటిస్తే మేము కూడా సపోర్టు చేస్తాము. అట్లా కాకుండా వేరే విధంగా చెప్పుకురావడంవల్ల ఒక అనుమానం వచ్చింది. ఈ బిల్లుకు సంబంధించినంతవరకు సమాధానం చెప్పారు. దాంట్లో వేరే విధమైన అభిప్రాయం కూడా లేదు. కాకపోతే కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారు, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్సును 5 వేల మందిని ఇచ్చారు అంటే, నేను ఒక్క క్లారిఫికేషన్ అడుగుతున్నాను. అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్సును ఇచ్చారు, కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారు, వాళ్లను మీరు తీసివేయబోతున్నారా? ఈ క్లారిఫికేషన్ చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ కె. రోశయ్య: అధ్యక్షా, గౌరవనీయులైన రామకృష్ణుడుగారికి అన్నీ తెలుసు. రామాయణం అంతా విని రాముడికి సీత ఏమి కావాలని వెనుకటికి ఎవరో అడిగారట? ఈ బిల్లుకి దానికి సంబంధం ఏమిటి? వారి కాలంలో జరిగిన నియామక జాబితా ఊరకే చదివి వినిపించాను. కాని ఈబిల్లుకి దానికి సంబంధం లేదు. అవి అన్నీ సపరేట్‌గా ఎగ్జామిన్ చేయవలసినటువంటి దీనికి దానికి ఏ రకమైన సంబంధం లేదు.

ము.1.10

శ్రీ వై. రామకృష్ణుడు: ఫైనాన్స్ మినిష్టర్‌గారి మాటలు చూసి మాకు అనుమానం వచ్చింది. వీరందరినీ తీసివేస్తారేమో అనే అనుమానం వచ్చింది.

శ్రీ కె. రోశయ్య: తీసివేయాలనే సలహా చెబితే ఆ సలహాను జాగ్రత్తగా పరిశీలిస్తాము. బహుశా మీ సలహా అదేనేమో అన్పిస్తోంది. దానిని జాగ్రత్తగా పరిశీలిస్తాము.

శ్రీ నోముల నరసింహయ్య: డివిజన్ కావాలి. We are pressing for Division.

శ్రీ ఎమ్.ఎ. గఫూర్: ఇది కాన్‌స్టిట్యూషనల్ ఆబ్లిగేషన్.

SRI Y.RAMAKRISHNUDU: Sir, I am on a point of order. అధ్యక్షా, బిల్లు పాస్ అయ్యే ముందు, మంత్రిగారు బిల్లు పాస్ చేయమని మూవ్ చేసిన తరువాత డివిజన్‌గాని, థర్డ్ రీడింగ్‌గాని అడిగే హక్కు మెంబర్స్‌కు ఉంటుంది. కాని మీరు బిల్లు పాస్‌చేశారు. మేము మైక్‌లో విన్నాము. ఎస్, నోస్ అని చెప్పారు. పాస్ అయినట్లు చదవిన తరువాత మరలా డివిజన్ ఎట్లాపెడతారు? ఈవిధంగా డివిజన్ పెట్టటానికి సాంప్రదాయాలు ఒప్పుకోవు.

SRI NOMULA NARASIMHAIAH: We are pressing for Division. మేము డివిజన్ కావాలని అడుగుతున్నాము. అధ్యక్షా, శాసనసభా వ్యవహారాలమంత్రిగా, స్పీకర్‌గా అపారమైన అనుభవం ఉన్న పెద్దలు రామకృష్ణుడుగారు. సాంప్రదాయాలు, పార్లమెంటరీ ప్రాక్టీసెస్ నాకంటే వారికి బాగా తెలుసు. నేను ఇక్కడ డివిజన్ కోసం ప్రెస్ చేస్తున్నాను. Chair is also in that particular mood. ఆ మూడ్‌ను రాంగ్‌గా ఇంటర్‌ప్రెట్ చేసి బిల్లు పాస్ అయినదని చెబుతున్నారు. ''లంకలో పుట్టినవన్నీ రాక్షసులే.'' వీరి స్టాండ్ ఏమిటో ఇప్పుడు తెలియాలి. We are pressing for Division.

శ్రీ సిహెచ్. వెంకటరెడ్డి: తప్పనిసరిగా డివిజన్ పెట్టండి, ఓటింగ్ పెట్టండి. పార్టీల అభిప్రాయాలు బయటకు తెలుస్తాయి. అప్పుడైనా అభిప్రాయాలు బయటకు వస్తాయి.

CHAIRMAN: The question is:

"That the Andhra Pradesh (Regulation of Appointments to Public Services and Rationalisation of Staff Pattern and Pay Structure) (Amendment) Bill, 2004 be passed."

(Pause)

The House divided thus:

Ayes -- 135

| | | |
|---|---|---|
| Noes | -- | 12 |
| Neutrals | -- | 1 |

The motion was carried and the Bill was passed.

## 304వ నియమము క్రింద ప్రస్తావించబడిన అంశము
## బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమము

శ్రీ కె. లింగయ్య(నేరెళ్ల): అధ్యక్షా, ఈ రాష్ట్రంలోని తెలంగాణా జిల్లాల్లో ఉండే ఏకైక పెద్ద పరిశ్రమ బొగ్గు పరిశ్రమ. నాలుగు జిల్లాల్లో విస్తారంగా బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ బొగ్గు నిక్షేపాలు కలవు. ఈ బొగ్గును ఆధారంగా చేసుకుని ఇది పనిచేస్తోంది. గడచిన 50, 60 సంవత్సరాల క్రితం ఈ కంపెనీలో ఉద్యోగులను అధికారులు ఏవిధంగా రిక్రూట్‌చేసుకున్నారో ఒక్కసారి వెనక్కు వెళ్లి చూశామంటే గ్రామాలకు వెళ్లి అక్కడి రైతుకూలీలను, రైతులను అందరినీ తీసుకువచ్చి బొగ్గు పరిశ్రమలో పనిచేయించుకునే పరిస్థితులు ఆనాడు ఉండేవి. గడచిన 15 ఏళ్లనుండి తెలుగుదేశం ప్రభుత్వం ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి ఇబ్బందులు కలిగించిందో ఒక్కసారి మీ అందరికీ సవినయంగా మనవిచేయదలచుకుని 304 క్రింద ఈ మోషన్ మూవ్ చేయటం జరిగింది. సభ్యులందరూ కూడా ఓపికతో మా కార్మికులపట్ల, కార్మికుల పిల్లలపట్ల శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం కూడా కార్మికుల సంక్షేమంపట్ల దయతో ఆలోచించవలసినదిగా నేను మనవిచేస్తున్నాను.

మ. 1.20

అధ్యక్షా, ఈ పరిశ్రమలో మొత్తం దాదాపు లక్షా పదివేల మంది పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చాక ఈ పరిశ్రమలో పని చేస్తున్న ఉద్యోగులను అనేక రూపాలలో తగ్గించే ప్రయత్నాలు కొనసాగించింది. ఉదాహరణకు వాలంటరీ రెటైర్‌మెంట్ స్కీమ్ అని, గోల్డెన్ షేక్ హ్యాండ్ అని, క్రమశిక్షణా చర్యలు అని వివిధ రూపాలలో వివిధ పేర్లతో వీటిని కొనసాగించి మొత్తం 7,641 మందిని ఉద్యోగాల నుంచి తొలగించడం జరిగింది.ఈ రోజున ఈ సింగరేణి కాలరీస్‌లో డిపెండెంట్ ఉద్యోగావకాశాలు లేకపోవడం వలన ఈపారిశ్రామిక ప్రాంతంలో వున్న నిరుద్యోగు యువకులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి అనేక అవలక్షణాలకు లోనయ్యే అవకాశాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం కల్పించిందని చెప్పకతప్పదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాములో తండ్రుల ఉద్యోగాలను కొడుకులకు ఇచ్చే డిపెండెంట్ ఉద్యోగ విధానాన్ని నిర్దాక్షిణ్యంగా తొలగించి వేయడంతో ఆ కుటుంబాలు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గడచిన తెలుగు దేశం ప్రభుత్వం ఎత్తివేసిన ఈ డిపెండెంట్ ఉద్యోగ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి నెలకొల్పవలసిన అవసరముందని ముఖ్యమంత్రి గారికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ విధానం గతంలో కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు అమలు జరిపినదే. అయితే తెలుగుదేశం ప్రభుత్వం ఈ విధానాన్ని తీసివేసి కార్మిక కుటుంబాలను వీధుల పాలు చేసింది. గత తెలుగుదేశం అవలంబించిన ఇలాంటి ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానల మూలంగా అక్కడి నిరుద్యోగ యువకులు నక్సలిజం వైపుకు లేకపోతే ఆత్మహత్యల వైపుకు మరలిపోయే ప్రమాదముంది. ఈ విధంగా కార్మిక, ఉద్యోగ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కల్పించినందువల్లనే చంద్రబాబు నాయుడు గారి

ప్రభుత్వానికి ఈ వర్గాలు వ్యతిరేకంగా పని చేసి ఆ పార్టీని ఓడించడానికి కృషి చేశారు. అదేవిధంగా అప్పటి లెజిస్లేచర్ పార్టీ నాయకులుగా మీరు జరిపిన పాదయాత్రల సందర్భంగా గోదావరి ఖని, కొత్తగూడెం, మంచిర్యాల తదితర ప్రాంతాలలో మీరు సింగరేణి పరిశ్రమకు సంబటంధించిన కార్మికులకు గతంలో వున్న అన్ని సౌకర్యాలను తిరిగి పునరుద్ధరించడం జరుగుతుందన్న మీ హామీని నమ్మి మీతో మమేకమై కాంగ్రెస్, టీ ఆర్ ఎస్ పార్టీలను ఎన్నికలలో గెలిపించి ఆ పార్టీ ప్రభుత్వాలు ఏర్పడేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఓడిపోయేందుకు తీవ్రంగా కృషి చేసిన సన్నివేశం ఈ రోజు మనకు కనపడుతున్నది. గత తెలుగుదేశం ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడానికిఈ పరిశ్రమ ఏమైనా నష్టాలతో నడుస్తున్నదా అంటే అది కూడా కాదు. ఎందుకంటే ఈ పరిశ్రమ 1999-2000 సంవత్సరంలోరు300 కోట్ల ప్రాఫిట్‌ను,2000-2001లో రు. 85 కోట్ల ప్రాఫిట్‌ను2001-2002లో రు.290 కోట్ల ప్రాఫిట్‌ను2002-2003 లో రు. 417 కోట్ల ప్రాఫిట్‌ను అదేవిధంగా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు రు.500 కోట్లప్రాఫిట్‌ను ఆర్జించింది. అయినప్పటికీ ఈ పరిశ్రమలో కార్మిక రంగం యొక్క సౌకర్యాల కల్పన విషయంలో యాజమాన్యం ఏమాత్రం శ్రద్ధ వహించనందువల్ల వారి సదుపాయల విషయంలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నది. యాజమాన్యం ఇంకా ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంబిస్తున్నది. ఈ పరిశ్రమలోపని చేస్తున్న ఉద్యోగుల, కార్మికుల పిల్లల విద్యా సౌకర్యాల విషయంలో ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదు. వాళ్ల విద్యా సౌకర్యాలను మెరుగుపరచడంలో కాని, స్కాలర్‌షిప్పులు ఇత్యాది విషయాలలో కాని ప్రక్కనే వున్న ఎన్టీపీసి ఎన్నో విద్యా సౌకర్యాలను కల్పిస్తుండగా ఈ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అదేవిధంగా మనకు ఇంకా బొగ్గు నిక్షేపాలు లేవని మొన్న బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో ప్రకటించిన ఎకనామిక్ సర్వేలో ప్రభుత్వం తెలియజేసింది. శాసన సభలో ప్రవేశపెట్టిను ఎకనామిక్ సర్వేలోని పేజి 71లో ఏముందంటే Andhra Pradesh is the only coal producer in the entire South India.దక్షిణ భారత దేశంలో ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌ను మినహాయిస్తే మిగతా రాష్ట్రాలలో ఎక్కడ కూడా కోల్ ప్రొడ్యూస్ చేయడం లేదని అందులో చెప్పారు. It produces around 32 million tons annually. Its estimated reserves are around 10.5 million tons. 6 lack tons were identified for privatisation అయ్యా, మనం ఆ సంస్థను ప్రయివేటైజ్ చేయమని, డిపెండెంట్ ఉద్యోగ సౌకర్యాలు కల్పిస్తామని కార్మిక వర్గానికి మనం వాగ్దానాలు చేసి మళ్లీ గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వేనే తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సభలో ప్రవేశపెట్టడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ వారు ఆ కార్మికవర్గానికిచ్చిన హామీల విషయంలో ముఖ్యమంత్రి గారు వారికి స్పష్టంగా చెప్పాలని మనవి చేస్తున్నాను. ఈ సంస్థ కార్మికులు గత ప్రభుత్వానికి కొన్ని డిమాండ్లు ముందుంచడం జరిగింది. చంద్రబాబు నాయుడు గారు యుక్తితో ఎన్నికలు వస్తున్న తరుణంలో గోదావరిఖని సభలో ఇంటీరియమ్ రిలీఫ్‌ను 15 శాతం ప్రకటించడం జరిగింది. ఇది మామూలుగా కార్మికులకు చెల్లించవలసివున్నదే. ఇందులో కొత్తగా చెల్లించింది ఏమీ లేదు. అయితే ఈ ఇంటీరియమ్ రిలీఫ్ ఏడున్నర శాతం ఇంకా చెల్లించవలసివున్నప్పటికి యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. కాబట్టి ఇలాంటి విషయాలలో కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూల వైఖరిని అవలంబించాలని ముఖ్యమంత్రి గారిని నేను కోరుతున్నాను. ఇక భద్రతా చర్యల విషయంలో గత ప్రభుత్వం అవలంబించిన లోపభూయిష్ట విధానాల వల్ల ఎంతోమంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోవడం జరిగింది. ఆవిధంగా ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో కూడా ఆ ప్రభుత్వం సరియైన శ్రద్ధ చూపలేకపోయింది. ఉదావారణకు 18 ఎన్‌క్లైవ్‌లో సజీవంగా మనుషులను మూసివేశారు. అదేవిధంగా 7 ఏఈపీ ఎన్‌క్లైవ్‌లో కార్మికులు కొంతమంది నీట మునిగిపోయారు. అదేవిధంగా18వ ఎన్‌క్లైవ్ 88నందు బండ కూలిపోయి కొంతమంది కార్మికులు చనిపోయారు. ఈ విధంగా ప్రతి నెలా, ప్రతి నిత్యం కార్మికులు భద్రతా లోపాల కారణంగా మరణిస్తున్నారు. ఈ విధంగా మరణిస్తున్న కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులో కూడా వ్యత్యాసాలు చూపిస్తున్నారు.18వ ఎన్‌క్లైవ్ 88వ బావిలో జరిగిన మరణాలకు ఆరు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అయితే నిత్యం జరుగుతున్న కార్మికులమరణాలకు మాత్రం కేవలం లక్షరూపాయలు ప్రకటిస్తున్నారు. కార్మికులు బొగ్గు గని కార్మికులకు మాత్రం ఆరు లక్షలు ఇచ్చి మిగతా వారికి లక్ష రూపాయలు ఇవ్వడం ఏం సమంజసం? ఇలాంటి వ్యత్యాసాలను దయతో ముఖ్యమంత్రి గారు సరిదిద్దే చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.దాదాపు ఆరు కొత్త బావులను గతంలోఖమ్మం జిల్లాలోని చర్ల, అనిసెట్టిపల్లి మరియు కరీంనగర్ జిల్లాలోని తాడిచెర్ల మొదలైన చోట్ల ఆరు కొత్త బావులను ఐడెంటిఫై చేయడం జరిగినప్పటికి

అక్కడ ఇప్పటి వరకు బొగ్గు బావులను నెలకొల్పలేదు. వీటిని నెలకొల్పినట్లయితే ఆ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి దొరికి వాళ్లు నక్సలిజం వైపుకు  మళ్లడం కాని, ఆత్మహత్యలకు పాల్పడడం లాంటి అవలక్షణాలకు లోను కాకుండా వుంటారు కాబట్టి ఈ విషయంలో ముఖ్యమంత్రి గారు స్పందించాలని కోరుతున్నాను. గత పది సంవత్సరాల కాలంలో ఒక్క కొత్త బావి కూడా రాలేదు. భూపాలపల్లిలో మాత్రం ఎక్స్‌టెన్షన్ వచ్చింది. అక్కడ భూములు కోల్పోయిన వారికి ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదు. వున్న సర్‌ప్లస్ కార్మికులనే బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్, గోదావరిఖని నుండి డంప్ చేసి పని చేయిస్తున్నారు.  గత తెలుగుదేశం అవలంబించిన ఉద్యోగ వ్యతిరేక విధానాల వల్ల నిరుద్యోగులు నిరాశానిస్పృహలకు లోనై వున్న తరుణంలో రాజశేఖర రెడ్డి గారు తమ పాద యాత్ర సందర్భంలో అయా ప్రాంతాల్లో చేసిన వాగ్దానాలకు ఆకర్షితులై ఆ ప్రభుత్వం వస్తే తమ కోర్కెలు నెరవేరతాయన్న ఆశాభావంతో వున్నారు. అదేవిధంగా కార్మిక వర్గాలు కూడా ఆయన ప్రసంగాలతో ఆకర్షితులైభుజం భుజం కలిపిఎన్నికలలో ఆ పార్టీవెన్నంటి వుండి ఆ పార్టీ విజయానికి తమ వంతు సహకారం అందించారు. అధ్యక్షా, ఎన్నడూ లేనివిధంగా గత ప్రభుత్వాలు కార్మికుల సమ్మెహక్కును కూడా కాలరాచే ప్రయత్నం చేయడం జరిగింది. సమ్మె హక్కు అనేది కార్మికుల జన్మ హక్కు అని  కమ్యూనిస్టు సోదరులు చెబుతుంటారు. అలాంటిది ఈ పరిశ్రమలోని కార్మికులు ఒక్క రోజు సమ్మె చేస్తే మూడు రోజుల జీతాన్ని కోత వేయడం ఎంతవరకు సమంజసం? వారికి సమ్మె హక్కును పునరుద్ధరిస్తామని, వారి న్యాయమైన కోర్కెలు తీరుస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన అనేక వాగ్దానాలను ఆ కార్మికులు నమ్మి కాంగ్రెస్, టీ ఆర్ ఎస్ పార్టీలను ఎన్నికలలో గెలిపించిఆ పార్టీల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో తమ వంతు సహకారాన్ని అందించిన ఆ సింగరేణి సంస్థ కార్మికుల, ఉద్యోగుల  సమస్యల పరిష్కారం విషయంలో ముఖ్యమంత్రి గారు అన్ని విధాల కృషి చెయ్యవలసిన అవసరముందని మనవి చేస్తున్నాను.
మ.1.30

బొగ్గు గనులలో పని చేసే కార్మికుల నుంచి ఇన్‌కమ్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు .  ఈ కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్ ఎందు కండీ?   బొగ్గు గనులలో పని చేసే కార్మికులకు సంబంధించి వారి వేతనాల నుంచి ఇన్‌కమ్ ట్యాక్స్‌ను కట్ చేసే విధానం  తీసేయా లని  ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.   ఈ కార్మికుల డిపెండెంట్స్‌కు ఉద్యోగ   అవకాశాలు  కల్పించడం, కొత్త బావులను ప్రారంభించడం,  ప్రైవేటీకరణ ఆపుజేయడం,  కార్మికులకు హౌసింగ్ వసతి కల్పించడం,  అవసరమైన ఇతర  మౌలిక వసతులు కల్పించడం  తదితర విషయాలపై  తప్పకుండా ముఖ్యమంత్రిగారు ఆలోచించాలని కోరుతున్నాను.   ప్రైవేటీకరణ, యాంత్రీకరణ తీసేయాలని  సవినయంగా ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రిగారికి,  సంబంధిత మంత్రిగారికి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. శ్రీధర్‌బాబు(మథని):  అధ్యక్షా, బొగ్గుగనులలో పని చేస్తున్న  కార్మికుల బాగోగులు, వారి సంక్షేమం గురించి,  కొత్త గనుల ప్రారంభం గురించి, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల గురించి  గౌరవ శాసనసభ్యులు లింగయ్య గారు   ప్రస్తావించడం జరిగింది .  ప్రత్యేకంగా ఈ సమస్య  కరీంనగర్, వరంగల్, ఆదిలాబాదు మరియు ఖమ్మం వంటి నాలుగు జిల్లాలలో పని చేస్తున్న సింగరేణి కార్మికులకు సంబంధించిన సమస్య .   ఈ జిల్లాలలో ఇప్పటి వరకున్న 11 ఓపెన్ కాస్ట్ మైన్స్, అదే విధంగా 55 అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో పని చేస్తున్న కార్మికుల గురించి చాలా సుదీర్ఘంగా  పెద్దలు లింగయ్యగారు ప్రస్తావించడం జరిగింది.   వీట న్నింటినీ దృష్టిలో  పెట్టుకుని నేను కొన్ని సూచనలు ప్రభుత్వానికి చేయదలుచుకున్నాను.   రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో కార్మికుల శ్రేయస్సు గురించి ఆలోచన చేసి, కాంగ్రెస్ పార్టీ ఆనాడు ప్రతిపక్షంలో వుండగా పెద్దలు రాజశేఖర్ రెడ్డిగారు కార్మిక ప్రాంతాలలో  కార్మికుల సమస్యలను తెలుసుకుంటూ, సమస్యలపై సానుకూలంగా స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత చాలా వరకు తప్పకుండా సమస్యలను పరిష్కారం  చేస్తామని వారు చెప్పడం, దాని వల్ల  కార్మికులందరూ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సమస్యలు చాలా వరకు తీరిపోతాయనే ఆశాభావంతో వున్నారు.

అధ్యక్షా, బొగ్గు గనులలో పని చేస్తున్న ఆ కార్మికుల కనీస అవసరాల గురించి మనం ఆలోచన చేయవలసిన అవసరం వుంది. ఖచ్చింతగా చెబుతున్నాం, గత ప్రభుత్వం కేవలం ప్రొడక్షన్ మీదే దృష్టినంతా కేంద్రీకరించి పూర్తి స్థాయిలో కార్మికుల శ్రేయస్సును మరచిపోవడం జరిగింది. గత పది సంవత్సరాల నుంచి ఈనాటి వరకు హౌసింగ్ పరంగా యాజమాన్యం తీసుకున్న చర్యలను గమనిస్తే, ఇందులో పని చేసే 95 వేల మంది కార్మికులకు గాను కేవలం 52 శాతం మంది కార్మికులకే రెసిడెన్షియల్ క్వార్టర్స్‌ను యాజమాన్యం ఇచ్చింది. ఇంకా 48 శాతం మంది కార్మికులు అద్దె ఇళ్లలలో వుంటున్నారు. క్వార్టర్స్ వున్న కొంత మంది కార్మికులు తమ మిత్రులకు సహాయం చేసే నిమిత్తం తమ క్వార్టర్స్‌ను వారితో షేర్ చేసుకుంటున్నారు. ఈవిధంగా షేర్ చేసుకుంటున్న కార్మిక సోదరులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు, ప్రమాదకరమైన సూచనలు ఇస్తున్నారు మేనేజ్‌మెంట్ వారు. ఎవరైతే కార్మికులు క్వార్టర్స్‌ను తమ సోదర కార్మికులతో షేర్ చేస్తున్నారో వారికి పవర్ సప్లై తీసేయడం, వారి దగ్గర పీనల్ రెంట్ ఛార్జ్ చేయడం జరుగుతోంది. విపరీతమైన భయాందోళనలకు గురి చేస్తున్నారు. అధ్యక్షా, మౌలిక విషయం ఒకటి గుర్తు పెట్టుకోవాలి. ఈరోజు ఖచ్చితంగా చెబుతున్నాను, ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలను ప్రక్కన బెట్టి యాజమ్యానం కార్మిక సంక్షేమం కోసం కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుందని మనవి చేస్తున్నాను. ప్రకృతికి విరుద్ధంగా పని చేస్తూ, ఈ సింగరేణి కార్మికులు అండర్‌గ్రౌండ్‌లో కనీసం నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లి అక్కడ ఏర్పాటైన వర్క్‌ప్లేస్‌లో తట్ట పట్టుకుని పని చేస్తూ పూర్తి స్థాయిలో ప్రొడక్షన్ తీసుకొస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ప్రాఫిట్స్ తీసుకొస్తున్న ఈ సింగరేణి కార్మికుల శ్రేయస్సు గురించి, వారి అవసరాలను తీర్చే మౌలిక ప్రిన్సిపుల్‌ను మేనేజ్‌మెంట్ గుర్తు పెట్టుకుంటే , ఈనాడు ప్రొడక్షన్ పెంచి రూ. 507 కోట్ల ప్రాఫిట్స్‌ను తీసుకొచ్చిన కార్మికులు రాబోయే కాలంలో రూ. 1000 కోట్ల ప్రాఫిట్స్ తీసుకరావడానికి సిద్ధమవుతారని తెలియజేస్తున్నాను. వారి పిల్లలకు, వారి డిపెండెంట్స్‌కు కనీస వసతులను కల్పించాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

ఈనాడు కార్మికులు ఎనిమిది గంటల పాటు అండర్‌గ్రౌండ్‌లో కష్టపడి తిరిగి పైకి వచ్చిన తర్వాత, ఇంటికి పోతే సరైన కరెంట్ వుండదు, త్రాగునీరు వుండదు. గోదావరి నది ఈ బొగ్గు గనుల ప్రక్కనే ప్రవహిస్తున్నా మంచినీరు తాగని కార్మికులు చాలా మంది వున్నారు. వారి గురించి పట్టించుకోవలసిన అవసరం వుంది. ఈరోజు ప్రభుత్వాన్ని కోరుతున్నాను, సింగరేణి బొగ్గు గనులలో పని చేసే కార్మికులందరికి రెసిడెన్షియల్ క్వార్టర్స్ కట్టించి వారికి గృహ సౌకర్యం కల్పించాలని, ఇప్పటివరకు ఆఫీసర్ల వరకే పరిమితమైన హౌసింగ్ లోన్ సదుపాయాన్ని సొంత స్థలాలున్న కార్మికులెవరైతే ముందుకు వస్తారో వారికి కూడా ఆ ఫెసిలిటీని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈనాడు మంచినీటి విషయంలో ప్రత్యేక దృష్టి సారించవలసిన అవసరం వుంది. గత పదిహేను సంవత్సరాల క్రితం నిర్ణయం తీసుకుని ఎన్విసేజ్ చేసిన వాటర్ స్కీము ఈనాడు పెరిగినటువంటి జనాభా, కార్మికుల పిల్లలు, వారి డిపెండెంట్స్ కు అవసరమైన నీటిని అందించలేకపోతోంది. మంచినీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. కావున దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఒక కాంప్రెహెన్సివ్ వాటర్ స్కీమును ఎన్విసేజ్ చేసి క్వార్టర్స్‌లో వున్న వారికి, అదే విధంగా పరిసర గ్రామాలలో వున్న కార్మికులందరికీ కూడా మంచి నీటి వసతి కల్పించాలి. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కరెంట్‌ను ఇస్తే నీళ్లు వచ్చిన తర్వాత దాన్ని తీసేయడం జరిగింది. మాకు మంచి నీటి వసతి కల్పించాలని గత పది సంవత్సరాల నుంచి కార్మికులు వెళ్లి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని దౌర్భాగ్య స్థితి వుంది. అటువంటి స్థితి నుంచి ఆ కార్మికులను కాపాడవలసిన కనీస ధర్మం, బాధ్యత మన పైన వుంది. ఈరోజు కార్మికులకు అదే విధంగా వారి డిపెండెంట్స్‌కు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో చికిత్సను ప్రొవైడ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదే విధంగా ఇంతకు ముందు గౌరవ సభ్యులు చెప్పినట్లు, గత రెండు సంవత్సరాల నుంచి చాలా మంది కార్మికులు చనిపోతున్న దురదృష్ట సంఘటనలు చూస్తున్నాం . కొంతమంది ఫ్యాటల్ యాక్సిడెంట్స్‌లో చనిపోతున్నారు, అలాగే పని చేస్తున్న సందర్భంలో ఒకరిద్దరు చనిపోవడం జరిగింది. వీరికి ఎక్స్‌గ్రేషియా విషయంలో అన్యాయం జరుగుతోంది. ఆనాడు ప్రభుత్వం కేవలం ఫ్యాటల్ యాక్సిడెంట్స్‌లో చనిపోయిన వారికే రూ. 3లక్షలు కంపెనీ ద్వారా, మరో రూ. 3లక్షలు సిఎం స్పెషల్ ఎక్స్‌గ్రేషియా ద్వారా

ప్రకటించడం జరిగింది. మేము రూ. 6 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఖచ్చితంగా అడిగిన తర్వాతే ఆనాడు ప్రభుత్వం స్పందించడం జరిగింది. ఫ్యాటల్ యాక్సిడెంట్‌లో చనిపోయిన కార్మికులకు రూ.6లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నపుడు, ప్రకృతి విరుద్ధంగా పని చేస్తూ, ఎన్నో కష్టాలకోర్చి పని చేసే సమయంలో చనిపోయిన కార్మికునికి రూ. 6లక్షల ఎక్స్‌గ్రేషియా ఎందుకు ఇవ్వకూడదు? Death is death for one or for a group of people. కాబట్టి ఒకసారి దీనిపై ఆలోచన చేసి పని చేస్తూ చనిపోయిన ప్రతి కార్మికునికి రూ. 6లక్షల ఎక్స్‌గ్రేషియాను ఈక్వేట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ.1.40

ఈనాడు కార్మికులు అండర్ గ్రౌండ్‌లో ఉన్న వర్క్ బేస్‌ను చేరడానికి మైన్ రోడింగ్ సిస్టమ్‌ను తయారు చేశారు. మొత్తం 55 మైన్స్ ఉన్నాయి. కేవలం 8, 9 మైన్స్‌లో మాత్రమే ఈ సిస్టమ్‌ను ప్రొవైడ్ చేశారు. మిగతా చోట పనిచేసే వారు నాలుగైదు కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుంది. కాబట్టి ప్రతి ఒక్క మైన్‌లో ఈ మైన్ రోడింగ్ సిస్టమ్‌ను ప్రొవైడ్ చేయాలని కోరుతున్నాము. కార్మికులు వర్క్ బేసుకు సౌలభ్యంగా వెళితే కేంద్రీకరించి పనిచేసే అవకాశం ఉంటుంది. మైన్ రోడింగ్ సిస్టమ్‌లో కొన్ని లోపాలున్నాయి. కార్మికులకు పని భారం పెరుగుతుంది. లక్షా పన్నెండు వేల మంది ఉన్న కార్మికులు ఇప్పుడు 95 వేల మంది మాత్రమే ఉన్నారు. కాబట్టి వారందరి పని భారం వీరి మీద పడుతుంది. వేకెన్సీలు ఉన్న చోట రిక్రూట్‌మెంట్‌కు సంబందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నాను. సింగరేణి కార్మికుల పిల్లలు చాలా మంది ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్ చదువుకొని నిరుద్యోగంతో బాధపడుతున్నారు. వారికి ఉద్యోగావకాశాలు కల్పించిన వారౌతారు. డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ గురించి గౌరవ సభ్యులు లింగయ్యగారు చెప్పారు. డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు ఎప్పుడూ కూడా వారికి డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్ గురించి హామీ ఇవ్వలేదని మనవి చేస్తున్నాను. కాని తప్పకుండా ఆలోచన చేస్తామన్నారు. వారితో రెండు , మూడు జిల్లాలకు వెళ్లడం జరిగింది. ఆయన ఎప్పుడూ చెప్పలేదు. కార్మికుల పిల్లల గురించి కొత్త విధానాల వల్ల ఉపయోగపడే విధానం పెడతామని చెప్పారు తప్ప వేరేగా అనలేదు. లింగయ్యగారు వారి పరంగా చెప్పడం జరిగింది. ఇన్‌కమ్‌టాక్స్ విషయంలో ఆనాడు ప్రకృతికి విరుద్ధంగా పని చేస్తున్న బొగ్గు గని కార్మికులను కాపాడుకునే విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటాము. యూనియన్ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వల్ల లక్ష రూపాయలు మించి ఉన్న వారికి రాబోయే కాలంలో వేజ్ రివిజన్‌లో ఈ కార్మికులు వచ్చే అవకాశం ఉంటుంది. దాని పరంగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలియచేస్తున్నాను. కొత్త మైన్స్ విషయంలో చాలా వరకు గత ప్రభుత్వంలో రు.400 కోట్లు పై చిలుకు లాభాలు వచ్చాయి. రు.200కోట్లు వచ్చినప్పుడు కొత్త మైన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రు.507 కోట్ల లాభాలో డైరెక్ట్ టాక్స్ పోగా నెట్ ప్రాఫిట్ రు.176 కోట్లు వరకు వచ్చింది. తాడి చెర్ల నియోజక వర్గం, మదిపాములలో కాని కొత్త మైన్స్ వచ్చే అవకాశముందని, అక్కడ కొత్త మైన్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నాను. మారుమూల ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో వారికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం కలుగుతుంది. నిరుద్యోగ సమస్య తీరే అవకాశం ఉన్నందున దీనిపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. పెద్దలు, మంత్రి వర్యులను ఇన్‌కమ్ టాక్స్ విషయంలో ఖచ్చితంగా లక్ష రూపాయల పైన ఉన్న కార్మికునికి 16 శాతం మంది రాబోయే వేజ్ రివిజన్‌లో అట్రాక్ట్ అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వెంటనే స్పందించాలని కోరుతున్నాను. పూర్తిగా పనిచేసే కార్మికుని గురించి ప్రొడక్షన్ ఓరియెంటెడ్‌గా కాక సింగరేణి వెల్ఫేర్ ఓరియెంటెడ్‌గా పని చేయాలని గత ప్రభుత్వంలో సుబ్బారాయుడుగారు మంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయినా వారి ప్రభుత్వం ఒప్పుకోలేదు. క్యాబినెట్‌లో ఆమోదం పొందక ప్రొడక్షన్ ఓరియెంటెడ్‌గా మిగిలిపోయింది. సింగరేణి కార్మికులు వెల్ఫేర్ ఓరియెంటెడ్ కంపెనీగా పేరు తెచ్చుకోవాలని ప్రభుత్వానికి మనవి చేస్తూ, అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియ చేస్తున్నాను.

శ్రీ సిహెచ్.రాజేశ్వరరావు(సిరిసిల్ల): అధ్యక్షా, నాలుగైదు జిల్లాల విస్తీర్ణంలో లక్షకు మించిన కార్మికులతో గత అనేక దశాబ్దాల నుండి ఆంధ్ర ప్రదేశ్‌లో బొగ్గు ఉత్పత్తి రంగంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుని సింగరేణి కాలరీస్ కార్మికులను

ప్రత్యేకించి కార్మికులను, కార్మిక సంఘాలను ప్రత్యేకించి అభినందించవలసి ఉంది. కరీంనగర్ జిల్లాలో గోదావరి ఖని ప్రాంతాన్ని అనేక సందర్భాలలో నాకు స్వయంగా సందర్శించే అవకాశం కలిగింది. గత పది సంవత్సరాలకు పూర్వం కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండింది. అంతేకాక ఉత్పత్తి కూడా తీవ్రంగా పడిపోయి కార్మికుల సంక్షేమ కార్యక్రమాలకు నిధులు లేక, కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా , వారి హక్కులను ఏ మాత్రం గౌరవించకుండా ఉద్యమాలు చేసిన వారిని అణచి వేసిన ఘటనలు చాలా చూశాము. గత పది సంవత్సరాల పరిణామాన్ని ఇప్పుడు పరిశ్రమల యొక్క తీరుతెన్నుల గురించి సమర్పించిన పత్రాన్ని చూస్తే చాలా సంతోషం కలుగుతుంది. మిత్రులు శ్రీధర్‌బాబు, లింగయ్యగారు చెప్పినట్లుగా , వారు కోరిన కోరికలు చాలా సమంజసంగా, వాస్తవంగా ఉన్నాయి. వాటిని పరిష్కార యోగ్యం అయ్యేలా చూడాలి. గత పది సంవత్సరాలలో సింగరేణి కాలరీస్‌లో వచ్చిన ఉత్పత్తి పెరుగుదల దాని వినియోగం తాత్కాలికంగా కొంత నిరుద్యోగానికి దారి తీసినా, మొత్తం పరిశ్రమల యొక్క ఉత్పాదక శక్తిని పెంచడానికి, ఉత్పత్తిని పెంచడానికి, లాభాలు రావడానికి సాధించిన విజయాలు అభినందనీయం, మనందరికి గర్వ కారణమని తెలియ చేస్తున్నాను. వీటిని ప్రయివేటైజ్ చేయబోతున్నారని కార్మికులు పబ్లిక్ సెక్టార్‌లో ఉండాలనే పద్ధతిలో కార్మికులు తీవ్రమైన ఆందోళనకు గురిచేయబడ్డారు. భారత దేశంలో అన్ని రాజకీయ పార్టీల యొక్క మానిఫెస్టోలు చూస్తున్నాము. చర్చలు చూస్తున్నాము. పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో, పబ్లిక్ రంగంలో లాభసాటిగా ఉన్నాయి. ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుతూ, సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయుక్తంగా లాభాలను సంపాదిస్తున్నాయి. వాటిని ప్రయివేటైజ్ చేయడం అర్థరహితం .

మ 1.50

వాటిని ప్రైవేటైజ్ చేయడం, విజాతీయం చేయడం అర్థరహితం. తప్పనిసరిగా, సాధ్యమైనంత ఎక్కువగా కార్మికుల చేతులలోనే, కార్మికుల ద్వారానే, వారి సంఘాల ప్రమేయం ద్వారానే సరైన పరిపాలన ఏర్పాటు చేసి దానిని అభివృద్ధి చేయాలి తప్ప ప్రైవేటైజ్ చేసే ఆలోచన ఎవరికీ వుండకూడదని చెప్పి కోరుతున్నాను. ఏదైనా భారతదేశంలో నిదర్శనముంటే, ఉదాహరణ వుంటే అది సింగరేణి కాలరీస్ అని చెప్పి నేను మరొకసారి మీ ముందు చెప్పడానికి సంతోష పడుతున్నాను. ఏది ఏమైనప్పటికీ ఇంకా కార్మికుల జీవితాలలో చాలా సమస్యలు వున్నాయి. అందులో ఏ మాత్రం సందేహం లేదు. 20,30 సంవత్సరాల క్రితం వాళ్ల ఇబ్బందులలో, కష్టాలలో వున్నప్పుడు చూసిన వాళ్లము ఈ రోజు వాళ్ల పరిస్థితి చూస్తే చాలా సంతోషం కలుగుతుంది. ఈనాటి నాగరికత ప్రపంచంలో ఈనాటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ఈనాటి విద్య, వైద్య తదితర సౌకర్యాలు బాగా పెరగవలసిన అవసరాలు చూసినట్లయితే సింగరేణి కాలరీస్‌లో ప్రతి కాలనీలో కూడా అనేక సౌకర్యాలు కావలసి వున్నాయి.

అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు సమర్పించిన రిపోర్టులో విద్యా విషయాలు, వైద్య విషయాలు, సంక్షేమ విషయాలు, ఇన్సూరెన్స్ విషయాలు, గ్రాట్యుటీ లైఫ్ విషయాలు అదే విధంగా అనేక రంగాలలో గృహ విషయాలు 40 శాతం వరకు ఏర్పాటు చేశాము, దానిని త్వరగా పెంచి 52 శాతానికి పెంచవలసిన అవసరముందని చెప్పారు. ఇంకా కొన్ని పరిష్కారం కావలసిన వున్నాయి. వాటిని పరిష్కరించడానికి పూనుకుంటామని అన్నారు. ఇది అనడంతోబాటు ఈరోజు కార్మికుల అవసరాలను బట్టి చూస్తే లాభాలు వచ్చిన సందర్భాలు ఇటీవల గత 4,5 సంవత్సరాల నుండి కనబడుతున్నాయి.

ఇంతకు ముందు లాభాల మాట దేవుడెరుగు, అనేక కష్టాలు కూడా వున్నాయి. ఈ పరిణామాన్ని చూసినట్లయితే 2000 సంవత్సరం నుండి 300 కోట్ల రూపాయలు లాభాలు వచ్చాయి. అలాగే 10 శాతం లాభాలు ఇవ్వడం జరిగింది. 10 శాతం లాభాలు అంటే 30 కోట్లు కార్మికులకు డివిడెండ్ పంచడం జరిగింది. 2000-01 సంవత్సరంలో 81 కోట్ల రూపాయలు లాభాలు వస్తే 10 శాతం పంపకం చేయడం జరిగింది. 8.5 శాతం కార్మికులకు పంపకం చేయడం జరిగింది. 2001-02లో 290 కోట్ల రూపాయలు లాభాలు వస్తే 10 శాతం చొప్పున 29 కోట్ల రూపాయల లాభం పంపకం చేయడం జరిగింది. 2002-03లో 417 కోట్ల రూపాయలు లాభాలు వస్తే 11 శాతం చొప్పున వారికి డివిడెండ్ రూపంలో 45 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగింది.

2003-04లో కూడా చాలా లాభాలు వచ్చాయి. ఆ లాభాల విషయమే కార్మికులు కోరుతున్నారు. ఈ రోజు లాభాలను చూసినప్పుడు దానిలో కొన్ని ఖర్చుల క్రింద, కొన్ని టాక్సెస్ క్రింద మినహాయించినప్పటికీ గణనీయ సంఖ్యలో లాభాలు వుంటాయి. వీటిని కార్మికులకు పంచవలసిన అవసరముంది.

మొన్న జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వారు 10 శాతం, 11 శాతం కాదు 15 శాతం లాభాలు పంపకం చేస్తామని వాగ్దానం చేశారు, ప్రచారం చేశారు. న్యాయమైన విషయం అది, కావలసిన విషయం అది. దానిని కూడా అమలులో పెట్టమని కార్మికులు కోరుతున్నారు. అందుకొరకే కార్మికులు ఇంటీరియం రిలీఫ్‌ను కోరుతున్నారు. ఈ ఇంటీరియం రిలీఫ్‌ను 7.5 శాతం క్రింద సెటిల్‌మెంట్ చేయమని కార్మికులు కోరుతున్నారు.

కొత్త ప్రాజెక్టులు ప్రారంభించవలసిన అవసరముంది. చాలా చోట్ల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. వాటిని విస్తరించడానికి, కార్మికులకు ఉపాధి కల్పించడానికి, కొత్తగా ఉపాధిని బాగా చేయడానికి, ఉపాధికి చాలా చక్కని అవకాశాలు వున్నాయి. అందుకని ప్రభుత్వం దాని మీద దృష్టిని కేంద్రీకరించి, వ్యాప్తి చేయవలసిన అవసరముందని కోరుతున్నాను. నేను ఇప్పటివరకు మనవి చేసినట్లు లాభాలలో 15 శాతంను కార్మికులకు ఇవ్వడానికి ప్రభుత్వం అనుమతించాలి, అంగీకరించాలి. ఈ సంవత్సరం వచ్చిన లాభాలను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకొని దానిని ఇంకా అమలుపరచాలని కోరుతున్నాను.

అదే విధంగా కార్మికుల కుటుంబాలు దురదృష్టవశాత్తు, ప్రమాదాల కారణంగా చనిపోతున్నారు. వారికి ఎక్స్‌గ్రేసియో 6 లక్షల రూపాయల చొప్పున ప్రతి మనిషికి ఇవ్వాలని చెప్పి కూడా చాలామంది మిత్రులు చెప్పారు. దానితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఈనాడు కార్మికుల జీవితాలంటే ఎంత అంధకారమో, ఎంత ప్రమాదకరమో, వాళ్లు ఏ విధంగా పనిచేస్తూ వుంటారో, ఆ పరిస్థితులలో కార్మికుడు చనిపోతే వారి కుటుంబానికి ఎంత బాధ్యతలు వుంటాయో, ఎన్ని సమస్యలు వుంటాయో, వాటన్నింటినీ పరిష్కరించుకోవలసిన అవసరముంది. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని ఆరు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియో పెద్ద విషయం కాదు. వారు సంపాదించే సంపాదన, ఫ్యాక్టరీకి వచ్చేటటువంటి లాభాలు అన్నీ చూసినప్పుడు కనీసం ఆరు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేసియో ఇవ్వాలని నేను ప్రత్యేకించి కోరుతున్నాను.

అధ్యక్షా, దానితోపాటు కుటుంబ సభ్యునికి ఉద్యోగం ఇచ్చే విషయం కూడా చాలా కాలంగా అనుకుంటున్నాము. కార్మికులు కూడా కోరుతున్నారు. తప్పనిసరిగా ప్రతి కుటుంబానికి ఒక యుక్తి గలవాడు, శక్తి గలవాడు, ఎబిలిటీ గలవాడు వారి కుటుంబంలో వున్నట్లయితే వారికి కూడా అందులో ఉద్యోగం ఇవ్వాలని చిరకాల కోరిక. దానిని ఇంతకాలం వాయిదా వేయడం మంచిది కాదు. కాబట్టి దానిని సంపూర్ణంగా అంగీకరించి, ఆమోదించి అమలుపరచాలని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ ప్రభుత్వం ఇచ్చినటువంటి కార్మిక వ్యవస్థ గురించి, అక్కడి పరిస్థితుల గురించి చాలా సంతృప్తికరంగా వున్నప్పటికీ దానిని మరింత ముందుకు తీసుకుపోయి ఈనాటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు సంక్షేమ సౌకర్యాలను కూడా పెంచాలి. ఉత్పత్తి కొరకే కాదు ఫ్యాక్టరీ అంటే. ఇంతకు ముందే శ్రీధర్ బాబు గారు చాలా చక్కగా చెప్పారు. ప్రొడక్షన్ ఓరియంటెడ్, సోషల్ ఓరియంటెడ్, వెల్ఫేర్ ఓరియంటెడ్. మన సమాజంలో వెల్ఫేర్ ఓరియంటెడ్ ప్రధానం గాని వెల్ఫేర్ అమాంతంగా రాదు. వెల్ఫేర్ కావాలంటే ప్రొడక్షన్ పెరగాలి. ప్రొడక్షన్ పెరగాలంటే టెక్నాలజీ పెరగాలి. టెక్నాలజీ పైన ఉత్పత్తి పెరగాలి. ఇవన్నీ బాగా వుంటే లాభాలు వచ్చి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. కార్మికులు కూడా ఉత్పత్తిని పెంచే దిశలో ఇదివరకు గత 10 సంవత్సరముల కంటె అపూర్వమైన మంచి త్యాగాలకు కట్టుబడి పనిచేస్తున్నారు. దాని తరువాత ఫలితాలు కూడా వస్తాయి. కార్మికులకు 15 శాతం లాభాలను పంపకం చేసి, వారి సంక్షేమ కార్యక్రమాన్ని సంపూర్ణంగా

నిర్వహించాలని, ఆ విధంగా పరిశ్రమను పబ్లిక్ రంగంలో కలకాలం పోషించాలని ఈ ప్రభుత్వాన్ని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య : అధ్యక్షా, దీనికి సంబంధించి ఒక ప్రధానమైన సమస్యకి, ప్రత్యేకంగా మన రాష్ట్రానికి అన్ని రకాలుగా సంపద చేకూర్చే అంశం. సింగరేణి కాలరీస్‌కి సంబంధించిన చర్చకు సంబంధించి అనేక రకమైన, కీలకమైన అంశాలు దీనిలో వున్నాయి. దీనిని నల్ల బంగారం అని పిలుస్తారు. పత్తి పండించే రైతులను తెల్ల బంగారం అంటారు. కాని వాళ్లు ఆత్మహత్యలకు పోయారు. ఈ నల్ల బంగారం లాభాలలో వుంది. దీనిని ఇంకా లాభాలలో తీసుకురావలసిన అవసరముంది. దీని కోసం కొత్త మైన్స్‌ను ఓపెన్ చేయవలసిన అవసరముంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచన చేయాలి.

మేము రెండు, మూడు సార్లు ప్రమాదం జరిగినప్పుడు కాలరీస్ లోపలకు వెళ్లడం జరిగింది. సోదరుడు శ్రీధర్ బాబు కూడా రావడం జరిగింది. వారితో సహా ప్రమాదం జరిగిన వారిని చూశాము. అక్కడ ఎంతో సంపద వుంది. కొత్త మైన్స్‌ను ఓపెన్ చేయడం వలన మన సంపదను వాడుకున్న వారమవుతాము. వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగం చూపిన వారమవుతాము. దీనిని బట్టి ఆలోచిస్తే ఇది ఎన్నో రకాలుగా ఆదాయమవుతుంది. ఉపాధి అవుతుంది. ఇది ఎనర్జీకి సంబంధించి, ఇతరత్రా ప్రత్యేకమైనటువంటి, ఒక ప్రధానమైన, కీలకమైనటువంటి రంగానికి ఉపయోగపడే వీలుంది. దీనిని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లుగా తాము ఇచ్చిన వివరాలను బట్టి వుంది.

ఏది ఏమైనా తమరి ద్వారా మనవి చేసేదేమిటంటే గతంలో నాయర్ అని యం.డి. వుండేవారు. ఆయనను చూస్తే కార్మికులకు హడల్. అతనిని చూస్తే కదిలేవారు కాదు. ఆ రకమైన యాజమాన్యంతో కార్మికులు అణచివేయబడ్డారు. కార్మిక సంక్షేమం పక్కకు పెట్టబడింది. అప్పుడు వున్న ప్రభుత్వం ప్రయత్నం వేరుగా వుంది. కేంద్రంలో గాని, రాష్ట్రంలో గాని కార్మిక సంఘాల వద్ద అంతా యాంత్రిక విధానాలతో మనకు లాభాలు ఎక్కువగా వస్తున్నాయనే ఆలోచనలతో వుంటే, ఆరకమైన ఆలోచనలు వద్దని నేను మనవిచేస్తున్నాను. మనం చూసిన బడ్జెట్‌గాని, ఇక్కడ వున్న పరిస్థితులు గాని, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేసినటువంటి వాగ్దానాలు అనేకం దీనికి ఉపయోగంగా, మనకు ఉదాహరణగా వున్నాయి. తమరి ద్వారా కోరేదేమిటంటే పెద్దలు, ఆర్థిక శాఖా మంత్రిగారు దీనికి సమాధానం ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. వివరణ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

దీనిలో ఉపాధి కల్పించడం కోసం అనేక మార్గాలు వున్నాయి. దాని కొరకు కొత్త మైన్స్‌ను ఓపెన్ చెయ్యండి. దీనితోబాటు మైన్స్‌ను పూడ్చివేసే దగ్గర మైన్స్‌ను పూడ్చి వేయకుండానే కొంత లాలూచీ పడినందు వలన ప్రమాదాలకు గురయ్యే విధంగా ఆ మైన్స్‌కి సంబంధించి వుండే వాటిని వెరిఫై చేయండి. గతంలో 2,3 ప్రమాదాలు జరిగి కార్మికులు సజీవంగా పూడ్చివేయబడ్డారు. తరువాత వారిని వెలికి తీయడం జరిగింది. కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాలన్నింటినీ ఒకసారి ప్రత్యేకంగా చూడాలని కోరుతున్నాను. బతికుంటే బలుసాకు తినొచ్చని ఒక సామెత వుంది. అందుకని కార్మికుల భద్రత గురించి మీరు ఆలోచించండి. సేఫ్టీ మెజర్స్‌ను గతంలో పక్కన పెట్టారు.

మ.2.00

అధ్యక్షా, సేఫ్టీ మెజర్స్ చూడండి. పెద్దలు రాజేశ్వర రావు గారు, సోదరుడు శ్రీధర్ బాబు గారు సంస్థ యొక్క లాభాల గురించి చెప్పారు. లాభాలలో కొంత పర్సెంటేజ్ ఇస్తే తప్పకుండా ప్రొడక్షన్ పెరగడానికి వీలు ఉంటుంది. కొత్త మైన్స్ ఏర్పాటుచేసే ఆలోచన కూడా చేయాలని మనవి చేస్తున్నాను. కొత్త మైన్స్ ఏర్పాటుచేసే పనులు చేస్తే అధనంగా ఆదాయం చేకూరగలదని చెబుతున్నాను. అక్కడి వైద్య సదుపాయం చూస్తే చాలా బాధాకరంగా ఉంది. కార్మికుల సంఖ్య లక్షా ఇరవై వేల

దగ్గర నుండి 93 వేలకు వచ్చింది. అధికారుల సంఖ్య మాత్రం 2400 అలాగే ఉంది. ఎందుకంటే యంత్రాలను తీసుకొచ్చి కార్మికులను తగ్గించారు. కార్మికులను తగ్గించడం వల్ల వారు ఉపాధిని కోల్పోయారు. యంత్రాల మీద నాకు ఎటువంటి కోపం లేదు. వేరే ప్రత్యామ్నాయం ఉండాలని మనవి చేస్తున్నాను. యంత్రాలతోబాటు కార్మికులను కూడా వాడుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. కార్మికుడు నిరుద్యోగుడైతే అతని ఆదాయం పోతుంది, వినియోగం పోతుంది. అన్ని రకాల ఆకలిచావులకు గురవుతాడు. ఆ విధమైన పరిస్థితి ఉంటే ఫ్యాక్టరీలే మూతపడతాయి. కాబట్టి ఈ విషయాన్ని గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఖచ్చితమైన మెజర్స్ తీసుకోవాలి. వైద్య సదుపాయం, ఇళ్ల సదుపాయం వారికి కలిగించాలి. ఇదివరకు అక్కడి మేనేజింగ్ డైరక్టర్ హిట్లర్ లాగా ఉండేవాడు. నేను, సురవరం సుధాకర రెడ్డి గారు దొడ్డి దారిన తప్పించుకుపోయి సభలో పార్టిసిపేట్ చేయవలసి వచ్చింది. కాబట్టి ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ చాడా వెంకటరెడ్డి: అధ్యక్షా, తెలంగాణాలో సింగరేణి సంస్థ అనేది నిజంగా పేద వర్గాలకు బ్రతుకుతెరువు చూపించినటువంటి సంస్థ. ఈ సంస్థ నాలుగు జిల్లాలకు విస్తరించి ఉంది. సుమారు లక్షా ఇరవై వేల మంది కార్మికులు పనిచేస్తున్నటు ఈ సంస్థలో గత ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానం వల్ల 93 వేలకు తగ్గింది. 1997వ సంవత్సరం వరకు సంస్థ పూర్తి నష్టాలలో ఉంది. మొత్తం 1219 కోట్లు నష్టాలలో ఉంది. బి.ఐ.ఎఫ్.ఆర్‌కి కూడా రిఫర్ చేయబడినప్పుడు , కార్మికులు ఐక్యంగా ఉండి అనేక పద్ధతులలో కష్టపడి బి.ఐ.ఎఫ్.ఆర్‌కి పోనివ్వకుండా చూచి నష్టాలలో ఉన్నటువంటి సంస్థను లాభాలలోకి తీసుకొచ్చారు. ఆ లాభాలు 450 కోట్లకు పెరిగాయి అంటే ఆశ్చర్య పడనక్కరలేదు. ఇప్పటి వరకు ఆ సంస్థ లాభాలలోనే ఉంది. కార్మికుల సంక్షేమానికి సంబంధించి, కార్మికులకు ఉన్నటువంటి ఇబ్బందులను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించడానికి ఈ ప్రభుత్వం పూనుకోవాలని మనవి చేస్తున్నాను. కార్మికులు అనేక కష్టనష్టాల నుండి ఈ సంస్థను లాభాల బాటలోకి తెచ్చారు. ఇది ఆంధ్ర ప్రదేశ్‌కే గర్వకారణం. ఈ నల్ల బంగారం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి అవ్వడం వల్ల అనేక రకాలుగా మనకు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది, మన రాష్ట్రానికి కూడా గొప్ప పేరు వస్తుంది. ఈ సంస్థలోని ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అక్కడి సిబ్బందికి క్వార్టర్స్ లేవు, నలభై శాతం మందికి మాత్రమే క్వార్టర్స్ ఉన్నాయి. కొంతమంది గుడిసెలలో ఉంటున్నారు, క్వార్టర్స్ లేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి క్వార్టర్స్‌ని పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. జనవరి , ఫిబ్రవరి, 2003 వ సంవత్సరంలో కార్మికులు 15 రోజులు సమ్మె చేసారు. జీతాలు పెంచమనో, ప్రావిడెంట్ ఫండ్ పెంచమనో వారు సమ్మె చేయలేదు. ఈ సంస్థని ప్రైవేటైజ్ చేయొద్దని, సింగరేణి సంస్థని సర్వనాశనం చెయ్యొద్దని వారు సమ్మె చేసారు. ఆనాటి ప్రభుత్వం కార్మికులను పూర్తిగా అణచివేసింది. ఒక టి.ఎన్.టి.ఎస్ తప్ప అన్ని యూనియన్స్ కలసి సమ్మెని చేసాయి. ఆ సమ్మె చేసినప్పుడు కార్మికుల మీద అనేక కేసులు పెట్టారు కాబట్టి వాటిని ఎత్తివేయాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. అదే విధంగా బొగ్గు బావులలో చనిపోయినటువంటి వారికి6 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 7ఎఫ్, 8ఎలో వారికి కూడా ఇవ్వవలసిన అవసరం ఉందని, ఎక్స్‌గ్రేషియా ఇంకా ఇవ్వలేదని, గతంలో తీసుకున్న నిర్ణయాలు అసలు కానటువంటివి ఉన్నాయని వాటిని కూడా ప్రభుత్వం ఆలోచించవలసి ఉందని మనవి చేస్తున్నాను. డిపెండంట్స్‌కి ఉద్యోగాలు ఇవ్వాలని, దీనిని గత ప్రభుత్వం రద్దు చేసందని, కంపెనీ వాలెంటరీ రిటైర్మెంట్ చట్టం ఒకటి ఉంది కాబట్టి , ఆ క్లాజ్ ప్రకారం వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నాను. వారి మానసిక వేదన తీర్చడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయి, ఇంకా మెరుగుపరచవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. అలాగే డ్రింకింగ్ వాటర్, డ్రైనేజ్ ఫెసిలిటీస్ కార్మికులకు కల్పించాలి. అలాగే లాభాల నుండి స్పెషల్ ఇన్సెంటీవ్ ఐ.ఆర్ క్రింద గతంలో ఏడున్నర శాతం ఇచ్చారు. ఎన్నికల ముందు దానిని 15 శాతం చేస్తామని చంద్రబాబు నాయుడు గారు చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పని సరిగా చేయాలని, లాభాలు ఈనాడు 450 కోట్లు వచ్చాయి కాబట్టి కంపెనీ లాస్ క్రింది ఇన్‌కం టాక్స్ క్రింద తీసివేసి మిగిలిన లాభాల నుండి తప్పనిసరిగా 15 శాతం ఐ..ఆర్ ఇవ్వడానికి ప్రభుత్వం పూనుకోవాలని

కోరుతున్నాను. సింగరేణి సంస్థను ఎన్‌హ్యాన్స్ చేయడానికి ప్రభుత్వం పూనుకోవాలని కోరుతున్నాను. కరీంనగర్ జిల్లాలో కొత్త గనులు రావడానికి అవకాశం ఉంది అందులో ఓపెన్ కాస్ట్, ఇంకా అండర్ గ్రౌండ్ బావులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఖమ్మంలో కొత్తగూడెంలో అణిచింతపల్లి, పెనుగడప్ప, ఉనుకులబలక, భద్రాచలంలో కూడా రెండు రావలసి ఉంది. ఏడు బావులలో రెండు ఓపెన్‌గా వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడు బావులను కూడా తక్షణమే ప్రారంభం చేయడం ద్వారా నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ఓపెన్ కాస్ట్‌ని పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేస్తే బాగుండదని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. గతంలో కొంత మంది వచ్చి ఫర్మ్స్ పేరుతో తీసుకొని నడిపిస్తామని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆచి తూచి అడుగెయ్యాలని కోరుతున్నాను. కార్మికుల ఉత్పత్తులను కాపాడాలని కోరుతున్నాను. ఈ సంవత్సరం వచ్చినటువంటి లాభాలను తొందరగా పంపిణీ చేసి, ఐ.ఆర్‌ను కూడా ఇవ్వాలని అలాగే కార్మికుల ఆవేదను పరిష్కరించాలని కోరుతున్నాను.

మ. 2.10

(ఇంటరప్షన్స్)

శ్రీ టి. దేవేందర్ గౌడ్(మేడ్చల్)ః 50 వేల మంది ఓటర్స్ ఉన్నారు. ....

మిస్టర్ స్పీకర్ ః కూర్చోండి. మీకు అవకాశం ఇస్తాను. రాములు గారూ చెప్పండి.

శ్రీ కె. రాములుః అధ్యక్షా, నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఒకే నిమిషం మాట్లాడుతాను. కరీంనగర్ జిల్లాలో, పక్క జిల్లాలోను సింగరేని కాలరీస్ కంపెనీ ఉంది. ముఖ్యంగా అన్ని విషయాలు మంత్రు లు చెప్పారు. కార్పొరేషన్ చాలా పెద్దది. 10వ శాసన సభలో దీని మీద సభా సంఘం కూడా వేశారు. అప్పటి నుంచీ అదే రకంగా పోతూనే ఉంది. సామాన్య కార్మికులకు ఏ లాభం కలగడం లేదు. కరీంనగర్ జిల్లాలో రెవ్యూ మీటింగ్ అయితే, 30 వేల గుడిసెలు గల కార్మికులకు త్రాగు నీరు లేదనే విషయం చెప్పారు. 30 వేల గుడిసెలు ఉంటే 90 వేల జనాభా ఉంటుంది. వారికి మౌళిక సదుపాయాలు కలుగ చేసే బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. క్రొత్త బావులు ఓపెన్ చెయ్యాలి. ఎక్కువ మందికి ఉపాధి కల్పన చెయ్యాలని కోరుతున్నాను. అన్నిటి కంటే ముందు యాక్సిడెంట్స్ రేటు బాగా పెరుగుతుంది. ఒక్కొక్కసారి బొగ్గు బావులలో పని చేసే వారికి సేఫ్టీ మెజర్స్ తక్కువగా ఉంటాయి. సేఫ్టీ మెజర్స్‌ను పెంచాలి. ముఖ్యంగా అక్కడ ఉన్న పరిస్థితులలో వారంతా బీదవారు. వీకర్ సెక్షన్ కార్మికులు. కనుక వారి సంక్షేమం మీద ఎక్కువ దృష్టి పెట్టవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ వనమా వెంకటేశ్వర రావు(కొత్తగూడెం)ః అధ్యక్షా, దాదాపు 95 వేల మంది కార్మికుల సమస్య. ముఖ్యంగా నేను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభినందిస్తున్నాను. నిన్న కేంద్ర బడ్జెట్‌లో సింగరేణి కాలరీస్‌కు రు. 350 కోట్లు కేటాయించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చిదంబరం గారిని, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగారిని అభినందిస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థ మీద, కార్మికుల మీద వారి సంక్షేమం కోసం రు. 350 కోట్లు కేటాయించినందుకు వారిని అభినందిస్తున్నాను. ముఖ్యంగా చాలా విషయాలు చెప్పాలి. వీరి సంక్షేమం కోసం రాజశేఖర రెడ్డిగారు పాదయాత్రల సందర్భంగా చెప్పారు. ముఖ్యంగా మా ప్రాంతంలో క్రొత్త బావులు త్రవ్వాలి. అలిశెట్టిపల్లి, పెనుగడప,తెర్లాం, సత్తుపల్లి ప్రాంతాలలో క్రొత్త బావులు ఏర్పాటు చేస్తే, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని, సంస్థను కోరుతున్నాను. నిరుద్యోగం తీరాలంటే క్రొత్త బావులు వచ్చే పరిస్థితి రావాలి. హౌసింగ్ విషయానికి వస్తే, చాలా మంది కార్మికులకు ఇళ్లు లేవు. దానికోసం సంస్థ యాజమాన్యాన్ని కోరుతున్నాను. వేలాది ఎకరాల భూమి ఉంది కనుక, క్వార్టర్స్ నిర్మాణం చేసి, వారికి ఇవ్వాలని కోరుతున్నాను. అన్నిటి కంటే ముఖ్యం డిపెండెంట్ ఎంప్లాయిమెంట్

విషయం ముఖ్యం. కార్మికులు కోరుతున్నారు. గత ప్రభుత్వం డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ తీసివేసింది. దీని గురించి ఆలోచించాలి. ఇది అమలు చేస్తే బాగుంటుంది.

పెన్షన్ విషయానికి వస్తే, దీని గురించి ఆలోచించి, అమలు చేస్తే బాగుంటుంది. సంస్థకు రు. 450 కోట్ల నుంచి రు. 500 కోట్ల వరకూ లాభం వస్తోంది. భవిష్యత్తులో రు. 1000 కోట్ల కూడా ఉంటుంది. కార్మికులు తమ చెమటోడ్చి, రక్తం ధారపోసి బొగ్గు బావులలో నాలుగయిదు కిలోమీటర్లు నడిచి, ఎప్పుడు ఇంటికి వస్తారో తెలియని పరిస్థితిలో ఉంటారు. వారికి 15 శాతం పెన్షన్ ఇవ్వడం న్యాయం. దీని గురించి ఆలోచించాలని కోరుతున్నాను.

ఇన్‌కమ్ ట్యాక్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెటులో చెప్పింది. రు. 1 లక్ష వరకూ మినహాయింపు ఇచ్చారు. అందు వల్ల ఆలోచించి వీరికి ఇన్‌కంట్యాక్స్ తొలగించాలి. సింగరేణి సంస్థలో కార్మికులు బొగ్గు గనులలో చావు బ్రతుకులలో ఉంటారు, యాక్సిడెంట్స్ అయి చాలా మంది చనిపోవడం జరుగుతూ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ట్యాక్స్ మినహాయంపు ఇవ్వాలి.

సంస్థ కార్మికులకు వైద్య సదుపాయం సరిగ్గా లేదు. డాక్టర్స్ లేరు. స్పెషాలిటీస్ లేవు. హాస్పటల్ సదుపాయం ఇంప్రూవ్ చెయ్యాలి. మంచి డాక్టర్స్‌ను వెయ్యాలి. వైద్య నిపుణులను పెట్టి, కార్మికుల సంక్షేమం చూడాలని కోరుతున్నాను. కార్మికులను ఆదుకోవలసిన అవసరం ఉంది. రాజశేఖర రెడ్డిగారికి చాలా విషయాలు తెలుసు. పాద యాత్రల సమయంలో చాలా విషయాలు వారికి తెలిసాయి. వారి సంక్షేమం కోసం కృషి చెయ్యాలని కోరుతున్నాను.

శ్రీ కె. ఈశ్వర్(మైడారం): అధ్యక్షా, సింగరేణి కాలరీస్‌కు సంబంధించిన విషయాలు గౌరవ సభ్యులు చాలా విషయాలు ప్రస్తావించారు. తమరి ద్వారా ఈ సభకు, ప్రభుత్వానికి కొన్ని ముఖ్యమైన విషయాలు ప్రస్తావించనివి మీ దృష్టికి తెచ్చే ప్రయత్నం చేస్తాను. గతంలో సింగరేణి కంపెనీలో 1,15,000 మంది కార్మికులు ఉండగా, గత ప్రభుత్వ 9 సంవత్సరాల కాలంలో కేవలం 94 వేల మంది కార్మికులకు కుదించారు. అంతే కాకుండా 9 సంవత్సరాల కాలంలో సంస్కరణల పేరుతో కార్మికుల యొక్క జీవితాలతో ఆటలు ఆడుకునే విదంగా, అనేక నిర్బంధాలకు గురి చేసి, ప్రైవేటేజేషన్ పేరుతో అనేక క్రొత్త క్రొత్త యంత్రాలు ప్రవేశపెట్టి, వేలాది మంది కార్మికులను తొలగించిన పరిస్థితి ఉంది. ఇప్పటికి కూడా దేశంలో అనేక మంది కార్మికులు ఉన్నప్పటికీ, వారి పరిస్థితి ఒక ప్రత్యేకమైన పరిస్థితి. తప్పకుండా మీరు ఈ విషయాలను గమనించాలని కోరుతున్నాను. సింగరేణి కాలరీస్ సంస్థలో పని చేసే కార్మికులు పూర్తిగా ప్రకృతికి విరుద్ధంగా కిలోమీటర్ల కొద్దీ భూగర్భంలోకి పోయి, బొగ్గు తీసే పనిని నిర్వర్తిస్తున్నారు. అనేక ప్రమాదాలకు గురి అయ్యే పరిస్థితి వీరికి ఉంది. ఇటువంటి పరిస్థితులలో గల కార్మికులకు ఎన్నో సంవత్సరాల నుంచీ, ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను గడచిన ప్రభుత్వం కాలరాచి వేసింది. ప్రధానంగా మా ప్రాంతానికి వరంగా గల డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ తీసి వేశారు. 30, 40 సంవత్సరాలు సర్వీస్ చేసిన తరువాత, వారికి వచ్చే హక్కు, వారి కుటుంబ సభ్యులకు వచ్చే హక్కును కాలరాయడం ద్వారా చదువుకున్న యువకులకు ఎటువంటి ఉద్యోగావకాశాలు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్న పరిస్థితి ఉంది. రెండు, మూడు విషయాలు చెబుతాను. ఇటువంటి పరిస్థితులలో పని చేస్తున్న కార్మికుల పరిస్థితి చూడండి. నాలుగు సంవత్సరాలకు ఒకసారి వేజ్ రివిజన్ జరపవలసి ఉంది. 1.7.01 నాటికి గడచిన వేజ్ రివిజన్ పూర్తయి, 3 సంవత్సరాలయినా ఇప్పటి వరకూ వేజ్ అగ్రిమెంట్ కోసం ఎటువంటి ఏర్పాటు జరగలేదు. గతంలో జె.బి.సి.సి.ఐ ద్వారా ఒక అగ్రిమెంట్ అయింది. వేజ్ రివిజన్ ఆలస్యం అయితే, వారి మూల వేతనంలో 15 శాతం ఇంటరిం రిలీఫ్ చెల్లించాలని ఉన్నప్పటికీ, ఎన్నికలకు ముందు 7.5 శాతం మాత్రమే ఇచ్చారు. మిగతా 50 శాతం ఇవ్వవలసి ఉంది. కార్మిక సంఘాలు కోరినప్పటికీ ఇప్పటి వరకూ ఎటువంటి పురోగతీ లేదు. గతంలో 5వ వేజ్ రివిజన్ విషయానికి వస్తే, కార్మికులు వేజ్ బోర్డ్ అగ్రిమెంట్ జరపాలని పోరాటం చేసిన కారణంగా ఆ నాడు శాసన సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది.

మ 2.20

ఆ రోజు కార్మికులకు వేతన రివిజన్ కూడా చేయడం జరిగింది. ఈ నాడు కూడా నేను సభను కోరుతున్నాను. ఈ రోజుకి కూడా సింగరేణీ కాలరీస్‌కు సంబంధించిన 7 వ వేతన ఒప్పందం ఉంది. ఈ శాసన సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని తమరి ద్వారా కోరుతున్నాను. గత నాలుగు సంవత్సరాల నుంచీ లాభాలు ఆర్జిస్తున్న కంపెనీ. గడచిన మూడు సంవత్సరాలలో 10 శాతం స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వడం జరిగింది. పోయిన సంవత్సరం 11 శాతం ఇవ్వడం జరిగింది. కార్మికులు, కార్మిక సంఘాలు కోరుతున్నారు. 15 శాతం ప్రకటించాలని గడచిన సంవత్సరం మే నెలలో ఇవ్వడం జరిగింది. ఇప్పటి వరకు ఎన్నో లాభాలు వచ్చాయి. ఎంత శాతం ఇన్సెంటివ్ ఇస్తున్నారో తెలియజేయలేదు. ప్రకటించలేదు.

కార్మికుల స్థితిగతులకు సంబంధించి చెబుతున్నాను. ఏ కంపెనీలో లేని విధంగా యాక్సిడెంట్స్ సింగరేణీ కంపెనీలో జరుగుతున్నాయి. ఒకవైపు సేఫ్టీ మెజర్స్ గురించి సింగరేణీ కంపెనీ వారు ఎన్ని మాటలు చెబుతునప్పటికీ, ఎన్నో కోట్లు ఖర్చుపెడుతున్నామని చెబుతున్నప్పటికీ ఎన్నడూ లేని విధంగా గడచిన సంవత్సరం, ఈ సంవత్సరం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. దానికి సంబంధించిన విషయం మీ దృష్టికి తెస్తున్నాను. మాస్ యాక్సిడెంట్స్ జరిగినప్పుడు, పదుల సంఖ్యలో, ఐదుల సంఖ్యలో జరిగినప్పుడు మాత్రమే కార్మిక సంఘాలు కాని, కార్మికులు కాని రు.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసి, పోరాటం చేసినప్పుడు కార్మిక నాయకుల పైన కేసులు పెట్టి ఆ రోజు బలవంతంగా రు.6.00 లక్షలు మాత్రమే ఎక్స్ గ్రేషియా ప్రకటించడం జరిగింది. బొగ్గు బావులలో ఏదో ఒక రొజు, ఏదో ఒక మైన్ లో తప్పని సరిగా యాక్సిడెంట్స్ జరుగుతున్నాయి. యాక్సిడెంట్స్ అన్నవి బండ కింద పడి చనిపోవడం జరుగుతోంది. ఒక్కరు చనిపోయినా, ఎంతమంది చనిపోయినా ఒకే విధంగా తీసుకుని న్యాయం చేయవలిసన అవసరం ఉంది.

అదే విధంగా రీసెంట్‌గా నిన్నా, మొన్నా ఒక కార్మికుడు బావిలోకి దిగి నాలుగు గంటలు పని చేసిన తరువాత చనిపోవడం జరిగింది. అటువంటి సంఘటనలు కోకొల్లలు. దానికి సంబంధించిన మేనేజ్‌మెంట్ అది నాచురల్ డెత్ అంటున్నారు. అది నార్మల్ డెత్‌గా ట్రీట్ చేస్తున్నారు. 20, 25 సంవత్సరాలుగా గాలి, నీరు లేక 300 మీటర్ల లోతుకు దిగి పని చేస్తున్న పరిస్థితులలో గాలి లేక చనిపోయిన కార్మికులు ఉన్నారు. మూడు రోజుల క్రితం చనిపోయిన వారిని నార్మల్ డెత్ క్రింద చనిపోయినట్లు చెబుతున్నటువంటి సందర్భాలు ఉన్నాయి. కార్మికులు ఎవరైనా మైన్‌లో చనిపోతే ఒకే విధమైన పద్ధతులు అవలంభించాలని మీ ద్వారా కోరుతున్నాను. ఇంటిరిమ్ రిలీఫ్, స్పెషల్ ఇన్సెంటివ్ కాని పేజ్‌కు సంబంధించి సభలో ఒక తీర్మానం ప్రవేశ పెట్టాలని కోరుతున్నాను.

శ్రీ ఎన్. దివాకర రావు(లక్సెట్టిపేట్):- అధ్యక్షా, తెలంగాణా ప్రాంతంలో అతి పెద్ద సంస్థ సింగరేణీ సంస్థ. దాదాపు 90 వేల పైబడి కార్మికులు ఈ సంస్థలో పని చేస్తున్న సందర్భంలో సింగరేణీ ప్రైవేటీకరణ అవుతుంది, మనకు భవిష్యత్తు లేదు అనే సందర్భంలో ఆనాడు కాంగ్రెస్ పార్టీ, పెద్దలు రాజశేఖర రెడ్డి గారు ఈ సింగరేణీ సంస్థ ప్రైవేటీకరణ కాదు అన్ని సందర్భాలలో ఆదుకుంటాము అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మీద నమ్మకంతో, విశ్వాశంతో వారి రక్తాన్ని ధారపోసి సింగరేణీ కార్మికులు దాదాపు రు.506 కోట్లు లాభాలు రావడానికి కృషి చేశారు. వారికి ఈ సభ ద్వారా అభినందనలు తెలియజేస్తున్నాను. ఎన్నో సమస్యలు చెప్పినప్పటికీ, ఇక్కడ ప్రస్తావనకు రాని సమస్యలు, ముఖ్యమైన సమస్యలు చెబుతాను. దయచేసి మంత్రి గారిని నోట్ చేసుకోవలసిందిగా ఈ సందర్భంలో కోరుతున్నాను. సింగరేణీ సంస్థ షేప్ అన్న ప్రోగ్రామ్ క్రింద రు.200 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగింది. దానిలో చాలా తక్కువ ఎమౌంట్ మాత్రమే ఖర్చు చేయడం జరిగింది. మిగతా డబ్బు కూడా విడుదల చేసి ముఖ్యంగా మా శ్రీరాంపూర్ ప్రాంతంలో గోదావరి నీళ్లు కావాలని సింగరేణీ వారు కోరుతున్న సందర్భంలో రు.7.50

కోట్లతో అక్కడ ప్రాజెక్టుకు పూర్తి రిపోర్టు ఇవ్వడం జరిగింది. అందులో కోటి రూపాయలు మాత్రం ఇవ్వడం జరిగింది. మిగతా రు.6.50 కోట్లు అతి త్వరలో ఇచ్చి సింగరేణికి గోదావరి నీళ్లు అందేలాగ నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాను.

సింగరేణీ క్వార్టర్స్‌లో దాదాపు 40 వేల మంది ఉంటున్నారు. మిగతా 50 వేల మందికి క్వార్టర్సు లేవు. బయట కిరాయికి ఉంటున్నారు. వారికి కరెంటు 30 యూనిట్లే ఇస్తున్నారు. అది కూడా డబ్బుగా ఇవ్వడం లేదు. హెచ్.ఆర్.ఎ రు.75 లు ఇస్తున్నారు. అదే గోదావరి ఖనిలో మునిసిపల్ పరిధిలో ఉన్న వారికి రు.500 లు హెచ్.ఆర్.ఏ ఇస్తున్నారు. గ్రామ పంచాయతీలలో ఉన్న వారికి రు.75 లు ఇస్తున్నారు. చాలా వ్యత్యాసం ఉంది. క్వార్టర్సులో ఉన్న వారికి ఎన్ని యూనిట్స్ అవుతున్నాయో ఎంత హెచ్.ఆర్. ఎ ఇస్తున్నారో అంత ఎమౌంట్ బయట కిరాయికి ఉన్న వారికి కూడా ఇవ్వాలని కోరుతున్నాను. ఇది ప్రధానమైన సమస్య. దీని పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

సింగరేణీ కాలరీస్‌లో ఎంతోమంది రిటైర్ అవుతున్న సందర్భంలో అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకుంటున్నారు. వారి వద్ద ల్యాండ్ టాక్స్ పోయిన ప్రభుత్వం కలక్ట్ చేయడం జరిగింది. స్క్వేర్ ఫీట్‌కు రెండు రూపాయలంటే మేను అంతా పోరాటం చేశాము. వాస్తవంగా ఆనాటి మంత్రి గారు కూడా ఉన్నారు. ఆనాడు మా విన్నపం శ్రద్ధగా ఆలోచించి దానిని చార్ అణా, ఆఠ్ అణా గా స్క్వేర్ ఫీట్‌కు చేయడం జరిగింది. శ్రీరాంపూర్‌లో 4, 5 స్కూల్స్ ఉన్నాయి. 100 ప్రైవేట్ స్కూల్స్ ఉన్నాయి. ఒక్కో స్కూల్‌కు దాదాపు 5 నుంచి 6 ఎకరాల స్కూల్ ఆవరణ ఉంటే వారు టాక్స్ కట్టాలంటే ఒక్కో స్కూలు ఒక్కో నెలకు రు.15 వేలు కట్టాలి. అది తక్షణమే విత్‌డ్రా చేయాలి. ల్యాండ్ రెంట్ కూడా అందరూ చిన్న వ్యాపారస్థులు. చాకలి వారు, చిన్న చిన్న వ్యాపారస్థులు. వారి దగ్గర ఎలాంటి ల్యాండ్ టాక్స్ కలక్టు చేయవద్దు అని మనవి చేస్తున్నాను.

Open cast రావడం చాలా సంతోషం. కానీ ఎక్కడైతే గ్రామాలు ఉన్నాయో, నివాస స్థలాలు ఉన్నాయో అక్కడ open cast రావడం వల్ల గ్రామాలు షిఫ్ట్ చేయవలసి వస్తున్నది. దయచేసి గ్రామాలు లేని ప్రాంతాలలో open cast చేయాలని చెబుతున్నాను. అన్నిటికన్నా ప్రధానమైన సమస్య వారు చెప్పారు. ఇన్‌కమ్ టాక్స్ విషయం. ప్రమాదకరమైన పనులు చేస్తున్నటువంటి సంస్థలు ఎయిర్ ఫోర్స్ కాని, నేవీ కానీ వీటిలో ఇన్‌కమ్‌టాక్స్ లేదు. మన పరిధిలో లేనప్పటికీ ఈ కార్మికులకు కూడా పూర్తి స్థాయిలో ఇన్‌కమ్ టాక్స్ లేకుండా మన సభ యునానిమస్ రిజల్యూషన్ పాస్ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి వీరు ఇన్‌కమ్ టాక్స్ కట్టే విధానం లేకుండా చేయవలసిన బాధ్యత మన ప్రభుత్వం పైన ఉంది అని కోరుతున్నాను. ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీప్రైవేటీకరణ విషయంలో ఒక సందర్భంలో 7 మైన్స్ వరల్డ్ బ్యాంక్ షరతులకు తలఒగ్గి ఐడెంటిఫై చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాకపోతే నూటికి నూరు శాతం సింగరేణీను ప్రైవేటీకరణ చేసే ఆలోచన ఆనాటి ప్రభుత్వంలో ఉంది. భగవంతుడి దయవల్ల కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కాబట్టి కార్మికులు మా సంస్థ ప్రైవేటీకరణ కాదన్న విశ్వాశంతో ఉన్నారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తునలాభాలు తేవడానికి ప్రయత్నం చేస్తున్న సందర్భంలో బోనస్ విషయంలో కాని, ఇతర విషయాలలో కాని ప్రత్యేకమైన శ్రద్ధ ప్రభుత్వం చూపించాలి. ఒకసారి నష్టాలలో ఉన్న సంస్థను బి.ఐ.ఎఫ్.ఆర్ లో పోతున్న సందర్భంలో ఆనాడు కేంద్రంలో ఉన్న మంత్రి వెంకటస్వామి గారు ఎన్.టిపిసి నుంచి రు.500 కోట్లు రుణం తీసుకు వచ్చి ఈ సంస్థను కాపాడారు. ఇప్పుడు కోట్లలో లాభాలు వస్తున్నాయి. అలాంటి పరిస్థితులలో అక్కడ కాలేజీలు లేవు. కాలేజీల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి. ప్రభుత్వం ద్వారా సింగరేణీ యాజమాన్యం వారిని ఒప్పించి ప్రధానమైన సమస్యలు పరిష్కారం చేయించాలి. తెలంగాణాలో పెద్ద ఎత్తున లాభాలు తెస్తున్న సంస్థ. వచ్చే సంవత్సరానికి రు.500, 1000 కోట్లు లాభాలు తేవడానికి కార్మికులు సిద్ధంగా ఉన్నారు. వారికి ప్రభుత్వం కావలసిన బెనిఫిట్స్ చేయాడానికి యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికులకు మేలు చేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ.2.30

శ్రీ జి. వినోద్: అధ్యక్షా, అవకాశం యిచ్చినందుకు మీకు కృతజ్ఞతలు. ముఖ్యంగా నా నియోజకవర్గం చిన్నూరు సింగరేణి కంపెనీకి సంబంధించింది. సింగరేణి కంపెనీ కార్మికుల ఆశీర్వాదంతో, వారి ఓట్లతో నేను కాంగ్రెస్ పార్టీ తరపున మంచి మెజారిటీతో గెల్చినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. నేను సింగరేణి కాలరీస్‌కు వెళ్లి చూశాను. వారి వర్కింగ్ కండిషన్స్‌ను చాలా యింప్రూవ్ చేయవలసిన అవసరం వుంది. నేను ప్రత్యేకంగా కోరుకునేది ఏమంటే వారు ఎంతో రిస్క్‌తో కూడిన పని చేస్తున్నందువల్ల , వారి విషయంలో యిన్‌కంట్యాక్స్ నిబంధనలు సడలించి, వారి ట్యాక్స్ కొంత తగ్గిస్తే బాగుంటుంది. కేంద్ర కోల్ మంత్రి దాసరి నారాయణరావు గారితో కూడా ఈ విషయమై నేను మాట్లాడడం జరిగింది. కేంద్ర ఫైనాన్స్ మినిష్టర్‌తో కూడా ప్రత్యేకంగా మాట్లాడి యిన్‌కంట్యాక్స్ తగ్గించే విషయంలో వుయ్ ఆర్ వర్కింగ్ ఆన్ యిట్. చాలామంది సింగరేణి కంపెనీలోని సేఫ్టీ పరిస్థితులను గురించి కన్‌సెర్న్ చూపించారు. సేఫ్టీ సెంట్రల్ గవర్నమెంట్ చేతిలో వుంది. మైన్స్ యాక్ట్ వారి చేతిలో వుంది. వారు సేఫ్టీ విషయంలో ప్రత్యేకచర్యలు తీసుకోవలసిన అవసరం వుంది. ఇన్‌కంట్యాక్స్‌గురించి, మైన్స్ లో పనిచేసే వర్కర్స్ సేఫ్టీ గురించి గవర్నమెంట్ తరపున పెద్దలు రోశయ్య గారు మాట్లాడతారు.

శ్రీ కె. రోశయ్య: అధ్యకా, మధ్యాహ్నం రెండున్నర గంటలయింది. సభ్యులందరికీ వినే ఆసక్తి వుంటే స్టేట్‌మెంట్ చదివి వినిపించుతాను.

( సభ్యులు స్టేట్‌మెంట్ వినడానికి ఆసక్తి కనబరచలేదు)

సభ్యులందరి సూచనలు విన్నాను. సంతోషకరమైన విషయం ఏమంటే మనకున్నటువంటి ప్రతిష్ఠాత్మకమైన సింగరేణి కాలరీస్ గడ్డుపరిస్థితి నుండి గట్టెక్కి యిప్పుడు లాభాల బాటలో పయనం చేస్తూ వుంది. మిత్రులు అనేక సూచనలు చేశారు. కార్మిక సంక్షేమం కోసం తీసుకోవలసిన చర్యలను గురించి, త్రాగునీటి వసతి గురించి, యింకా అదనపు గృహాలను నిర్మించడం గురించి, యింకా ఎన్నో సూచనలు చేయడం జరిగింది. ఇవన్నీ తప్పకుండా క్రమక్రమంగా మనం పరిశీలన చేసి నిధులను కొంచెం సర్దుబాటు చేస్తూ ఈ కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం వుందనే మాట అందరం అంగీకరిస్తున్నాము. అధ్యక్షా, ఎంత జాగ్రత్తగా చేస్తున్నప్పటికీ దురదృష్టవశాత్తు ఇటీవల రెండు ప్రమాదాలు జరిగాయి. ఒక ప్రమాదంలో 10 మంది, మరొక ప్రమాదంలో 17 మంది మరణించడం జరిగింది. చనిపోయిన 27 మందికి రు. 3 లక్షలు సింగరేణి యాజమాన్యం నుండి, రు. 3 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి, మొత్తం రు. 6 లక్షల చొప్పున చెల్లించడం జరిగింది. అంతేకాకుండా దీన్ని స్పెషల్ కేసుగా ట్రీట్ చేయడం జరిగింది. వీరికి స్టాట్యుటరీ బెనిఫిట్స్ అన్నీ యివ్వడం జరిగింది. వర్క్‌మెన్ కాంపెన్‌జేషన్, డిపెండెంట్స్ ఎంప్లాయ్‌మెంట్, అంతే కాకుండా ఎంప్లాయ్‌మెంట్ యివ్వకపోతే డిపెండెంట్ లేడీకి నెలకు రు. 4000 చొప్పున యిచ్చేట్లు ఏర్పాటు చేయడం జరిగింది. నెలకు ఒకసారి చొప్పున అక్కరలేదనుకుంటే రు. 3 లక్షలు అదనంగా యిచ్చే ఏర్పాటు జరిగింది. అదే విధంగా గ్రూప్ యిన్సూరెన్స్ అన్నీ వున్నాయి. వీటన్నింటిని కలుపుకొని వోవరాల్‌గా చూసినట్లయితే మరణించిన వ్యక్తి కుటుంబానికి రు. 10 లక్షల నుండి రు. 11 లక్షల వరకు ఇవ్వడం జరిగింది. రు. 14 లక్షలు యిచ్చినా, రు.12 లక్షలు యిచ్చినా ఎంతయిచ్చినా చనిపోయిన వారిని తీసుకురావడం జరగదు. చాలా దురదృష్టకరమైన సంఘటన. టెక్నాలజీ యింప్రూవ్ అయినా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలు సంభవించాయి. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా నివారించడానికి తప్పకుండా ఆలోచన చేయాలి. 25 కొత్త మైన్స్‌ను ఓపెన్ చేయడానికిక ప్రభుత్వం దగ్గర సింగరేణి కాలరీస్ పంపించిన ప్రతిపాదనలు కొన్ని వున్నాయి. రాబోయే కాలంలో అంటే 12వ పంచవర్ష ప్రణాళికలో 2017 సంవత్సరం నాటికి 25 కొత్త మైన్స్ ఓపెన్ చేయాలనేది టార్గెట్‌గా పెట్టుకొని మెసులుబాటును బట్టి క్రమక్రమంగా ఒకటి తరువాత ఒకటి ఓపెన్ చేస్తూ పోవాలి. అదనంగా ఎంప్లాయ్‌మెంట్ ఆపర్ట్యూనిటీస్ క్రియేట్ చేయడమే కాకుండా , వాల్యూమ్ ఆఫ్ బిజినెస్ పెంచుకోవడం,మనకున్న రిసోర్సెస్ ట్యాప్ చేసే ప్రయత్నం చేయడం జరుగుతోంది. వర్కర్స్‌కు సంబంధించిన హౌసింగ్ విషయంలో 2003 సంవత్సరం మే 31 నాటికి 47,536 మందికి ఇళ్లు వున్నాయి. ఈనాడు పనిచేస్తున్న వర్కర్స్ సంఖ్య 93,388

మంది కాగా ఇళ్లు వున్న వారి శాతం 49.2 . నేషనల్ గైడ్ లైన్స్ ప్రకారం 40 శాతం వరకు హౌసింగ్ యిచ్చి తీరాలి. గైడ్‌లైన్స్‌కి మించే యివ్వడం జరిగింది. 2004– 05 ఫైనాన్షియల్ యియర్‌లో మరొక 4000 గృహాలు కొత్తగా నిర్మించడం కోసం ప్రణాళికలు వున్నాయి. లాభాలను గురించి కొందరు మిత్రులు చెప్పారు. 1997–98 నుండి క్రమక్రమంగా లాభాలు వస్తూ వున్నాయి. ఎంప్లాయీస్ యిన్‌కంట్యాక్స్ గురించి మిత్రులు మనవిచేశారు. మొన్నటివరకు ఒక పరిణామం . నిన్న కేంద్రంలో ఆర్థికమంత్రి చిదంబరం గారు ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల సాలీనా లక్ష రూపాయల వరకు ఆదాయం వుంటే ట్యాక్స్ రిలీఫ్ యిచ్చారు. కనుక ఆనిర్ణయం వల్ల కొందరికి ఉపయోగం జరుగుతుంది. వేజ్ రివిజన్ జరుగుతే తప్పకుండా ట్యాక్స్ పడుతుంది. ఇన్‌కంట్యాక్స్ అనేది కేంద్రప్రభుత్వం దేశం మొత్తానికి విధించే పన్ను. మనం సింగరేణి కాలరీస్‌లో వున్న వారికి ట్యాక్స్ ఎగ్జమ్షన్ యివ్వండని అడుగుతే కేంద్రప్రభుత్వం అంగీకరిస్తుందని నేను భావించడం లేదు. అవకాశం వుంటే తప్పకుండా విచారణ చేస్తాము. అలాంటి సావకాశం వుంటే , సింగరేణి కాలరీస్‌లో ఇదివరకు యిచ్చివుంటే బియాండ్ వన్ లాఖ్ రూపీస్ ఎగ్జమ్షన్ కోరడానికి నాకు అభ్యంతరం లేదు. డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించి మిత్రులు మాట్లాడారు. అది ప్రధాన సమస్యగా కనబడుతోంది. ఇప్పుడున్న పద్ధతి ప్రకారం పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాల్లో ఉద్యోగం యివ్వడం తప్పకుండా అమలుచేస్తూ వున్నారు. అంతేకాకుండా మిగిలిన మరణాలకు సంబంధించి గాని, వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న వారి పిల్లలకు ఉద్యోగాలు యిచ్చే విషయంలో జాగ్రత్తగా, సునిశితంగా పరిశీలించవలసిన అవసరం వుంది.

మ.2.40

వెంకటరెడ్డిగారు చెప్పినట్లుగా వి.ఆర్.ఎస్ తీసుకున్న వారి పిల్లలకు కూడా ఉద్యోగ అవకాశాలు .....

శ్రీ చాడా వెంకటరెడ్డి : అనారోగ్యంగా ఉండి వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న వారి విషయం గురించి చెపుతున్నాను.....

శ్రీ కె.రోశయ్య : నేను సింగరేణి కాలరీస్ గురించి చెప్పలేను కాని రాష్ట్ర ప్రభుత్వంలో అనేక మంది, అదే విధంగా కేంద్ర ప్రభుత్వంలో కూడా ఈ వెసులుబాటు ఉన్నప్పుడు కూడా నాలుగైదేళ్ల సర్వీసు ఉంది అనగానే హెల్త్ గ్రౌండ్ మీద రిటైర్ కావడం, వారి పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించుకోవడం ఇది ఒక రకంగా ఆనవాయితీ అనను కాని, కొంచెం ఇబ్బందికరమైన పరిస్థితిగా ఉంది. అక్కడ దాకా అక్కర్లేదు, మనం మెడికల్ బిల్స్ చూస్తున్నాము. సిజిహెచ్ఎస్ మరి కొన్ని చోట్ల రీఇంబర్స్‌మెంట్ ఫెసిలిటీ ఉంటే, అందులో అనేకమైన సందేహాస్పదమైన బిల్లులు వస్తున్నాయి. అలాగే మెడికల్ ఇన్‌వాలిడేషన్ అని అంటే పాత రోజుల్లో దానిని ఖచ్చితంగా అమలు చేసేవారు. ఇటీవల కొంత అది దారితప్పి విస్తృతమైందని భావిస్తున్నాము. ఏమైనా సభకు మనవి చేస్తున్నాను --అనేక మంది మిత్రులు చాలా ఆందోళనగా, ఆలోచనాపూరితమైన మాటలు కూడా చెప్పారు. అవసరమని భావిస్తే నేను చెప్పిన సమాచారమే కాకుండా ఎప్పుడైనా ఒక రోజు సింగరేణి కాలరీస్ యాజమాన్యాన్ని, మిమ్మల్ని కూడా పిలిచి ముఖ్యమంత్రిగారి లెవల్‌లో కూర్చోండబెట్టి డిస్కస్ చేద్దాము . వారు ఇంతవరకు చెప్పిన మాటలను కాని, తీసుకున్నటువంటి చర్యలు కాని, సింగరేణి కాలరీస్ కంపెనీ పని తీరు మీద కాని మీరు చెప్పే సలహాలు ఏమైనా ఉంటే, across the table మాట్లాడటానికి ఎలాంటి అభ్యంతరం లేదనే మాట మనవి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

CHAIRMAN: Discussion on the Non-official Resolution will be continued next Friday. The House is adjourned to meet again at 8.30 a.m. on Monday, the 12th July, 2004.

(The House then adjourned at 2.42 P.M. to meet again at 8.30 a.m. on Monday, the 12th July, 2004)